ప్రతిపక్షం

www.prathipaksham.in

సోమవారం 10.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 230 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu



సెర్బియా దిగ్గజం జకోవిచ్ అద్భుత రికార్డు 12



2034 వరకు మాదే అధికారం

పేదల గుండె చప్పుడు పీజేఆర్ ను మనం గుర్తు చేసుకోవాలని సీఎం అన్నారు. హైదరాబాద్ లో తాగు నీటి సమస్య వచ్చినపుడు కుండలతో నిరసన తెలిపి, చంద్రబాబుపై ఒత్తిడి తీసుకొచ్చి కృష్ణా జలాలను నగరానికి తరలించేలా చేసి జంట నగరాల దాహార్తిని తీర్చారన్నారు. నాలెడ్జ్ సిటీగా మారిందంటే ఆనాటి కాంగ్రెస్ సీఎంలేనని తెలిపారు. నగరాలకు నిరంతర విద్యుత్ అందించడం వల్లే దిగ్గజ సంస్థలు నగరానికి తరలి వచ్చాయని సీఎం తెలిపారు. దేశంలో ఫార్మారంగంలో 40 శాతం మన నగరం నుంచి ఉత్పత్తి అవుతున్నాయని తెలిపారు. ఆనాటి కాంగ్రెస్ పదేళ్ల పాలన, కేసీఆర్ పదేళ్ల పాలనను పోల్చి చూడండని కోరారు.

నేను చెప్పేది రాసి పెట్టుకోండి .. కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి

- లక్ష కోట్లు పెట్టినా కాళేశ్వరం కూలింది
- ఎకరాకు కూడా వారు అదనంగా నీరివ్వలేదు
- మేం చేసిన అభివృద్ధి ఎక్కడా చెప్పకోలేదు
- వాళ్లు చేయంది కూడా బాహాటంగా చెప్పకున్నారు
- పదేండ్లలో రాష్ట్రాన్ని అప్పల కుప్పగా మార్చారు
- ప్రజాపాలనలోనే ప్రజలకు సంక్షేమ పథకాలు
- ప్రజల సంక్షేమం కోసమే మా పాలన సాగుతుంది
- 'జూబ్లీహిల్స్' ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలుపు ఖాయం
- 'మీట్ ది ప్రెస్' లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 9: మరో పదేండ్లపాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాదును అభివృద్ధి చేసే బాధ్యత తనపై ఉందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పథకాలను కొనసాగిస్తూనే, అదనంగా అనేక కొత్త పథకాలు తెచ్చానని తెలిపారు. హోటల్ తాజ్ కృష్ణాలో హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆదివారం ఏర్పాటు చేసిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎవరిది అగ్రికల్చరో, ఎవరిది డ్రగ్స్ కల్చరో ప్రజలు ఆలోచించుకోవాలని సూచించారు. గల్లీ గల్లీలో గంజాయి కల్చర్ తీసుకొచ్చింది ఎవరో ఆలోచించాలని కోరారు. సెంటిమెంటా, డెవలప్ మెంటా, జూబ్లీహిల్స్ ప్రజలు తేల్చుకోవాలన్నారు. పీజేఆర్ చనిపోయినప్పుడు కేసీఆర్ అభ్యర్థిని నిలబెట్టి ఎన్నికలు తెచ్చారని అన్నారు. రాంరెడ్డి వెంకటరెడ్డి విషయంలోనూ కేసీఆర్ అదే విష సంస్కృతి తెచ్చారని ధ్వజమెత్తారు. మాగంటి గోపీనాథ్‌తనకు మిత్రుడేననీ, కానీ, నియోజకవర్గం అభివృద్ధి చేయాలి కదా! అని పేర్కొన్నారు. ఫేక్‌సర్వేలకు మీడియా ప్రాధాన్యం ఇవ్వొద్దని కోరారు. 1994-2004 మధ్య టీడీపీ, 2004- 2014 మధ్య కాంగ్రెస్ రాష్ట్రాన్ని పాలించాయని, 2014-2023 మధ్య బీఆర్ఎస్ పాలించిందని తెలిపారు. ఇప్పుడు 2023 నుంచి పదేండ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందన్నారు. జూబ్లీహిల్స్ గెలవాల్సిందే, అభివృద్ధి జరగాల్సిందేనని చెప్పారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని సీఎం ధీమా వ్యక్తం చేశారు. ఎంత మెజారిటీతో గెలుస్తామో చెప్పలేమన్నారు. బీజేపీ డిపాజిట్ కోల్పోవడం ఖాయమని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ విలీనాన్ని తాను అడ్డుకున్నానని కవితే చెప్పారు కదా? అని రేవంత్ గుర్తుచేశారు. కేసీఆర్ తోనే బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని సీఎం ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్‌లో తమను గెలిపించాలని కేసీఆర్ ఇప్పటివరకు ఎందుకు విజ్ఞప్తి చేయలేదని ప్రశ్నించారు. తన కండ్ల ముందే బీఆర్ఎస్ పార్టీ కూలిపోతుంటే కేసీఆర్ మౌనంగా కుమిలిపోతున్నారని అన్నారు. ఎన్నికల విషయంలో తనది 'లీడర్ మైండ్‌సెట్'

..:: మిగతా 2లో

14న 'రేవంత్' భవితవ్యం తేలుతుంది

కుర్చీ ఉంటుందో, ఊడుతుందో చూడాలి




- కేసీఆర్ పాలనలోనే నిజమైన అభివృద్ధి
- కత్తి మాకివ్వండి, మేము బుల్డోజర్లను ఆపుతాం
- మళ్లీ కేసీఆర్ రాజ్యం తీసుకురావాలి
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

చిటుకుల మైసారెడ్డి, ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 9: ఈ నెల 14న వెలువడే జూబ్లీహిల్స్ తీర్పే రేవంత్ రెడ్డి భవిష్యత్తును నిర్ణయిస్తుందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం ఆయన యూసఫ్‌గూడలో రోడ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఓటు వేసే ముందు గుండె మీద చేయి వేసుకుని ఆలోచించి ఓటేయాలి. కేసీఆర్ అందరినీ కడుపులో పెట్టుకొని చూసుకున్నారు. అన్ని రంగాలలో తెలంగాణను అభివృద్ధి చేసుకున్నాం' అని చెప్పారు. బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశామని, ప్రతి కుటుంబానికి

..:: మిగతా 2లో



పెరిగిన చలి తీవ్రత

అత్యల్పంగా 14.9 డిగ్రీల ఉష్ణోగ్రత.. గజగజ వణుకుతున్న తెలంగాణ

- ఉదయం 9 గంటల వరకు మంచు ప్రభావం
- సాయంత్రం 5 గంటల నుంచే చలిగాలులు
- వేగంగా పడిపోతున్న గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు
- 11 నుండి 19 వరకు -10 రోజులు జర పదిలం
- దక్షిణ, తూర్పు తెలంగాణ జిల్లాలలో మోస్తారు చలి
- తగు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు
- నిపుణుల సూచనలు పాటించాలన్న వాతావరణ శాఖ

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్

నవంబర్ 9 : తెలుగు రాష్ట్రాలలో నిన్న మొన్నటి వరకు వర్షాలు దంచికొట్టాయి. ఎడతెరిపి లేని వర్షాలతో రెండు రాష్ట్రాలలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నా రు. ఇటీవల మొంథా తుపాను తీవ్రత తగ్గిన తరువాత వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. అయితే, తాజాగా చలి తీవ్రత పెరిగింది. వానాకాలం ఇట్ల పూర్తయిందో లేదో చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగిపోయింది. సాయంత్రం ఐదు గంటల నుంచే చలిగాలులు వీస్తున్నాయి. ఇక ఉదయం పూట

..:: మిగతా 2లో

ప్రచారం ముగిసింది



- మూగబోయిన మైకులు
- పోలింగ్ నిర్వహణపై అభ్యర్థుల దృష్టి
- చివరి రోజు కీలక నేతల సుడిగాలి పర్యటన
- ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీకి శ్రీకారం
- పోటాపోటీగా పార్టీల తాయిలాల పంపిణీ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 9 : తెలుగు రాష్ట్రాలలో ఉత్కంఠ రేకెత్తిస్తున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారానికి ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు తెరపడింది. గత రెండు మాసాల నుంచి మారుమోగిన మైకులు

..:: మిగతా 2లో

గుజరాత్‌లో ఇద్దరు ఉగ్రవాదుల అరెస్టు

- రెండు పిస్టల్స్, బెరెట్టా పిస్టల్, 30 బుల్లెట్లు స్వాధీనం

దేశవ్యాప్తంగా ఉగ్రదాడులకు కుట్ర పన్నుతున్నారంటూ ముగ్గురు ఉగ్రవాదులను అహ్మదాబాద్‌లో గుజరాత్ యాంటీ-టెర్రరిజం స్క్వాడ్ ఆదివారం అరెస్టు చేసింది. యేడాది నుంచి వీరి మీద నిఘా పెట్టిన అధికారులు ఆయుధాలు సరఫరా చేస్తుండగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు గ్లోక్ పిస్టల్స్, ఒక బెరెట్టా పిస్టల్, 30 బుల్లెట్లు, 4 లీటర్ల ఆముదం నూనెను స్వాధీనం చేసుకున్నారు.

..:: 11లో





ఓట్ల చోరీని బీజేపీ సంస్థాగతం చేస్తోంది

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి రాహుల్ గాంధీ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్ అనేది ఓట్ల చోరీని కప్పిపుచ్చే ప్రయత్నమని విమర్శించారు.


11



చొరబాటు దారులకు విపక్షాల మద్దతు

కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా విపక్ష పార్టీలపై మరోసారి విరుచుకుపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ బిహార్‌లో పారిశ్రామిక కారిడార్ నిర్మించాలని అనుకుంటున్నారని, మహాఘట్‌బంధన్ కూటమి మాత్రం ఇందుకు వ్యతిరేకిస్తున్నదని ఆరోపించారు.


11



ఆధ్యాత్మిక రాజధానిగా ఉత్తరాఖండ్

పెద్ద ఎత్తున తీర్థయాత్ర స్థలాలున్న ఉత్తరాఖండ్ రానున్న కాలంలో ప్రపంచ ఆధ్యాత్మిక రాజధానిగా మారుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.

11



పాకిస్తాన్‌కు అర్థమయ్యే రీతిలో జవాబు చెప్పాలి

దాయాది దేశం పాకిస్తాన్ కు అర్థమయ్యే భాషలోనే సమాధానం చెప్పాల్సి ఉంటుందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. భారత్‌కు సహకరిస్తేనే వారికి మేలు జరుగుతుందన్నారు.

11

రాజకీయం

ప్రచారం ముగిసింది

మొదటిపేజీ తరువాయి

మూగబోయాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నువ్వా నేనా అన్నట్లు కలిసి వచ్చిన అవకాశాలన్నింటిని ఉపయోగించుకున్నాయి. ఈ నెల 11న పోలింగ్ జరగనుండగా, 14వ తేదీన ఫలితం తేలనుంది. ఈ ఉపఎన్నికలో 58 మంది అభ్యర్థులు రంగంలోకి దిగగా ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ నెలకొంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో ఈ ఉపఎన్నిక అనివార్యమైంది. ఆయన భార్య మాగంటి సునీత పోటీ చేస్తుండగా, అధికార కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీజేపీ నుంచి లంకల దీపక్‌రెడ్డి పోటీలో నిలిచారు. ఈ ఎన్నికను మూడు పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. కాంగ్రెస్ తరఫున సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. నాలుగు రోజులు రోడ్ షో నిర్వహించారు. డివిజనుకు ఇద్దరేసి మంత్రులు చొప్పున పది పోలింగ్ కేంద్రాలకు ఒక ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీని, ప్రతి వంద మంది ఓటర్లకు ఒక నేతను బాధ్యులుగా నియమించారు. నియోజకవర్గంలో రూ.300 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని, అలాగే సంక్షేమ పథకాలను అమలు చేశామని విస్తృతంగా ప్రచారం చేశారు.

బీఆర్ఎస్ బాకీ కార్డుల ప్రచారం

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో ఒక్కటీ నెరవేర్చలేదంటూ ఆ పార్టీ బాకీ కార్డుల ప్రచారం బీఆర్ఎస్ విస్తృతంగా చేసింది. దివంగత మాగంటి గోపీనాథ్ భార్య సునీత పోటీ చేస్తుండడంతో సెంటిమెంట్‌ను ప్రజలలోకి బలంగా తీసుకెళ్లింది. స్వయంగా కేటీఆర్ అన్నీ తానై వ్యూహాలను రూపొందించారు. అన్ని డివిజన్లలో విస్తృతంగా పర్యటించి రోడ్ షోలు నిర్వహించారు. కేసీఆర్ ప్రచారంలో పాల్గొంటారని భావించినా, ఆయన పార్టీ ముఖ్యులకు దిశానిర్దేశం మాత్రమే చేశారు. బీఆర్ఎస్ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. హరీశ్‌రావు తండ్రి మరణించడంతో ప్రచార బాధ్యత మొత్తం కేటీఆర్‌నే చూసుకున్నారు. సామాజిక వర్గాలవారీగా సమావేశాలు నిర్వహించి, తెర వెనుక మంత్రాంగం నడిపారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనంటూ

జూబ్లీహిల్స్‌లో మనుగడ కోసం బీజేపీ తీవ్రంగానే ప్రయత్నాలు చేస్తోంది. ముక్కోణపు పోటీలో తమదే గెలుపు అని ధీమా వ్యక్తం చేస్తోంది. అభ్యర్థి ప్రకటన జాప్యం కారణంగా ప్రచారం ఆలస్యంగా ప్రారంభమైంది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నీ తానై ప్రచారం నిర్వహించారు. రోడ్‌షోలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ రఘునందన్‌రావు తదితరులు కూడా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ నియోజకవర్గంలో మైనార్టీ ఓట్లు అధికంగా ఉన్నా, ఇతర ఓటర్ల ఐక్యత కోసం ప్రయత్నాలు జరిగాయి. భారీగా స్వతంత్రులు పోటీ పడినా పెద్దగా ప్రచారం అనేది లేదు. కొంత మంది ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ పోటీకి దిగగా, కానీ ఇక్కడ నిరుద్యోగ జేఏసీ ప్రచారాన్ని కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం వివాదంగా మారింది.

ఆ బస్తీలే పార్టీల బలగం

బోరబండ, రహమత్‌నగర్ డివిజన్ సరిహద్దులలో ఉండే దిగువ మధ్య తరగతి ఓటర్ల మద్దతు అనేది కీలకంగా మారింది. వీరి ప్రసన్నం కోసం కొన్ని రోజులుగా రెండు ప్రధాన పార్టీలు నిశితంగా దృష్టి పెట్టాయి. ఈ రెండు డివిజన్ల పరిధిలోనే 1.10 లక్షల ఓట్లు ఉన్నట్లు అంచనా. వాటిలో ఎన్ఆర్ఆర్‌పురం, సైట్ 1,2,3, ఇందిరా నగర్, సాయిబాబానగర్, రాజునగర్, వినాయకనగర్, ఎస్పీఆర్ హిల్స్‌తో పాటు 50 బస్తీలు ఉన్నాయి. మరోవైపు ప్రతిభానగర్, ఇందిరానగర్, రాజీవ్‌గాంధీనగర్ తదితర బస్తీలు ఉన్నాయి. ఒక్కో వీధిలో 1000 నుంచి 2000 మంది ఓటర్లు నివసిస్తున్నారు. కొన్ని చోట్ల ఉన్న మురికివాడల్లో ఇంతకంటే ఎక్కువ మంది నివాసం ఉంటున్నారు. ప్రచారం ముగియడంతో ముఖ్య పార్టీల నేతలు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రంగాన్ని సిద్ధం చేశాయి. భారీ ఎత్తున మద్యం, డబ్బులు పంపిణీ చేసేందుకు నిర్ణయించాయి. ఆదివారం సాయంత్రం నుంచి, సోమవారం రాత్రి వరకు డబ్బు, మద్యం పంపిణీకి అంతా రెడీ అయ్యారు.



నా కుమారుడి మరణం ఇప్పటికీ మిస్టరీయే

- దివంగత గోపీనాథ్ తల్లి సంచలన వ్యాఖ్యలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో,హైదరాబాద్, నవంబర్ 9 : జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. తన కుమారుడు మాగంటి గోపీనాథ్ మరణం మిస్టరీగా అనిపిస్తోందని ఆయన తల్లి మహానంద కుమారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన ఎప్పుడు మృతి చెందారన్నది తల్లిగా తనకే తెలీదన్నారు. 'జూన్ ఆరున చనిపోయారా! ఎనిమిదిన చనిపోయారా?' అన్నదీ సందేహంగానే ఉందన్నారు. కేటీఆర్ అమెరికా నుంచి వచ్చిన తర్వాతే గోపీనాథ్ మరణ వార్తను బయటకు చెప్పటం వెనక పరమార్థం ఏంటో ఇప్పటికీ తెలియటం లేదన్నారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో గోపీనాథ్ మొదటి భార్య మాలిని, ఆమె కుమారుడు తారక్‌తో కలిసి మహానంద కుమారి మీడియాతో ఆదివారం మాట్లాడారు. గోపీనాథ్ మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై గొప్ప పేరు తెచ్చుకున్నారని, అలాంటి వ్యక్తి హాస్పిటల్‌లో ఉంటే ఒక్క రోజు కూడా తనను చూడటానికి టైమ్ ఇవ్వలేదని వాపోయారు. ఒక్క అటెండర్‌ను కూడా పెట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గోపీనాథ్ జూన్ ఎనిమిదిన చనిపోయారని చెప్పారని వివరించారు. కేటీఆర్ వచ్చిన అనంతరమే బయటకు చెప్పారని ఆరోపించారు. లీగల్ హెయిర్ సర్టిఫికెట్‌లో మొదటి భార్య, బిడ్డలు, తన పేరు కూడా లేదన్నారు. మొదటి భార్యతో విడాకులు కూడా కాలేదన్నారు. తాను గోపీనాథ్‌తో సునీత పెళ్లి చేయలేదన్నారు. ఫ్యామిలీ సర్టిఫికెట్‌లో తమ పేరు లేదని వివరించారు. కేటీఆర్‌తో తనకు జరిగిన అన్యాయం గురించి చెప్పాలి అనుకుంటే ఆయన కూడా వినలేదన్నారు. ఇది డబ్బు సమస్య కాదని మాకు గుర్తింపు లేకనే ఇలా మీడియా ముందుకొచ్చామన్నారు. తల్లిగా ఎంతో బాధపడుతున్నానని అన్నారు. సునీతకు టికెట్ ఇచ్చేటప్పుడు కేటీఆర్ తనకు కనీసం సమాచారం ఇవ్వలేదన్నారు.



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సూచన
- సైబర్ క్రైం నియంత్రణపై అవగాహన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 9 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీజీపీ శివధర్ రెడ్డి సూచించారు. ఫోన్ కాల్, సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఇంటరాక్షన్‌తోనే సైబర్ కేటుగాళ్లు నేరాలు చేస్తున్నారని తెలిపారు. కొత్త నేరస్థులు కూడా డేటాను సులభంగా సేకరిస్తున్నారని చెప్పారు. ఎవరు ధనవంతులు? ఏ లొకేషన్‌లో ఎవరూ ఉంటారు? వయస్సు, లింగం వంటి వివరాలు అన్నీ తెలుసుకొని వారినే సైబర్ మోసగాళ్లు లక్ష్యంగా ఎంచుకుంటున్నారని పేర్కొన్నారు. ఇది ఒక తీవ్ర సామాజిక సమస్యగా మారిందని డీజీపీ వివరించారు. హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు సైబర్‌క్రైమ్ నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీజీపీ శివధర్‌రెడ్డి, నగర సీపీ సజ్జనార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ సైబర్ అవేర్‌నెస్ ను ఒక 'మూవ్‌మెంట్'గా తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. మహిళలు, వృద్ధులు, గృహిణులు సైబర్ కేటుగాళ్లకు ప్రధానంగా లక్ష్యంగా మారుతున్నారని అన్నారు. ప్రజలు అత్యంత మెలకువగా ఉండాల్సిన సమయం ఇదని తెలిపారు. యువకులు, రిటైర్డ్ వ్యక్తులు, ప్రముఖులు అందరూ కూడా అవేర్‌నెస్‌లో భాగం కావాలని సూచించారు. సైబర్ అవేర్‌నెస్ గురించి ఒకరు పదిమందికి, పది మంది ఇరవై మందికి చెబితే ఇది పెద్ద మాస్ మూవ్‌మెంట్ అవుతుందన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో 24 గంటలు 'సైబర్ పెట్రోలింగ్' ద్వారా పనిచేస్తోందని శివధర్ రెడ్డి వివరించారు.

2034 వరకు మాదే అధికారం



మొదటిపేజీ తరువాయి

కాదని, క్యాడర్ మైండ్‌సెట్' అని చెప్పారు. అందుకోసమే జూబ్లీహిల్స్ అన్ని డివిజన్ లలో తాను ప్రచారం చేశానని చెప్పారు. ఇంటింటి ప్రచారానికి కూడా తాను సిద్ధమయ్యానని, భద్రతా విభాగం అనుమతించలేదన్నారు.

కేటీఆర్ అరెస్టుకు గవర్నర్ అనుమతి కోరాం

ఫార్ములా వన్ కేసులో కేటీఆర్ ను అరెస్టు చేయడానికి గవర్నర్ అనుమతి కోరామని సీఎం చెప్పారు. మూడు నెలలవుతున్నా గవర్నర్ అనుమతి ఇవ్వలేదన్నారు. కాళేశ్వరం విచారణను సీబీఐకి అప్పగించామని, ఇంతవరకూ సీబీఐ ఎందుకు విచారణ ప్రారంభించలేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చిన సోనియా గాంధీ దానిని నెరవేర్చేందుకు రాజకీయంగా నష్టపోయినా లెక్కచేయలేదని తెలిపారు. కాంగ్రెస్ జలయజ్ఞం ద్వారా సాగునీటిని అందించేందుకు కృషి చేసిందని అన్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, ఆర్డీఎస్, ఇందిరాసాగర్, ఎస్ఎల్బీసీ, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులు చేపట్టిందన్నారు. కాంగ్రెస్ ఎస్సారెస్పీ, మిడ్ మానేరు, శ్రీపాద ఎల్లంపల్లి ఇలా చాలా ప్రాజెక్టులు చేపట్టిందన్నారు.

పేదల గుండె చప్పుడు పీజేఆర్

పేదల గుండె చప్పుడు పీజేఆర్ ను మనం గుర్తు చేసుకోవాలని సీఎం అన్నారు. హైదరాబాద్ లో తాగు నీటి సమస్య వచ్చినపుడు కుండలతో నిరసన తెలిపి, చంద్రబాబుపై ఒత్తిడి తీసుకొచ్చి కృష్ణా జలాలను నగరానికి తరలించేలా చేసి జంట నగరాల దాహార్తిని తీర్చారన్నారు. నాలెడ్జ్ సిటీగా మారిందంటే ఆనాటి కాంగ్రెస్ సీఎంలేనని తెలిపారు. నగరాలకు నిరంతర విద్యుత్ అందించడం వల్లే దిగ్గజ సంస్థలు నగరానికి తరలి వచ్చాయని సీఎం తెలిపారు. దేశంలో ఫార్మారంగంలో 40 శాతం మన నగరం నుంచి ఉత్పత్తి అవుతున్నాయని తెలిపారు. ఆనాటి కాంగ్రెస్ పదేళ్ల పాలన, కెసీఆర్ పదేళ్ల పాలనను పోల్చి చూడండని కోరారు. 60 వేల కోట్ల మిగులుతో రాష్ట్రాన్ని అప్పగిస్తే పదేళ్లలో 8 లక్షల 11 వేలకోట్ల అప్పులతో వాళ్లు మాకు అప్పగించారంటూ రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ పై ధ్వజమెత్తారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో... పాతాళంలోకి పడిపోయే స్థితిలో రాష్ట్రాన్ని తమకు అప్పగించారన్నారు.

పెరిగిన చలి తీవ్రత

మొదటిపేజీ తరువాయి

చలి తీవ్రత పెరిగింది. ఉదయం తొమ్మిది గంటల వరకు చలి గజగజ వణికిస్తోంది. అదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, వరంగల్, భూపాలపల్లి, ములుగు, నుంచి జోగులాంబ గద్వాల్ జిల్లా వరకు చలి సాధారణం కన్నా ఎక్కువగా ఉంటుంది. మరో 15 రోజుల పాటు రాష్ట్రంలో పొడి వాతావరణ పరిస్థితులే ఉండే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు గతంలో ఎన్నడూ లేనంతగా ఈ యేడాది చలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నా రు. శనివారం అన్ని జిల్లాలలో 20 డిగ్రీలలోపే రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యా యి. కొన్ని ప్రాంతాలలో 15 డిగ్రీల లోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. హైదరాబాద్ లోనూ చలి గజగజ వణికిస్తుంది. ఉదయం తొమ్మిది గంటల వరకు పొగమంచు ప్రభావం ఉంటుంది. నగరం పరిధిలోని అత్యల్పంగా 14.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే రోజులలో చలి తీవ్రత మరింత పెరుగుతుందని, రాత్రి, ఉదయం బయటకు వచ్చేవారు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

తెలంగాణకు చలి హెచ్చరిక: ఈ నెల 11 నుండి 19 వరకు 10 రోజుల పాటు చలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్ కు పడిపోవచ్చు. 11-14 డిగ్రీల మధ్య ఉండే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాలకు సమీపంలోని దక్షిణ, తూర్పు తెలంగాణ జిల్లాలలో మోస్తరు చలి ఉండవచ్చు. సాధారణంగా ఇంత దీర్ఘకాలం చలి తీవ్రత తరచుగా ఉండదు, కానీ, ఈ సంవత్సరం 8 నుంచి 10 రోజుల పాటు తీవ్రమైన చలి వాతావరణం ఉండ బోతోందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.





14న 'రేవంత్' భవితవ్యం తేలుతుంది

మొదటిపేజీ తరువాయి

20 వేల లీటర్ల వరకు ఉచిత నీరు అందించామని, కరెంట్ కష్టాలు తొలగించామని గుర్తుచేశారు. వెంగళ్‌రావు నగరంలో వెయ్యి పడకల ఆస్పత్రి నిర్మాణం జరుగుతోందని, నగరంలో 42 ఫ్లైఓవర్లు, కొత్త లింక్ రోడ్లు ఏర్పాటు చేశామని వివరించారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటికి సమాన ప్రాధాన్యత ఇచ్చామని, లక్షల కొద్దీ ఐటీ ఉద్యోగాలు తీసుకొచ్చామని తెలిపారు. పేదలు కొంత కష్టపడి కుటుంబ భవిష్యత్తు కోసం ప్లాట్లు కొన్నారు కానీ, కాంగ్రెస్ పాలనలో ఆ ప్లాట్ల విలువలు పడిపోయాయని విమర్శించారు. 'ఇటు మనం పెట్టిన పెట్టుబడులు హారతికర్పూరంలా కరిగిపోతున్నాయి. ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ అందరినీ మోసం చేసింది. తులం బంగారం ఇస్తామని, పెన్షన్లు పెంచుతామని చెప్పి ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు' అని కేటీఆర్ అన్నారు.

పేదల ఇళ్లను కూలగొడుతున్నారు

'ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్నవారు ఇప్పుడు పేదల ఇళ్లను కూలగొడుతున్నారు. శనివారం, ఆదివారం అని బుల్డోజర్‌లు పంపి వేల ఇళ్లు నేలమట్టం చేశారు. ఇళ్లను కూలగొట్టే వాళ్లకు ఓటు వేయాలా?' అని కేటీఆర్ ప్రజలను ప్రశ్నించారు. 'కత్తి కాంగ్రెస్‌కు ఇచ్చి యుద్ధం మమ్మల్ని చేయమంటారా? కత్తి మాకు ఇవ్వండి, బుల్డోజర్‌లకు అడ్డంగా వెళ్లి ఆపే బాధ్యత మాది. బుల్డోజర్‌లను ఆపాలంటే కారు గుర్తుకు ఓటేయాలి' అని పిలుపునిచ్చారు. మాగంటి సునీతను మనం గెలిపిస్తే కేసీఆర్ మళ్లీ సీఎంగా వస్తారని, 500 రోజులలో కేసీఆర్‌ను సీఎం చేయాలని అన్నారు. రేవంత్ రెడ్డి మాట్లాడే తీరు చిల్లరగా ఉందని పెన్షన్ అడిగితే గుడ్లు పీకుతానంటాడని విమర్శించారు. తులం బంగారం అడిగితే పేగులు పీకి మెడలో వేస్తానంటాడన్నారు. ఎమ్మెల్యేలు కూడా డబ్బుల కోసం వరల్డ్ బ్యాంక్‌కి లేఖ రాయాల్సిన స్థితి వచ్చిందని కేటీఆర్ విమర్శించారు.



పథకాల పేరుతో ప్రజలను బెదిరిస్తున్నారు

'రేవంత్ రెడ్డి పథకాల పేరుతో ప్రజలను బెదిరిస్తున్నారు. ఓటు వేయకపోతే పథకాలు ఆపేస్తానని అంటున్నారు. పోలీసులను, సినీ కార్మికులను కూడా ఇబ్బంది పెడుతున్నారు. రేవంత్ పాలనలో పోలీసులు సైతం భద్రత లేకుండా ఉన్నారు. కేసీఆర్ ప్రభుత్వం వస్తేనే అందరికీ న్యాయం జరుగుతుంది' అని కేసీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ముస్లింలను ఉద్దేశించి మాట్లాడుతూ, 'రేవంత్ రెడ్డి ముస్లింలను కూడా బెదిరించారు. కాంగ్రెస్ లేకపోతే ముస్లింలు లేరంటారు. ఇదేనా వారి పద్ధతి? కేసీఆర్ మైనార్టీలను అన్ని విధాలుగా ఆదుకున్నారు. కానీ, అసదుద్దీన్ ఎందుకు ఇప్పుడు రేవంత్ రెడ్డికి మద్దతు ఇస్తున్నారో చెప్పాలి' అన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ ప్రజలకు ఇప్పుడు గొప్ప అవకాశం వచ్చింది. బీఆర్ఎస్‌ను గెలిపిస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుంది. కారు గుర్తుకు ఓటేయండి, మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించండి. కాంగ్రెస్ దొంగ ఓట్లు వేయాలని చూస్తోంది. వాళ్లకు బుద్ధి చెప్పే సమయం వచ్చింది' అని పిలుపునిచ్చారు.

ప్రతిపక్షాలకు భంగపాటు తప్పదు

- జూబ్లీహిల్స్ ఓటర్లు మా వైపే ఉన్నారు
- ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 9 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రతిపక్షాలకు భంగపాటు తప్పదని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పోయే అందరీ పార్టీ కాంగ్రెస్ వైపే నియోజకవర్గ ఓటర్లంతా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. సోమాజిగూడ డివిజన్ పరిధి వివిధ కాలనీలు, బస్తీలలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ఆయన ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. అపార్ట్ మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల అసోసియేషన్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హైదరాబాద్ మహా నగరాభివృద్ధికి గత కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు, చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టుల గురించి వివరించారు. నగరాభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన భవిష్యత్తు కార్యాచరణపై సలహాలు సూచనలు స్వీకరించారు. తొమ్మిదేండ్ల పాలనలో బీఆర్ఎస్ పాలకులు నగరాన్ని గాలికి వదిలేశారని విమర్శించారు. కొన్ని ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు, అండర్ పాస్ లను నిర్మించి మొత్తం నగరాన్ని అభివృద్ధి చేశామంటూ గొప్పలు చెప్పుకున్నారన్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి వేరని, ఇప్పటికీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని చాలా కాలనీలు, బస్తీలలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు లేవన్నారు. రెండేండ్లలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారన్నారు. తమ ఉనికిని కాపాడుకునేందుకు బీఆర్ఎస్, బీజేపీ బురద రాజకీయాలకు పాల్పడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.





తమది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం. ఏ పని ఉన్నా అది రెవెన్యూ ఉద్యోగుల వల్లే సాధ్యం. గతంలో ఉద్యోగులను ఇబ్బందులు పెట్టారు. వైసీపీ ప్రభుత్వం భూమి సమస్యలు సృష్టించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామ సభల ద్వారా ఆ సమస్యలు పరిష్కరించాం.

\- ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్





కేసీఆర్ పాలన దేశానికి ఆదర్శం

- **అభివృద్ధి, సంక్షేమంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే అగ్రగామి**
- **ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి హరీశ్ రావు**

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 9 : కేసీఆర్ పాలననే దేశానికి ఆదర్శం అని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆదివారం జరిగిన ఎర్రగడ్డలోని మోతీనగర్ వాసవీ బృందావనం అపార్టుమెంటువాసుల ఆత్మీయ సమ్మేళనానికి మాజీ మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడే సమయంలో ఎన్నో అనుమానాలు, అపోహలు వ్యక్తమయ్యాయని, తెలంగాణ వస్తే తాగడానికి నీళ్లు ఉండవని, కరెంటు ఉండదని, పరిపాలనే చేతకాదని కొందరు అన్నారని గుర్తు చేశారు. కానీ, గత పదేండ్ల కేసీఆర్ పాలనతో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. 'బెంగాల్ ఆచరిస్తుంది, దేశం అనుసరిస్తుంది' అన్న నానుడిని మార్చి, 'తెలంగాణ ఆచరిస్తుంది, దేశం అనుసరిస్తుంది' అన్నట్టుగా కేసీఆర్ పాలన సాగిందని అన్నారు. స్వతంత్ర భారతదేశం ఏర్పడిన నాటి నుంచి తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతూనే ఉన్నారని అన్నారు. 'ప్రతి ఇంటికి శుద్ధి చేసిన మంచినీటిని అందించకపోతే ఓటే అడగను' అని చెప్పిన ఏకైక నాయకుడు కేసీఆర్' అని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నీటిని అందించినందుకు, కేంద్ర ప్రభుత్వం కూడా దీనిని ఆదర్శంగా తీసుకుని 'హర్ ఘర్ జల్' పథకాన్ని ప్రారంభించిందని, కానీ ఎనిమిదేళ్లయినా ఆ పథకం పూర్తి కాలేదని విమర్శించారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణకు కేసీఆర్ శ్రీకారం చుట్టారని, కేంద్రం అమృత్ పథకం కింద కూడా తెలంగాణ ప్రణాళికలను ఆదర్శంగా తీసుకుందని చెప్పారు. హైదరాబాదులో పది లక్షల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి లా అండ్ ఆర్డర్ బలోపేతం చేశారన్నారు. షీ టీమ్స్ ఏర్పాటు చేయడం ద్వారా మహిళలకు భద్రతను కల్పించారు. ఇవన్నీ దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు.

నవీన్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపించండి

- **వేలకోట్లతో జూబ్లీహిల్స్ ను అభివృద్ధి చేసుకోవచ్చు**
- **బీఆర్ఎస్ నేతలు నగరాన్ని గాలికి వదిలేశారు**
- **విలేకరులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 9 : అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో వేల కోట్లతో అభివృద్ధి పనులు చేసుకునే అవకాశం ఉంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన యూసుఫ్ గూడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'నవీన్ యాదవ్ స్థానికుడు, మంచి సేవకుడు, ఈ పదవి ఉన్నా లేకున్నా స్థానికంగా సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టిన వ్యక్తి, బలహీన వర్గాలకు చెందిన వ్యక్తి, కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతాలను నమ్మి ఆచరించే వ్యక్తి' అని తెలిపారు. నవీన్ యాదవ్ ను గెలిపించుకుంటే మంత్రులందరినీ సమన్వయం చేసుకొని నవీన్ యాదవ్ వేల కోట్ల నిధులతో మురికివాడలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. యువకుడిని గెలిపించుకోవడం ద్వారా నియోజకవర్గంలో రోడ్లు, డ్రెయినేజీ, మంచి నీటి వసతి, రేషన్ కార్డులు వంటి పనులు వేగంగా పరిష్కరించుకునే అవకాశం ఉన్నందున నవీన్ యాదవ్ ను ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని డిప్యూటీ సీఎం జూబ్లీహిల్స్ నియోజకవర్గం ప్రజలను విజ్ఞప్తి చేశారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేయకుండా గాలికి వదిలేసారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సుమారు 100 కోట్లతో కేవలం జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోనే అభివృద్ధి పనులు చేపట్టింది అన్నారు.



'జూబ్లీహిల్స్'లో భట్టి సుడిగాలి పర్యటన

- **మంత్రులతో సమన్వయం, ప్రత్యేకంగా భేటీ**

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 9 : జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం చివరి రోజు ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం ప్రజాభవన్ నుంచి నేరుగా ఎర్రగడ్డ డివిజన్ లో నీ మోతీ నగర్ కు వెళ్లారు. మంత్రి జూపల్లి తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆ తర్వాత యూసుఫ్ గూడ డివిజన్ కు చేరుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ప్రచారం నిర్వహించారు. మంత్రి పొన్నంతో పరిస్థితిని సమీక్షించారు. ఆ తర్వాత వెంగళరావు డివిజన్ లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరితో భేటీ అయ్యారు. రహమత్ నగర్ డివిజన్ లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో, బోరబండ డివిజన్ లో సీతక్కతో సమీక్ష నిర్వహించారు. చివరగా యూసుఫ్ గూడ డివిజన్ లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. యూసఫ్ గూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులందరితో, పార్టీ నేతలతో ప్రత్యేకంగా సమావేశమై పరిస్థితిని సమీక్షించారు, పకడ్బందీగా పోలింగ్ చేయించుకొని పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు అవసరమైన చర్యలకు సంబంధించి సుదీర్ఘంగా చర్చించారు.



విద్యావంతుడు నవీన్ యాదవ్‌ను గెలిపించండి

- **ఓటమి భయంలో బీఆర్ఎస్ అసహనంతో ఉంది**
- **ఇక్కడ బీజేపీకి 10 వేల ఓట్లు కూడా దాటవు**
- **మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్**

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 9 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విద్యావంతుడు యువకుడు, స్థానికుడు, పేదలు, ఎస్సీ, ఎస్టీ ,బీసీ మైనార్టీ వర్గాల సమస్యల అవగాహన ఉన్న నేత నవీన్ యాదవ్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సినీ కార్మికుల సమస్యల పై అవగాహన ఉన్నందున, వారి సమస్యల పరిష్కారానికి అండగా ఉంటాడని పేర్కొన్నారు. ఆదివారం ఆయన యూసుఫ్ గూడా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉన్నత విద్యావంతుడు నవీన్ యాదవ్ ను నియోజకవర్గ ప్రజలు నిండుగా ఆశీర్వదిస్తున్నారన్నారు.
బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ చట్టం చేసిన సందర్భంలో బలహీన వర్గాల బిడ్డకు జూబ్లీహిల్స్ లో టికెట్ ఇచ్చిందని గుర్తు చేవారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో జూబ్లీహిల్స్ అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఓటమి తప్పదని భావించి బీఆర్ఎస్ పార్టీ నేతలు అసహనంతో మాట్లాడుతున్నారన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంట్ నియోజవర్గంలోనే జూబ్లీహిల్స్ ఉందని, వారికి ఇక్కడ పది వేల ఓట్లు కూడా దాటవన్నారు. వారు ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీ లాగ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తమ మా అభ్యర్థి మీద సంబంధం లేని రాజకీయ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పాల్గొన్నారు.



పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- **బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ నవంబర్ 9: మొంథా తుఫాన్ నష్టం అంచనాలను వ్యవసాయ అధికారులు రైతుల పొలాలను సందర్శించి పక్కా నివేదిక తయారు చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఏ ఒక్క నష్టపోయిన రైతు మిగలకుండా ప్రతి ఒక్కరిని కవర్ చేయాలని సూచించారు. నిర్ణీత నమూనాలో తుఫాన్ నష్టం అంచనా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, ఆర్అండ్ బీ రోడ్లు ఎంత మేరకు మరమ్మత్తులకు గురైందనే అంశాలను క్షేత్ర స్థాయి పరిశీలన చేసి పూర్తి ఆధారాలతో నివేదిక సిద్ధం చేయాలన్నారు. తాత్కాలిక మరమ్మత్తులు, శాశ్వత మరమ్మత్తులకు ఎంత వ్యయం అవుతుందో అంచనా సహా వివరాలు సమర్పించాలని తెలిపారు. దెబ్బతిన్న విద్యుత్ పోల్స్, ట్రాన్స్ ఫార్మర్ వివరాలు అందించాలని అన్నారు. నీటి పారుదల శాఖ పరిధిలో దెబ్బతిన్న చెరువులు, కాల్వలు, నీటివనరుల వివరాలు సమర్పించాలన్నారు. ఇతర నిర్మాణాలు, దెబ్బతిన్న ఇండ్ల సంఖ్య, చనిపోయిన పశువులు, గొర్రెలు, పౌల్ట్రీ తదితర వివరాలను పక్కాగా తయారు చేసి నష్టపోయిన ప్రజలకు సహాయం చేరేలా చూడాలని మంత్రి ఆదేశించారు.



రెండు రోజులు వైన్ షాపులుబంద్

- **అమలులో 144 సెక్షన్ నిషేదాజ్ఞలు**

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 9: జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా మద్యం దుకాణాలను అధికారులు మూసివేశారు. మంగళవారం ఉపఎన్నిక పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి మంగళవారం సాయంత్రం ఆరు గంటల వరకూ వైన్ షాపులు మూసివేయనున్నట్లు అధికారులు తెలిపారు. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు ఉన్నందున ఆ రోజు ఉదయం నుంచి కౌంటింగ్ పూర్తయ్యే వరకు మద్యం దుకాణాలు బంద్ చేయనున్నట్లు పేర్కొన్నారు. వైన్ షాపులు, కల్లు దుకాణాలు సహా రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లు, స్టార్ హోటల్స్, రిజిస్టర్డ్ క్లబ్స్ లోని బార్లకు కూడా ఈ ఆదేశాలు వర్తిస్తాయి. ఎన్నికల ప్రచారం ముగియడంతో, ఇక అధికారులు అలర్ట్ అయ్యారు. శాంతిభద్రతల నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద 200 మీటర్ల పరిధిలో ఐదుగురు, అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా ఉండటం నిషేధమని చెప్పారు. ఓట్ల లెక్కింపు రోజున రోడ్లు, జనావాసాల్లో టపాసులు కాల్చడం నిషేధమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆదేశాలని ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అన్ని పోలింగ్ కేంద్రాలలోనూ వెబ్ క్యాస్టింగ్

- **జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ వెల్లడి**



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 9 : జూబ్లీహిల్స్ఉపఎన్నికకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ తెలిపారు. ఉప ఎన్నికల ప్రచారం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆర్వీ కర్ణన్ మీడియాతో మాట్లాడుతూ బరిలో 58 మంది అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. నాలుగు బ్యాలెట్ యూనిట్లు ఉంటాయని పేర్కొన్నారు. సోమవారం కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి స్టేడియంలో ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తామని చెప్పారు. కాగా, మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో 407 పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయని అన్నారు. వీటిలో 226 పోలింగ్ స్టేషన్లు సున్నితమైనవిగా గుర్తించామని తెలిపారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, వెబ్ క్యాస్టింగ్ ఉంటుందని అన్నారు. ఈసారి కొత్తగా డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ, నిఘా పెడుతున్నామని తెలిపారు. ప్రచారం ముగిసిందని, ఇంటింటి ప్రచారం మినహా ఏరకమైన ప్రచారం చేయకూడదని సూచించారు. బల్క్ మెసేజ్‌లు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం నిషేధమని చెప్పారు. 11వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించారు. ఈసారి ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.



జీవితంలో విందు, వినోదాలు కూడా భాగమే

- **షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

ప్రతిపక్షం, షాద్ నగర్, నవంబర్ 9 : మనిషి జీవితంలో విందు వినోదాలు కాలక్షేపం కూడా ఒక భాగమని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'దర్బార్ బార్ అండ్ రెస్టారెంట్'ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజలకు సరసమైన ధరలతో నాణ్యమైన ఆహారాన్ని సైతం అందించాలని సూచించారు. ప్రతి మంచి జీవితంలో విందు వినోదాలు కూడా ఒక భాగమని ఎంతోమంది విందు వినోదాలు ఒక కాలక్షేపంగా భావిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దర్బార్ గ్రూప్ సభ్యులు మల్లేష్, విష్ణు, రమేశ్, శేఖర్, మధు, కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలరాజు గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలు నాయక్, అదేవిధంగా మిత్ర బృందానికి మీడియా ప్రతినిధులు జర్నలిస్టు కేపీ, లక్కాకుల రమేశ్ కుమార్, నరసింహారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, సిరి జర్నలిస్ట్ చందు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



పాతబస్తీలో డ్రగ్స్ ముఠాలు రెచ్చిపోతున్నాయి. డ్రగ్స్ మత్తులో మైనర్ అమ్మాయిలను కొందరు ట్రాప్ చేస్తున్నారు. కేరళ ఫైల్స్ సినిమా లెవల్లో హైదరాబాద్ ఫైల్స్ సినిమా నడుస్తోంది. చార్మినార్ మాటున అంతులేని అరాచకాలు జరుగుతున్నాయి. బర్త్ డే కేక్స్‌లో డ్రగ్స్ పెట్టి మైనర్ గర్ల్‌స్‌ను బలి చేస్తున్నారు. పాతబస్తీలో అరాచకాలకు ఎంఐఎం అండదండలున్నాయి.
- కేంద్ర మంత్రి బండి సంజయ్

బహుళ

మన పోరాట యోధులు

'టిప్పు' ఖడ్గధారే కాదు, కలం వీరుడు కూడా

టిప్పు సుల్తాన్ జయంతి సందర్భంగా ఆయన సాహిత్య కృషిని గుర్తుచేసుకోవడం సమయోచితం. ఆయన చూపిన దారి, భాషకు గౌరవం, జ్ఞానానికి విలువ, సాహిత్యానికి స్వేచ్ఛ ఇవి నేటి భారతదేశానికి కూడా మార్గదర్శక విలువలు. సాహిత్యం సమాజాన్ని కలిపే శక్తి అని ఆయన నమ్మకం, ఈ కాలంలో అలాంటి ఆలోచన మరింత ప్రాసంగికం. సాహిత్యం కేవలం పదాల కళ కాదు, అది సమాజ చైతన్యం. టిప్పు సుల్తాన్ అదే చైతన్యాన్ని గుర్తించి, ప్రోత్సహించాడు. కవులు, పండితులు, భాషా రక్షకులు వీరందరికీ ఆయన ఇచ్చిన ప్రాధాన్యం సుల్తాన్ దూరదృష్టికి, సాంస్కృతిక చింతనకు సజీవ సాక్ష్యం. టిప్పు ఒకవైపు స్వాతంత్ర్య పోరాట వీరుడు, మరోవైపు సాహిత్య, విద్యా, సాంస్కృతిక విలువలను సమానంగా ఆదరించిన సమతామూర్తి.



ఎండీ ఉస్మాన్ ఖాన్
9912580645

భారత చరిత్రలో టిప్పు సుల్తాన్ పేరు వినగానే ముందుగా యుద్ధస్ఫూర్తి, ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఆయన చేసిన వీరోచిత పోరాటం గుర్తుకు వస్తాయి. ఆయన వ్యక్తిత్వంలో మరో కోణం కూడా ఉంది. జ్ఞానం, సాహిత్యం, విజ్ఞానాన్ని సమానంగా గౌరవించిన రాజనీతిజ్ఞుడిగా ఆయన నిలిచాడు. టిప్పు సుల్తాన్ కేవలం ఖడ్గం పట్టిన యోధుడు మాత్రమే కాదు. కలం పట్టిన వీరుడు కూడా! పుస్తకాల పట్ల, భాషల పట్ల, విద్యపట్ల ఉన్న ప్రేమ ఆయనను ఒక సాహిత్యాభిమానిగా నిలబెట్టింది. మైసూరు సింహాసనాన్ని అధిష్ఠించిన ఆయన అరబీ, పర్షియన్, ఉర్దూ, కన్నడ, ఇంగ్లీషు వంటి భాషలలో ప్రావీణ్యం కలవాడు. ఈ బహుభాషా సామర్థ్యం ఆయనలో సాహిత్యాభిరుచిని, జ్ఞానాసక్తిని పెంచింది. తన దర్బారులో భాషా, సాహిత్య, విజ్ఞాన చర్చలు జరిగేవి. పర్షియన్ భాషను అధికార భాషగా నిలబెట్టడం ద్వారా ఆయన అనువాద సాహిత్యానికి ఒక కొత్త దారిని చూపాడు. పర్షియన్ నుండి అరబీ, ఉర్దూ, కన్నడ భాషలలోకి అనేక గ్రంథాలను అనువదించమని ఆయన ఆదేశించినట్టు చరిత్ర చెబుతోంది. ఆయన దర్బారులో కవులు, శాస్త్రజ్ఞులు, పండితులు ఉండేవారు. వారి కోసం ప్రత్యేకంగా గౌరవ వేతనాలు ఇచ్చేవారు. ఆ కాలంలో ఉన్న అనేకమంది సాహిత్యకారులు ఆయన సహకారంతోనే జీవించారు. సాహిత్యం ఆయన దృష్టిలో వినోదం కాదు, జ్ఞాన సముపార్జనకు సాధనం.

అసాధారణమైన ఆసక్తి కలిగి

టిప్పు సుల్తాన్ పుస్తకాలపై అసాధారణమైన ఆసక్తి కలిగి ఉండేవాడు. శ్రీరంగపట్నంలోని ఆయన రాజభవనంలో పెద్ద గ్రంథాలయం ఉండేదని చరిత్రకారులు రికార్డు చేశారు. యునాని వైద్యశాస్త్రం, ఖగోళశాస్త్రం, గణితం, సైనిక వ్యూహాలు, న్యాయశాస్త్రం వంటి అనేక రంగాల పుస్తకాలను ఆయన సేకరించాడు. ఆ గ్రంథాలయంలో వందల సంఖ్యలో అరబీ, పర్షియన్ గ్రంథాలు ఉండేవి. ఆయన ఆదేశంతో కొన్ని శాస్త్రగ్రంథాలు స్థానిక భాషలలోకి అనువదించబడ్డాయి. ఈ ఆలోచన అప్పట్లో అరుదైనది, ఒక పాలకుడు, సైనికాధిపతి ప్రజల జ్ఞానాభివృద్ధిని కూడా తన బాధ్యతగా పరిగణించడం అద్భుతం.

విద్యకు ఎనలేని ప్రాధాన్యం

టిప్పు సుల్తాన్ విద్యకు ఎనలేని ప్రాధాన్యం ఇచ్చాడు. మదరసాలు, విద్యాసంస్థలు స్థాపించమని ఆదేశించాడు. విద్యను కేవలం మతపరమైన కోణంలోనే కాక, ప్రాపంచిక జ్ఞానంతో కలిపి బోధించాలన్న భావన ఆయనకు ఉండేది. ఆయన రాసిన ఉత్తరాలు, ఆదేశాలు 'హుక్మ్‌నామా' పత్రాలలో నిక్షిప్తమై ఉన్నాయి. అవి కేవలం పాలనాపరమైన ఆదేశాలే కాదు, సుల్తాన్ ఆలోచనా స్థాయిని, సాహిత్య జిజ్ఞాసను, భాషా నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తాయి. ఆయన లేఖనంలో కనిపించే పదప్రయోగాలు, వాక్య నిర్మాణం ఆయన సాహిత్యరసికుడని సాక్ష్యమిస్తాయి. ఆయన దర్బారులో ఉండే కవులలో పర్షియన్ కవి గౌస్ మొహియుద్దీన్, కన్నడ కవి శాంతిరాజు, ఉర్దూ కవి



మిర్ రజా అలీ ఖాన్ వంటి వారిని చరిత్ర ప్రస్తావిస్తుంది. కొందరు కన్నడ కవులు కూడా ఆయన సహకారంతో రచనలు చేశారు. సుల్తాన్ వ్యక్తిగతంగా కూడా కవిత్వం పట్ల ఆసక్తి కలవాడని కొందరు పండితులు అభిప్రాయపడ్డారు. టిప్పు సుల్తాన్ సాహిత్యాన్ని మతపరిమితిలో బంధించలేదు. ఆయన దర్బారులో పర్షియన్, ఉర్దూ కవులతో పాటు హిందూ పండితులు, అనువాదకులు కూడా విద్యా కార్యకలాపాలలో భాగమయ్యారు. ఆయన సాహిత్య దృష్టి మతపరిమితిని దాటి, ప్రతిభకు ప్రాధాన్యం ఇచ్చింది. ఆయన పాలనలో హిందూ పండితులు, పర్షియన్ కవులు, ఉర్దూ రచయితలు అందరికీ స్థానం ఉండేది. ఆయనకు జ్ఞానం, ప్రతిభ ముఖ్యమైనవి, మతపరమైన గుర్తింపు కాదు.

ఆయన పాలనలో సాంస్కృతిక పరిపుష్టి

శ్రీరంగపట్నం, బెంగళూరు, మైసూరు ప్రాంతాలు ఆయన పాలనలో సాంస్కృతిక పరిపుష్టి పొందాయి. కళలు, సాహిత్యం, శిల్పకళ అన్నీ ఆయన సంరక్షణలో వికసించాయి. యుద్ధరంగంలో గడిపిన రోజులలో కూడా ఆయన మనసు సాహిత్యానికి దూరంగా లేదు. ఆయన సైన్యంలోని సైనికులను చదువుకోమని ప్రోత్సహించేవాడు. ఒక పాలకుడి దృష్టిలో పఠనాన్ని విలువైన అంశంగా గుర్తించిన ఉదాహరణగా ఇది చరిత్రలో నిలుస్తుంది. పర్షియన్ సాహిత్యంపై ఆయన ప్రేమను సూచించే ఆసక్తికర విషయం ఏమిటంటే, ఆయన ఆదేశంతో పర్షియన్ కవిత్వంలోని కొన్ని గ్రంథాలను కన్నడ, ఉర్దూ భాషలలోకి అనువదించారు. ఈ ప్రయత్నం వల్ల పర్షియన్, ఉర్దూ శైలి ప్రభావం దక్షిణ భారత సాహిత్యంపై పడింది. కొంతమంది పాశ్చాత్య చరిత్రకారులు టిప్పు సుల్తాన్‌ను కేవలం యుద్ధ యోధుడిగానే చూపించినప్పటికీ, ఇటీవలి పరిశోధనలు ఆయన విద్యా, సాహిత్య కోణాన్ని కూడా వెలుగులోకి తెచ్చాయి. ఆయన పాలనలో మతాంతర సాహిత్య సహజీవనం కనిపించిందని ఆధునిక విశ్లేషణలు సూచిస్తున్నాయి.

సాహిత్య కృషిని గుర్తుచేసుకోవడం

టిప్పు సుల్తాన్ జయంతి సందర్భంగా ఆయన సాహిత్య కృషిని గుర్తుచేసుకోవడం సమయోచితం. ఆయన చూపిన దారి, భాషకు గౌరవం, జ్ఞానానికి విలువ, సాహిత్యానికి స్వేచ్ఛ ఇవి నేటి భారతదేశానికి కూడా మార్గదర్శక విలువలు. సాహిత్యం సమాజాన్ని కలిపే శక్తి అని ఆయన నమ్మకం, ఈ కాలంలో అలాంటి ఆలోచన మరింత ప్రాసంగికం. సాహిత్యం కేవలం పదాల కళ కాదు, అది సమాజ చైతన్యం. టిప్పు సుల్తాన్ అదే చైతన్యాన్ని గుర్తించి, ప్రోత్సహించాడు. కవులు, పండితులు, భాషా రక్షకులు వీరందరికీ ఆయన ఇచ్చిన ప్రాధాన్యం సుల్తాన్ దూరదృష్టికి, సాంస్కృతిక చింతనకు సజీవ సాక్ష్యం. టిప్పు ఒకవైపు స్వాతంత్ర్య పోరాట వీరుడు, మరోవైపు సాహిత్య, విద్యా, సాంస్కృతిక విలువలను సమానంగా ఆదరించిన సమతామూర్తి. ఖడ్గం జాతిని రక్షించగలదు, కానీ, కలం జాతి ఆత్మను నిలబెడుతుంది. ఇదే ఆయన విశ్వాసం. ఈ ఆలోచన ఆయన దూరదృష్టికి ప్రతిబింబం. ఆ కలం, ఆ చైతన్యం, ఆ జ్ఞానప్రేరణ ఇవే ఈ సందర్భంగా మనం స్మరించుకోవలసిన టిప్పు సుల్తాన్ ఆదర్శాలు.

(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

పరిచయం


కాశ్మీరీ కలం యోధుడు ఆజీమ్ మీర్

ముజఫర్ ఆజీమ్ ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. తన కవిత్వ గ్రంథాలు జోలనా, మనికామన్ జేకే రాష్ట్ర కళ, భాషా సాంస్కృతిక అకాడమి అవార్డ్ పొందారు. ఇదే సంస్థచే దస్త్రర్ బందీ ని కూడా పొందారు. ఆజీమ్ సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డ్ అనువాదానికి అందుకున్నారు. తన సృజనతో కాశ్మీరీ భాషా సాహిత్యాలకు,ఉర్దూ సాహిత్యానికి ఎంతో పేరు తెచ్చిన కవి ముజఫర్ ఆజీమ్ 8 జులై 2022న అమెరికాలోని ఉడ్ బ్రిడ్జ్, వర్జీనియాలో చివరి శ్వాస వదలారు.



డా.టి.రాధాకృష్ణమాచార్యులు
9849305871

భారతీయ సాహిత్యంలో దేశభక్తి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, ప్రేమ, బంధాలు ప్రకృతి, ఊరు, మట్టివాసనల థీమ్స్ తో రచనలు చేసిన సృజనకారులెందరో, ప్రేరణ, మార్గాన్వేషణ చేసిన కాశ్మీర్ అంటే ప్రకృతి అందాలే కాదు కవిత్వ సౌందర్యం కూడా అని ఘోషించిన భావోద్వేగాల నేల. కాశ్మీరం కలాలెన్నింటికో గొప్ప గొప్ప విలువల కొంగు వొడి. ఆ వొడిలో ఎదిగిన వారిలో మహ్మద్ ముజఫర్ ఆజీమ్ మీర్ కాశ్మీర్ భాషా ప్రసిద్ధ రచయిత కాశ్మీరీ అమెరికన్ కవి ఒకరు. హిమాలయ పర్వత సానువులలోని గొట్లిపురా గ్రామం, తంగ్ మార్గ్, జమ్ముకాశ్మీర్ రాష్ట్రంలో 29 ఏప్రిల్ 1934న పుట్టిన ముజఫర్ ఆజీమ్ మీర్ అక్కడి ప్రతాప్ ఇండియా కాలేజీలో డిగ్రీ చదివారు. తన 50 యేండ్ల వయసులోనే వాలంటరీ రిటైర్మెంట్ తీసుకునే ముందు సెరికల్చర్ డైరెక్టర్ గా ఉద్యోగం చేసారు. దాదాపు పదేండ్ల ప్రాయంలోనే కవిత్వ రచన చేసిన ముజఫర్ ఆజీమ్ 1963లో తన తొలి కవిత్వ సంపుటి 'జొలానా' (సంకెళ్లు) తీసుకొచ్చారు. ఆయనకు సమకాలీన కవి రహమాన్ రహి ఈ సంపుటిపై తన అభిప్రాయంగా 'ఆజీమ్ ను తన వయసుగల ఇతర కవులతో పోల్చిచూసే అంశం సృజనకారునిగా ఆయధ నేర్పరితనం, అది గజల్స్ లో వలె ప్రశంసించుటకు దోహదపడే ఉపకరణం' అంటారు. మనికమన్ (కోరిక) ఆయన రెండవ కవిత్వ సంపుటిగా వచ్చింది. ఆయన ఉర్దూ కశ్మీరీ భాషలలోనూ రాశారు. ఉర్దూలో సాజేసలాసిల్ (Rhythm of the chains, పంక్తుల లయ) అయితే, కశ్మీరీలో హరాఫ్ దాయీ (Two and half words, రెండున్నర పదాలు) వెలువరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించిన 'ఆధునిక కశ్మీరీ కవిత్వంలో ప్రయోగాలు' సమగ్ర సమీక్షా సంపుటి గ్రంథం రాశారు.




అనువాద విభాగంలోనూ

అనువాద విభాగంలో ఆజీమ్ War and peace (ముజఫర్ యుద్ధం మరియు శాంతి), Wuthering heights కలవు. బి.కె.భట్టాచార్య రాసిన అస్సామీలో ఇయారూనిగమ్ గ్రంథం, కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించిన గ్రంథాన్ని కూడా (People's Raj(People's Rule, ప్రజా పాలన) అనువదించారు. ఆజీమ్ ఎన్నో మధుర గీతాలను కూడా రాశారు. అవి ఆకాశవాణి శ్రీనగర్ లో వినిపించారు. చాలా ఇష్టమైనవిగా శ్రోతల మన్ననలు పొందాయి. ఆయన రాసిన గీతం 'ఆసి బోర్ విజీ విజీ'ని కాశ్మీర్ యూనివర్సిటీ గీతంగా మూడు సంవత్సరాల కాలం ఆలపించబడినది. ఆయన గీతాలలో 'జాగీర్ జఖ్మీ' 'యేన జుల్ఫో చాన్యూ' రెండు ప్రఖ్యాతి చెందాయి. ఆయన నాటకాలు ఎన్నో శ్రీనగర్ ఆకాశవాణి కేంద్రం నుండి ప్రసారమయినవి. కవిత్వం, సాహిత్యం, జీవితం వంటి విషయాలపై చర్చించేందుకు ఎన్నోసార్లు దూరదర్శన్ లో కనిపించారు. ముజఫర్ ఆజీమ్ లో ముఖ్యమైన మరో పార్శ్వం కూడా ఉన్నది. డిజిటల్ మీడియాలో కాశ్మీరీ భాషాసాహిత్యాల అభివృద్ధికి ,ఉన్నతికి ఆయన ఎంతో కృషిచేశారు. అందుకు కాశ్మీరీ నార్కాలమ్ ఫాంట్, గుల్మార్గ నాస్టాలిక్ ఫాంట్ రెండింటినీ కనుగొన్నాడు. ఇతర భాషా నిపుణుల సహకారంతో ఆయన కాశ్మీరీ భాషకు ప్రాతినిధ్యం వహించే యూనికోడ్ కోసం కృషి చేశాడు. దీనితో లక్షలాది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కశ్మీరీలు వారు ఎంచుకున్న భాషలో రాసుకునేందుకు ఉపయోగపడుతున్నది. ఇది భాషా సాంకేతిక రంగాలలో కాశ్మీరీలకు చేరవేయబడిన గొప్ప భాషా సాంకేతిక విప్లవంగా చెప్పవచ్చును.

ఎన్నో పురస్కారాలు

ముజఫర్ ఆజీమ్ ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. తన కవిత్వ గ్రంథాలు జోలనా, మనికామన్ జేకే రాష్ట్ర కళ, భాషా సాంస్కృతిక అకాడమి అవార్డ్ పొందారు. ఇదే సంస్థచే దస్త్రర్ బందీ ని కూడా పొందారు. ఆజీమ్ సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డ్ అనువాదానికి అందుకున్నారు. తన సృజనతో కాశ్మీరీ భాషా సాహిత్యాలకు, ఉర్దూ సాహిత్యానికి ఎంతో పేరు తెచ్చిన కవి ముజఫర్ ఆజీమ్ 8 జూలై 2022న అమెరికాలోని ఉడ్ బ్రిడ్జ్, వర్జీనియాలో చివరి శ్వాస వదలారు.

(పరిచయకర్త కవి, రచయిత, విమర్శకులు)



ఎడారి వసంతం-26

గొలుసు కథ

సింగిడి

పేజీ 11లో

కవిత




సూక్తాష్టకం

రెక్కాడితేగాని డొక్కాడదు
కడుపు నిండదు, నిదుర పట్టదు.
గాలాడితే గాని శ్వాసందదు
గుండె కొట్టుకోదు, ప్రాణం నిలువదు


అనుభవిస్తే గాని, అవగతం కాదు
విశ్వాసం కలగదు, ఆనందం దొరకదు
కళ్ళతోచూస్తే గాని, నిజాలు తెలియవు
నమ్మబుద్ధి పుట్టదు, రంగు బయటపడదు

సాధన చేస్తే గాని, పనులు సమకూరవు
ఫలితాలు చిక్కవు, ప్రతిభ వెల్లడి
మనసు విప్పితే గాని, నిజాలు తెలియవు
అంతరంగం వెలువడదు, విలువ బహిర్గతం కాదు

అడుగులేస్తే గాని, ముందుకు జరగము
పయనం సాగదు, గమ్యముచేరము
కలం కదిలితే గాని, కాగితం మాట్లాడదు
కవితా పుష్పం పూయదు, భావరాగం వెలుగొందదు



గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
భాగ్యనగరం, 9177915285



జ్ఞాపకాల పండ్ల బుట్ట

వయసు పెరిగ కొద్దీ
జ్ఞాపకాల బుట్ట బరువెక్కుతున్నది
జయాపజయాల కుప్ప
బుట్టలో తీపి జ్ఞాపకాల
తియ్యని పండ్లే కాదు
ఊరించే కాయలు
రేపటి ఆశల దోర పండ్లు
వైఫల్య కుళ్లి పోయిన పండ్లు
మురిగిన ఫలాలు తాకి
తియ్యని పండ్లు మురిగిపోవు
ఓటమి జ్ఞాపకాల గురుతులు
గెలుపు ఆనందాన్ని హరించు
కుళ్లిన పండ్లు బుట్టలోంచి
ఏరి పారవేయడమే ఏకైన మార్గం
వైఫల్య అనుభవాలు పునాది రాళ్లు
సాఫల్య సంతోషాలు జీవిత లక్ష్యాలు !

- మధుపాళీ
9949700037



సమీక్ష

అలరించే చుక్కల మణిపూసలు



కందుకూరి భాస్కర్
9441557188

నేడు తెలుగు సాహితీ క్షేత్రంలో కొత్త కొత్త కవితా ప్రక్రియలు ఎన్నో పుట్టుకొస్తున్నాయి. అందులో కొన్ని మాత్రమే బతికి బట్టకడుతున్నాయి. అలాంటి వాటిలో ఎక్కువ మంది మెప్పును పొంది, అనుసరించబడుతూ, విజయకేతనం ఎగరేసిన ప్రక్రియ మణిపూసలు. మాత్రా ఛందస్సు, అంత్యానుప్రాస నియమాలతో వడిచర్ల సత్యం రూపొందించారు. సాహిత్య ప్రపంచానికి పరిచయం చేసిన ఐదారు సంవత్సరాలలోనే ఈ కవితా విభాగంలో వందకు పైగా పుస్తకాలు రావడం అనేది ఒక విశేషమని చెప్పవచ్చు. ఇదే మార్గంలో వందలాది పద్యాలతో కంఠభూషితుడై 'పద్యాల రమేశ్' గా ప్రసిద్ధి చెందిన చుక్కల రమేశ్ 'చుక్కల మణిపూసలు' పేరుతో చక్కని పుస్తకం తెచ్చారు. ఇది బాలల కోసం అని చెప్పినా, పెద్దలు కూడా తెలుసుకోదగిన కవిత్వాంశాలు ఇందులో చాలా ఉన్నాయి.


మచ్చుకు కొన్ని మణిపూసలు పరిశీలిద్దాం.

'అమ్మ భాషను మరువొద్దు / నిర్లక్ష్యమును చూపొద్దు /అభివృద్ధికి కాసింత / సాయపడుట మానవద్దు' అంటారు. ఇక్కడ మాతృభాష పట్ల ఉన్న అభిమానాన్ని, ఆసక్తిని, మమకారాన్ని గమనించాలి. మానవులకు తల్లి భాషను మించిన గొప్ప భాష ఇంకోటి లేదు. పరాయి భాష మోజులో పడి సొంత భాషను మరువవద్దని కవి ఆవేదనతో కోరుతున్నారు. 'పరీక్షలు పరీక్షలు కావు / ప్రతిభ కొలతలు / నిరంతరం కొనసాగిన / పెరుగును జ్ఞానసిరులు' వాస్తవంగా ఈ కాలంలో మార్కులు, ర్యాంకులను లక్ష్యంగా పెట్టుకొని, పిల్లల్ని మానసికంగా హింసిస్తున్నారు. మూస పద్ధతిలో బోధిస్తున్నారు. పరీక్షల కోసం బట్టీ పట్టిస్తున్నారు. దీనివల్ల విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించే సామర్థ్యాన్ని నష్టపోతున్నారు. అలాకాకుండా అవగాహన కల్పిస్తూ నిత్యము అధ్యయనం చేయిస్తే, మంచి ఫలితాలు వస్తాయి. గొప్ప విజ్ఞాన వంతులవుతారు అనేది కవి భావన.

'నీ ఇల్లే మొదటి బడి / మంచి నేర్పు అమ్మఒడి / సంస్కారం నిర్మించగ / అదేనోయి గొప్ప గుడి' ఈనాడు గౌరవ మర్యాదలు అనేవి బాలబాలికలలో పూర్తిగా తగ్గినాయని చెప్పొచ్చు. కారణాలు అనేకం. అయితే ఎక్కువగా ఇంటి నుండే పిల్లలకు నైతిక విలువలు, సంస్కారం గురించి బాగా అర్థం అయ్యేటట్లు చెబితే, ఇంకా బుద్ధిమంతులుగా ఎదుగడానికి అవకాశం హెచ్చుగా ఉంటుంది. మరో చోట, ' మాట ఆప్యాయంగా / నడత అభిమానంగా / తీయని పలకరింపుతో / జీవనమే హాయిగా' మాటకున్న గొప్పతనం ఇందులో ఉంది. మనిషి నిత్యం మాట్లాడే తీరు ఎలా ఉండాలో ఈ చిన్న కవిత ద్వారా వెల్లడిస్తున్నాడు. మానవుల మధ్య బలమైన బంధానికి, సంబంధానికి, జీవనం సుఖంగా సాగడానికి మాటలే ప్రధాన కారణం అవుతాయి.

'పబ్బులు క్లబ్బులు వద్దు / చదువులు రాతలు ముద్దు / కన్న వారి ఆశలను నెరవేర్చుటయే ముద్దు' అంటూ నేటి కాలంలో విద్యార్థి లోకాన్ని ఉద్దేశించి మణిపూస చెబుతోంది. 'విద్యా తురాణాం న సుఖం న నిద్ర' అనేది ఆర్యోక్తి. కనిపించిన తల్లిదండ్రుల ఆశలను, ఆశయాలను నెరవేర్చాలంటే పిల్లలు పక్కదారి పట్టకుండా విద్య నేర్చువాలనేది రచయిత కోరిక. 'బద్ధకమును వదిలిపెట్టు /పనుల మీద శ్రద్ధ వెట్టు / తెగిన గాలిపటములైన / జీవితములను నిలబెట్టు' కొంత మంది యువకులు పుట్టుకతో వృద్ధులు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. మంచి పనులు చేయకుండా, చెడు పనులతో సమయాన్ని వృథా చేస్తున్నారు. అటు పెద్దలకు, ఇటు పిల్లలకు ఉపయోగపడే చిన్న పుస్తకంలో ఆలోచనాత్మక భావాలతో అల్లిన అందమైన నూట పదహారు మణిపూసలు ఉన్నాయి. అలాగే, కళారత్న డా. మీగడ రామలింగ స్వామి, గురుసహస్రావధాని డా. కడిమిళ్ల వరప్రసాద్, అష్టావధానులు ధూపాటి రామాచార్యులు, చుక్కాయపల్లి శ్రీదేవి; పద్యమౌళి డా. రాధశ్రీ, జాతీయ కవి డా. పొద్దుటూరి ఎల్లారెడ్డి తదితర ప్రముఖులు అందించిన ముందు మాటలు, కురిపించిన అభినందనాభిప్రాయ మాలికలు ఈ కృతికి ప్రత్యేక శోభను చేకూర్చాయి. భవిష్యత్తులో కూడా చుక్కల రమేష్ గారి కలం మరిన్ని అద్భుతమైన రచనలతో అలరించాలని కోరుకుందాం.

ప్రతులకు:
చుక్కల రమేశ్
గ్రా: నెల్లికొండి,
మం: చిన్న చింతకుంట,
జిల్లా: మహబూబ్ నగర్,
పిన్ కోడ్: 509409.
సెల్: 9666852220



(సమీక్షకులు కవి, రచయిత)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com

ప్రాంతీయం

భవిష్యత్తు అంతా ఏఐదే


- చెడు పట్ల అప్రమత్తంగా ఉండాలి
- టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ



ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 9: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో మంచి, చెడు రెండూ దాగి ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అన్నారు. ఆదివారం నాడు గజ్వేల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని మల్లారెడ్డి గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన "ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మీడియా' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఏఐ కత్తిలాంటిదని, ఆపరేషన్ థియేటర్ లో డాక్టర్ చేతితో రోగికి ప్రాణం పోస్తుందని, అదే కత్తి ఓ నేరస్తుడి చేతితో ప్రాణం తీస్తుందని అన్నారు. మనం ఎలా ఉపయోగించుకుంటే అలా రూపం మారుతుందన్నారు. గ్రామీణ స్థాయిలో విలేకరులకు ఏఐపై అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో గజ్వేల్ ప్రెస్ క్లబ్ పని చేస్తున్నట్లు వివరించారు. అనంతరం ది టైమ్స్ ఆఫ్ ఇండియా ఎడిటర్ ఉడుముల సుధాకర్ రెడ్డి ఏఐపై అవగాహన కల్పించారు. ఏఐతో ఎన్నో అద్భుతాలు చేయవచ్చని, అన్ని రకాల సమాచారం నిమగ్నమై ఉంటుందని, కానీ పూర్తి స్థాయిలో ఏఐపై ఆధారపడవద్దని సూచించారు. అనంతరం జర్నలిస్టులకు సర్టిఫికెట్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సీనియర్ సభ్యులు సత్యనారాయణరావు, కృపాకర్ రెడ్డి, సురేందర్, మధుసూదన్ రెడ్డి, నాయిని యాదగిరి, విజయరావు, ఎల్లం, కృష్ణ, చిన్న యాదగిరి, రమణారెడ్డి, కిరణ్, జగదీశ్, అశోక్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, మునీర్, బాల్ నర్సయ్య, వెంకట్ రెడ్డి, మహేందర్ రెడ్డి, యాదగిరి, బాలచందర్, బాలకృష్ణ రెడ్డిలతో పాటు నియోజకవర్గం పరిధిలోని ఆయా ప్రధాన మీడియా సంస్థల్లో పనిచేస్తున్న 70మంది జర్నలిస్టులు పాల్గొన్నారు.

నశీర్ అహమ్మద్ కు 'జీవిత సాఫల్య పురస్కారం'

- ప్రకటించిన ఏపీ ప్రభుత్వం, ఉర్దూ అకాడమీ
- రేపు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రదానం



ప్రతిపక్షం ప్రతినిధి, గుంటూరు, నవంబర్ 9 : భారత తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ఉర్దూ అకాడమీ యేటా ప్రకటిస్తున్న 'జీవిత సాఫల్య పురస్కారానికి' ఈసారి ప్రముఖ చరిత్రకారులు, బహుగ్రంథ రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్ ను ఎంపిక చేశారు. ఈమేరకు ఆదివారం సాయంత్రం ఉర్దూ అకాడమీ సీఈఓ షేక్ మహమ్మద్ గౌస్ పీర్ నుండి నశీర్ అహమ్మద్ వర్తమానం అందుకున్నారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిం జనసముదాయాలు నిర్వహించిన పాత్రను వివరిస్తూ మూడు దశాబ్దాలుగా విశేష కృషి చేస్తున్న నశీర్ అహ్మద్ 25 పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను వెలువరించారు. ఈ గ్రంథాలు ఉర్దూ సహా తెలుగు, హిందీ, తమిళం, కన్నడం, గుజరాతీ భాషలలో వెలువడ్డాయి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగమయ, సాహసోపేత పోరాటాలను, స్వాతంత్ర్య సాధనలో వారి పాత్రను ప్రజలకు, ముఖ్యంగా యువత, విద్యార్థులకు తెలియపర్చుతూ పలు ప్రచార కార్యక్రమాలను దేశంలోనే కాకుండా విదేశాలలో కూడా అవిశ్రాంతంగా నిర్వహిస్తున్నారు. చరిత్ర గ్రంథాల రచన, ప్రచురణను వ్యాపార దృష్టితో కాకుండా సేవా దృష్టితో నిర్వహిస్తున్న నశీర్ అహమ్మద్ తన కుటుంబం, తన సన్మిత్రుల ఆర్థిక సహకారంతో ప్రచురించిన గ్రంథాలను ఎంపిక చేసిన వందలాది గ్రంథాలయాలను, చరిత్రకారులకు, జర్నలిస్టులకు తమ వదాన్యుల చిరుగానుకగా అందిస్తున్నారు. ఈ పురస్కారం క్రింద 25 వేల రూపాయలు నగదు, జ్ఞాపికతో సయ్యద్ నశీర్ అహమ్మద్ ను మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తదితర ప్రముఖులు సత్కరించనున్నారు.



జగిత్యాలలో 100 కోట్ల ఆస్తి కబ్జా!

- ప్రజా ఆస్తులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ నవంబర్ 9: మున్సిపల్ ఆస్తులను బాధ్యతగా భావిస్తున్నానని మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాలలో 100 కోట్ల ఆస్తిని కబ్జా నుంచి రక్షించాలని కోరారు. ఆదివారం ఆయన జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతూ తన ప్రజా జీవితంలో భవిష్యత్‌కు ఉపయోగపడేలా ఎస్సారెస్పీ థరూర్ క్యాంపు ఆస్తులను పరిరక్షించానన్నారు. దేవాదాయ ఆస్తులను సైతం కాపాడానన్నారు. 1952 లో జగిత్యాల పట్టణంలో పెట్రోలు, డిజిల్, కిరోసిన్ కోసం ఔట్‌లెట్ ఏర్పాటు కోసం 20 గుంటల స్థలం వివాదంపై కిబాలపై జరిగిందని డ్యాక్యుమెంట్ తెరపైకి వచ్చిందని, దీనిపై అనేక అనుమానాలు కూడా ఉన్నాయన్నారు. దారం వీర మల్లయ్యకు స్థలం వినియోగం కోసం ఇచ్చారని, 1964 స్థల వివాదం తలెత్తిందని, అప్పుడు వారు ఓనర్‌షిప్ దాఖలు చేయలేదని చెప్పారు. 1975 వరకు కిబాల పత్రం తెర మీదకు రాలేదన్నారు. ఆ తర్వాత జిరాక్స్ పత్రం తెచ్చి కిబాల ద్వారా జరిగిందని డ్యాక్యుమెంట్ తెరకెక్కించారని ఆరోపించారు. 'ఇన్ని రోజులు కిబాల ఎందుకు తెరమీదకు రాలేదు. ఆయన చనిపోయిన తర్వాత కిబాల పత్రం వచ్చిందంటే అనుమానాలు ఉన్నాయి. మంచాల కృష్ణ ఒరిజనల్ కిబాలను హైకోర్టుకు, డివిజన్ బెంచ్‌కు దాఖలు చేయలేదు. కోర్టులో కేసు గెలువాలంటే ఓరిజనల్ డ్యాక్యుమెంట్ దాఖలు చేయాలి. ఎందుకు చేయలేదు హైదరాబాద్ లాగా హైడ్రా ఉంటే ఇప్పటికే కూల్చేవారు' అని జీవర్ రెడ్డి పేర్కొన్నారు. 1952లో ఇస్తే కిబాలలో 1958లో రాశారని, మున్సిపల్ అధికారులు కుమ్మక్కయ్యారని, అందరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అండదండలు ఉన్నాయని బెదిరిస్తున్నారన్నారు.

జూబ్లీ హిల్స్ అభివృద్ధికి నవీన్‌ను గెలిపించాలి

- బీజేపీ, బీఆర్ఎస్ నాటకాలను తిప్పికొట్టాలి
- నవీన్ యాదవ్ గెలుపుతోనే జుబ్లీహిల్స్ మోడల్ నియోజకవర్గంగా మారుతుంది
- సంక్షేమం, రాష్ట్ర ప్రగతి పరుగులు పెట్టాలంటే నవీన్‌కు ఓటు వేయాలి
- రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి



ప్రతిపక్షం, మంచి ర్యాల ప్రతినిధి: రాష్ట్ర రాజదాని నడిబొడ్డున ఉన్న జుబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు విజ్ఞతతో ఆలోసించాలని ఈ నెల 11న జరిగే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట కార్మిక ఉపాధి కల్పన గనుల శాక మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఈ ఎన్నికల్లో బీఆ ర్ ఎస్ బీజేపీ పార్టీలు కుమ్మక్కయ్యాయని అయినప్పటికి ఆ పార్టీలకు ఈ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని తెలిపారు. ఆయన ప్రతిపక్షంతో మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా షేక్‌పేట ఇంచర్జ్‌గా తను ఇంటింటికి ప్రచారానికి వెళ్లినప్పుడు ప్రజలు తమ సమస్యలను దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. మూడు సార్లు జుబ్లీహిల్స్ ప్రాతినిధ్యం వహించిన బీఆర్ఎస్ పార్టీ ఇక్కడి ప్రజల కనీస సమస్యలు పరిష్కరించిన సందర్భాలు లేవని మండిపడ్డారు. రోడ్లు, డ్రైనేజీలు ఇతర వసతుల లేమితో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎన్నికల్లో ఆయన మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని వారి పాలనలో జుబ్లీహిల్స్‌ను ఎందుకు పట్టించుకోలేదో జవాబు చెప్పాలన్నారు. ఓటమి భయంతోనే తమ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆ ర్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆయా ఎన్నికల్లో వెళ్లగా ఎక్కడ కూడ విజయ సాధించిన సందర్భాలు లేవని తెలిపారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ ఓటమి పాలై తమ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. అంతేగాకుండా పార్లమెంటు ఎన్నికల్లో జీరోకు పరమితమైందని తెలిపారు. రాష్ట్రానిన్ని అదోగతి పాలు చేసినందునే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్ హౌజ్ పరిమితయ్యారని, కూతురు, కొడుకు, అల్లుడు కుంభకోణాల్లో కూరుకపోయారని తెలిపారు. రాజధానిలో జుబ్లీహిల్స్ మోడల్ నియోజకవర్గంగా అభివృద్దిలో అగ్రస్తానంలో ఉండాలంటే అది నవీన్ యాదవ్ గెలుపుతోనే సాధ్యమవుతుందని తెలిపారు. ఇప్పటికీ ఓటర్ల నుంచి మంచి స్పందన ఉందని తెలిపారు. రౌడీషీటర్లందరిని బీఆర్ ఎస్ పార్టీలో చేర్చుకుంటూ తమ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ పై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికీ బీఆర్ ఎస్, బీజేపీలు ఓటర్లకు అనేక ప్రలోభాలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందాలన్న రాస్టం మరింత ముందుకు వెళ్లాలన్న శరవేగంగా నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్న తమ అభ్యర్తి నవీన్ యాదవ్‌కు గెలిపించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాజదాని పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందనే విషయానిన్ మరిచిపోవద్దన్నారు. ముస్లీం మైనార్టీలంతా సెక్యులర్ భావజాలంతో ప్రగతిశీల ప్రజాస్వామ్యంతో ముందుకు వెళ్తున్న తమ పార్టీ అభ్యర్థికి అండగా నిలువాలని ముస్లీం అందరూ కూడ నవీన్ యాదవ్‌కే ఓట్లు వేయాలని కోరారు. ఈ ఎన్నికలతో సంబంధం లేకుండా ఇక నుంచి జుబ్లీహిల్స్‌లో షేక్‌పేటలో తాను పర్యటిస్తూ పెద్ద పీట వేస్తామని తెలిపారు.



సాంస్కృతిక పోటీలతో ఆత్మవిశ్వాసం

- ప్రముఖ సైకాలజిస్ట్ డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ నవంబర్ 9: సాంస్కృతిక పోటీలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ అట్ల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో గురూస్, స్టూడెంట్స్ అండ్ పేరెంట్స్ డాన్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు గంగారపు మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి సాంస్కృతిక పోటీల పాల్గొన్నవారికి ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నిజమైన విద్య అంటే వ్యక్తిత్వ వికాసం, ఆ వికాసానికి సాంస్కృతిక కార్యక్రమాలు ఒక అధ్భుతమైన వేదిక. దీని ద్వారా వ్యక్తులలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీస్తాయన్నారు. వేదికల పైన మాట్లాడే ధైర్యం వస్తుందన్నారు. దైవాల హిమబిందు వాయించిన పియానో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జి.ఎస్.పి. డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు గంగారపు మల్లేశం, ఉపాధ్యక్షులు అటుకాపురం డప్పు రాజేష్, న్యాయనిర్ణేతలు శ్రీరామోజు రామకృష్ణ, గజ్జెల ధర్మేందర్, మిలీనియం శ్రీనివాస్, చందుపట్ల, జయలక్ష్మి ఆత్మీయ అతిథులు దువ్వాసి రవిందర్, దువ్వాసి సౌచన్య, అంజలి, చిలుక సుమన్ సంధ్య, గున్నాల లక్ష్మణ్ శారద, ఈశ్వర్, శ్రీజ ఏద్యార్థినీ విద్యార్థులు, కవులు, కళాకారులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు జేఎన్టీయూలో 'కోతి చేష్టలు'

- యువకుడికి మరో యువకుడితో పెళ్లి
- కాలేజీలో- కలకలం సృష్టించిన ర్యాగింగ్
- స్టూడెంట్స్ వికృత చేష్టలపై ప్రభుత్వం సీరియస్



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ నవంబర్ 9: జగిత్యాల జిల్లా కురిక్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల మూత్రశాలలలో సీక్రెట్ కెమెరా లు అమర్చిన సంఘటన మరిచిపోకముందే కొండగట్టు జేఎన్టీయూలో కోతి చేష్టలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలం సృష్టించాయి. ఇంజినీరింగ్ కళాశాలలో 'ఇంటరాక్షన్' పేరుతో సీనియర్లు వికృత చేష్టలకు పాల్పడ్డారు. ఇద్దరు జూనియర్ విద్యార్థులకు 'పెళ్లి తంతు' నిర్వహించి రాక్షసానందం పొందారు. సీసీ కెమెరాలు ఉన్నా ఇలాంటి ఘటనలు ఆగకపోవడంపై తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జూనియర్లను మానసికంగా వేధిస్తున్న సీనియర్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జేఎన్టీయూ కళాశాలలో ఇద్దరు బీటెక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు పెళ్లి చేసిన సీనియర్లు ఆపై వీడియోలను సోషల్ మీడియాలో పెట్టడం సంచలసంగా మారింది. ఈ ర్యాగింగ్ ను అక్కడే ఉన్న మరికొందరు విద్యార్థులు వీడియోలు తీశారు. సీసీ కెమెరా పర్యవేక్షణ ఉన్నా విద్యార్థులు భయపడకుండా జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేయడం తెలంగాణలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.



కోటి దీపోత్సవాన్ని జాతీయ పండుగ గుర్తించాలి

- కేంద్రానికి లేఖ రాస్తాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 9: కోటి దీపోత్సం కార్యక్రమాన్ని జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్రాని లేఖ రాస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. భక్తి టీవీ నిర్వహిస్తున్న కోటి దీపోత్సం కార్యక్రమానికి ఆదివారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటి దీపోత్సవాన్ని రాష్ట్ర పండుగానే గుర్తించడంతో పాటు జాతీయ పండుగా గుర్తించేందుకు కేంద్రానికి లేఖ రాస్తామని తెలిపారు. దీపోత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనను కూడా గుర్తు చేశారు. అజ్ఞానమనే గాఢాంధకరంలోంచి మనల్ని బయటకు తీసుకువచ్చి మన జీవితాల్లో వెలుగులు నింపే అద్భుత కార్యక్రమం దీపోత్సం అని అన్నారు. ఈ కోటి దీపోత్సవం నిజంగా పరమ పుణ్యప్రదమైందిగా రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత నిష్టతో, శ్రద్ధాభక్తులతో నిర్వహిస్తుండడంపై తెలంగాణ ప్రజలు, ప్రభుత్వం తరఫున అభినందనలు తెలియజేశారు.





రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

ప్రతిపక్షం, చేర్యాల/సిద్దిపేట, నవంబర్ 9 : రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, ఇద్దరికీ తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. చేర్యాల నుండి సిద్దిపేట వైపు వస్తుండగా లేనిన్ నగర్ గ్రామం సమీపంలో దారుణ రోడ్డు ప్రమాదం జరిగింది. సిద్దిపేటకు చెందిన ఎర్ర నర్సయ్య (రమేష్) ఫోటోగ్రాఫర్ గా పనిచేస్తున్నాడు. అతని భార్య సునీత (ఏ ఎన్ ఎం), కుమార్తె కీర్తనతో కలిసి స్కూటీ తో సిద్దిపేటకు వెళ్తుండగా లారీ బైక్ ఢీకొనడంతో సునీత మృతి చెందగా, ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదంలో ఆయన భార్య మృతి చెందింది. గాయపడిన వారిని సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణం లారీ వేగం అని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

హరీశ్ రావు సంతాపం

ఎర్ర సునీత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు సంతాపం తెలిపారు. భార్యను కోల్పోయిన ఫోటో జర్నలిస్ట్ నర్సయ్యకు భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. తక్షణ సహాయంగా రూ.20 వేల రూపాయలను బీఆర్ఎస్ నాయకుల ద్వారా పంపించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నర్సయ్య, కుమార్తె కీర్తి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న హరీష్ రావు, సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.



ఒక్క ఘటనను కారణంగా చూపించి ఎల్‌కే అద్వానీ చేసిన సుదీర్ఘ సేవను తగ్గించడం అన్యాయం. చైనా ఎదురుదెబ్బను చూపించి నెహ్రూ కెరీర్‌ను, ఎమర్జెన్సీ ఆధారంగా ఇందిరా గాంధీ రాజకీయ జీవితాన్ని నిర్వచించలేం. అద్వానీకీ అదే న్యాయం వర్తిస్తుంది.

- కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్

ప్రాంతీయం



హైడ్రా కాపాడిన పార్కులో వనభోజనాలు

- సత్యనారాయణ వ్రతం నిర్వహించి సంబరాలు చేసుకున్న నివాసితులు
- హైడ్రాకు మద్దతు తెలిపిన కాలనీ వాసులు

ప్రతిపక్షం, సిటి బ్యూరో, నవంబర్ 9 : నిజాంపేట మున్సిపాలిటీ కోశల్యానగర్లోని హైడ్రా కాపాడిన బనియన్ ట్రీ పార్కులో స్థానికులు ఆదివారం వనభోజనాలు చేశారు. కార్తీకమాసం కావడంతో సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. నిజాంపేట మున్సిపాలిటీలో ఇటీవల హైడ్రా రెండు పార్కులను హైడ్రా కాపాడింది. బృందావన్ కాలనీలో 2300 గజాల పార్కును కాపాడగా.. కౌశల్యానగర్ కాలనీలోని 300ల గజాల విస్తీర్ణంలో ఉన్న బనియన్ ట్రీ పార్కును కబ్జాల నుంచి రక్షించింది. కౌశల్యానగర్ కాలనీలోని 300 గజాల పార్కుకు చుట్టూ ఆక్రమణదారులు ప్రహరీ నిర్మించి కాజేశారు. ఎవరూ పార్కులోకి రాకుండా అడ్డుకున్నారు. అలా ఆక్రమణలో వున్న పార్కును కాపాడి కోశల్యానగర్ కాలనీ వాసులకు హైడ్రా అప్పగించింది. అందుకే కాలనీవాసులు బనియన్ ట్రీ పార్కుకు చేరుకుని కార్తీక వనభోజనాలు చేశారు. అదే పార్కులో కాలనీ వాసులు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం చేసారు. దాదాపు వెయ్యి మంది కలసి ఈ ఉత్సవాలను జరుపుకున్నారు. పిల్లలు పెద్దలు హైడ్రా జిందాబాద్.. అంటూ హైడ్రా కి హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలియ చేసారు. ప్లకార్డులు ప్రదర్శించి హైడ్రాకు మద్దతు పలికారు. అలాగే బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీలో ఫార్చ్యూన్ మెడోస్ కాలనీలో అడ్డుగోడలు తొలగించి వెనువెంటనే సిమెంట్ రోడ్డు వేసిన హైడ్రాకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. హైడ్రా వచ్చింది దారులు తెరిచిందంటూ కీర్తించారు.



కాప్రా డివిజన్ అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్తా

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ప్రతిపక్షం, సిటీ బ్యూరో, నవంబర్ 9 : ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కాప్రా డివిజన్ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తా అన్ని కాలనీ ల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం కాప్రా డివిజన్ పరిధిలోని వినాయక నగర్ ఫేస్ 3 లో 10 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బైరి నవీన్ గౌడ్ , బద్రుద్దిన్ ,ఇంద్రయ్య మహేష్ ,గిల్బర్ట్ ,రవీందర్ ,చందు , కాలనీ ప్రెసిడెంట్ అనిల్ కుమార్ , వైస్ ప్రెసిడెంట్ రాజేందర్ , సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


- క్రీడల శాఖ అధికారి అక్బర్

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 9: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో తమ ప్రతిభను చాటాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి మహమ్మద్ అక్బర్ సూచించారు. స్పోర్ట్స్ కోటాలో ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయని తెలిపారు. చిట్యాల హైస్కూల్లో ఆదివారం జరిగిన తైక్వాండో పోటీలకు చిట్యాల, నార్కెట్ పల్లి, రామన్నపేట మండలాల నుండి 40 మంది విద్యార్థులు హాజరయ్యారు. వివిధ రకాల బెల్టులు పొందిన వారికి మహమ్మద్ అక్బర్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ పట్టెద సుధాకర్, కోచ్ ఫణీంద్ర, వైష్ణవి రెడ్డి పాల్గొన్నారు.



గాంధీ గుడిలో "అక్షయపాత్ర" గురించి తెలుసా?

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 9: హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై గల గాంధీ గుడి అందరిని ఆకర్షిస్తుంది. ఆలయ పరిసరాలు ఆహ్లాదాన్ని కలిగిస్తుందని, కొత్త అనుభూతిని పొందుతున్నారు. అయితే ఇక్కడ మరో ప్రత్యేకత ఉంది. ఆలయ ట్రస్ట్ వారు ఇక్కడ ఏర్పాటుచేసిన అక్షయపాత్ర పలువురికి ప్రయోజనకరంగా మారింది. ఇండ్లలో వాడుకలో లేని దుస్తులను పలువురు తీసుకొచ్చి అక్షయపాత్రలో ఉంచుతారు. అన్ని వయసుల వారి దుస్తులు పాత్రల్లో ఉండడంతో ఎవరి వయసుకు తగ్గట్టుగా అవసరమైన వారు తిరిగి తీసుకెళ్తున్నారు. ఇది అవసరమైన వారికి, పేదలకు ప్రయోజనకరంగా మారింది. 2017 లో ఏర్పాటు చేసిన అక్షయపాత్ర సేవ నేటికి కొనసాగుతుంది. ఈ విషయం తెలియని వారు ఉపయోగించుకుంటారు కదూ!



కేసీఆర్ తరహాలోనే రేవంత్ కూడా మోసం చేస్తున్నారు. రాష్ట్రంలో ఒక్క అమ్మాయికీ పెళ్లి సమయంలో తులం బంగారం ఇవ్వలేదు. పెన్షన్లు పెంచలేదు, కొత్తవి ఇవ్వలేదు. దళితులకు ఆర్థిక సాయం చేయలేదు. 2 లక్షల ఉద్యోగాలు ఎటు పోయాయని కాంగ్రెస్ నేతలను నిలదీయండి. గతంలో డబుల్ బెడ్రూం ఇళ్లు ఎందుకివ్వలేదని బీఆర్ఎస్‌ను ప్రశ్నించండి.
- జూబ్లీహిల్స్ ప్రచారంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

కాలనీలోని లబ్ధిదారుల సమస్యల శాశ్వత పరిష్కారం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రతిపక్షం, సిటీబ్యూరో/ పటాన్ చేరు, నవంబర్ 9 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కాలనీలోని లబ్ధిదారుల సమస్యల శాశ్వత పరిష్కారం చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. సంగారెడ్డి జిల్లా కొల్లూరులో డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఇతర సౌకర్యాల కల్పనపై సహచర మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ , ఖమ్మం పార్లమెంటు సభ్యులు రఘురాం రెడ్డి , మాజీ ఎమ్మెల్సీ భూపతి రెడ్డి , కౌన్సిలర్ భరత్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ కాలనీలో సుమారు 16 వేల కుటుంబాలు, 48 వేలకుపైగా ప్రజలు నివసిస్తున్న కాలనీ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది. వారం రోజుల క్రితం ఇచ్చిన మాట ప్రకారం కాలనీ వాసుల సమస్యలను 24 గంటల్లోనే పరిష్కరించాం. ముఖ్యంగా సన్నబియ్యం తీసుకునే లబ్ధిదారులకు రేషన్ షాపు, కాలనీలోపలకి ఆర్టీసీ బస్సులు వచ్చేలా ఏర్పాటు చేస్తున్నారు. కాలనీవాసుల రక్షణ కోసం శాశ్వత పోలీస్ స్టేషన్ నిర్మాణం చేపట్టాం. అంతే కాదు. 24 గంటల్లోనే తాత్కాలిక ఔట్ లెట్ పోలీస్ స్టేషన్ ను ఏర్పాటు చేయడం జరిగింది. గతంలోనే ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నాం. అత్యవసరం కోసం రెండు అంబిలెన్స్‌లను అందించాం కబరస్థలం ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటున్నాం. కాలనీలో అర్హులైన పేదలందరికీ గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ను అందిస్తామన్నారు. వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పింఛన్ తీసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం. కాలనీలో షాపుల ఏర్పాట్లకు త్వరలో టెండర్లు వేస్తాం. ఇవన్నీ సంపూర్ణంగా జరగాలంటే ముందు కాలనీవాసులు కమిటీని వేసుకోవాలన్నారు. ఇది పేదల పక్షపాతి పార్టీ.. వీలైనంత తొందరలో కొల్లూరు కాలనీవాసుల అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కొల్లూరు కాలనీవాసుల దీవెనలు కూడా ప్రజా ప్రభుత్వంపై ఉండాలని కోరారు.



రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం

కారు గుర్తుకు ఓటు వేయండి

- మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ప్రతిపక్షం, సిటీబ్యూరో, నవంబర్ 9 : రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కారు గుర్తుకు ఓటు వేయాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కోరారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో భాగంగా మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ,ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఎల్ రమణ, నవీన్ రెడ్డి, బీ ఆర్ ఎస్ రాష్ట్ర నాయకురాలు రజితా రెడ్డి లతో కలసి సోమాజిగూడ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నల్ల పోచమ్మ దేవాలయం, నాగార్జున నగర్ కాలనీ, ఎల్లారెడ్డి గూడ,పరిసర కాలనీల్లో సబితా ఇంద్రారెడ్డిని చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. అడుగడుగునా స్థానిక ప్రజలు, మహిళలు, యువత కారు గుర్తు నినాదాలతో నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ప్రజలు ఎల్లప్పుడూ అభివృద్ధి, సంక్షేమం పట్ల నిబద్ధత గలవారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కారు గుర్తుకు ఓటు వేయండి.కేసీఆర్ నాయకత్వాన్ని మరింత బలపరచండన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ ను భారీ మెజార్టీతో గెలిపించండని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా విభాగం సభ్యులు, యువజన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాగింగ్ పై విచారణ జరిపించాలి

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కనపల్లి గణేష్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ నవంబర్ 9: జేఎన్టీయూ క్యాంపస్ లో సీనియర్ విద్యార్థుల ర్యాగింగ్ ఘటనపై యూనివర్సిటీ, పోలీస్ అధికారులతో విచారణ జరిపించాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు, యువ న్యాయవాది జక్కనపల్లి గణేష్ డిమాండ్ చేశారు. ఇద్దరు జూనియర్ విద్యార్థుల చేత పెళ్లి చేస్తున్నట్లు తంతు జరిపించి, చున్నీలు వేసుకుని డ్యాన్స్ చేసి, ఈ తంగాన్ని వీడియో చిత్రీకరించి, సీనియర్ విద్యార్థులు పోస్ట్ చేసి వైరల్ చేశారన్నారు. ఈ వికృత సంఘటన వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ సంఘటన జరిగి నాలుగు రోజులు గడిచి, ఆ వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నప్పటికీ అధికారుల చర్యలు తీసుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. క్యాంపస్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఇటీవల కాలంలో విద్యార్థులతో దురుసుగా ప్రవర్తించాడని విద్యార్థుల ఆందోళన కూడా చేశారన్నారు. క్యాంపస్ అడ్మినిస్ట్రేషన్ విఫలం కావడం వల్లనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. వెంటనే యాంటీ ర్యాగింగ్ కమిటి ని ఏర్పాటుచేసి, ర్యాగింగ్ ని పూర్తిగా నిరోధించాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు.



టంగటూరు బీఆర్ఎస్ అధ్యక్షుడిగా మాణిక్య రెడ్డి

ప్రతిపక్షం, చేవెళ్ల, నవంబర్ 9 రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం శంకర్‌పల్లి మండల పరిధిలోని టంగటూరు బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడిగా బద్దం మాణిక్య రెడ్డిని పార్టీ కార్యకర్తలు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా నారెగూడెం వెంకటేష్ ప్రధాన కార్యదర్శిగా నీరటి వెంకటేష్ కోశాధికారిగా తంగడపల్లి శ్రీరామ్ జాయింట్ సెక్రటరీగా ఎలిమెల నరహరి నియమితులయ్యారు. గ్రామ యూత్ కమిటీ అధ్యక్షుడిగా బద్దం శ్రీరామ్ రెడ్డి ఉపాధ్యక్షులుగా, శేరిగూడ శ్రీకాంత్ ప్రధాన కార్యదర్శిగా నీరటి మల్లికార్జున్ కోశాధికారిగా రంగయ్యగారి పూర్ణచందర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బద్దం మాణిక్య రెడ్డి మాట్లాడుతూ... గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని,లోకల్ బాడీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తా చూపిస్తామని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో చేసిన అభివృద్ధిని ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తానని హామీ ఇచ్చారు.గ్రామ ప్రజలు తనకు ఇచ్చిన అవకాశాన్ని గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తానని చెప్పారు. గ్రామ పెద్దలకు అభినందనలు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

బీసీ సెల్ అధ్యక్షుడిగా ఈరగల్ల జనార్దన్ ఉపాధ్యక్షుడిగా సురేందర్ గౌడ్ లను ఎన్నుకున్నారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నంకరాజు ఉపాధ్యక్షుడిగా నీరటి మహేందర్ లను ఎన్నుకున్నారు. మైనార్టీ అధ్యక్షుడిగా అవేజ్ సోషల్ మీడియా ప్రచార కార్యకర్తగా బద్దం వికాస్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సలహాదారులుగా ప్రభాకర్ రెడ్డి, ప్రవీణ్ మల్లప్ప నర్సింలు గోపాల్ నర్సింలు మల్లారెడ్డి సంగప్ప ప్రభు రాంరెడ్డి, సత్తయ్య గౌడ్ కావలి మహిబలవంత్ రెడ్డి రాజిరెడ్డి శ్రీశైలం గోపాల్ కిష్టయ్య కాంత్ రెడ్డి మధుసూదన్ రెడ్డి సత్తిరెడ్డి రఘుపతి రెడ్డి విట్టల్ రెడ్డి సురేందర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పీడిత ప్రజలను చైతన్యవంతం చేసేదే ప్రజా నాట్య మండలి

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 9: కళ కాసుల కోసం కాదు... ప్రజలందరి కోసం, పీడిత ప్రజలను చైతన్య వంతం చేసేదే ప్రజా నాట్య మండలి అని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కుమ్మరి శంకర్ అన్నారు. చిట్యాల మండల కేంద్రంలో ఆదివారం జరిగిన ప్రజా నాట్య మండలి మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, మహిళా ఉద్యమాలకు వెన్నంటి ఉంటూ... పాలక వర్గ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించే కళా సంపద ప్రజా నాట్య మండలి అని చెప్పారు. మహాసభల ప్రారంభ సూచకంగా ఏర్పాటు చేసిన జెండాను శంకర్ ఆవిష్కరించారు. అనంతరం ప్రజా నాట్య మండలి చిట్యాల మండల నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మండల అధ్యక్షులు గా మేడి లింగస్వామి, కార్యదర్శి గా జిట్ట స్వామి, ఉపాధ్యక్షులు గా పేర్వారం రాములు, వీరమళ్ళ మణెమ్మ, నవీన్ కుమార్, సహాయ కార్యదర్శిలుగా నాగిళ్ళ కిరణ్, పెరిక సరిత, మేడి రాంబాబు, కోశాధికారిగా గుండె పరమేష్ లతో పాటు మరో పది మంది తో కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి రాష్ట్ర కమిటీ సభ్యురాలు చింత విజయ, మహిళా సంఘం మండల అధ్యక్షురాలు రుద్రారపు పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రాంతీయం

కూల్చివేసిన మైసమ్మ గుల్ల వద్ద హిందూ ఐక్యవేదిక శుద్ధి



ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 9: హిందువుల మనోభావాలను దెబ్బతీసిన 46 గుళ్ల కూల్చివేతపై హిందూ ఐక్యవేదిక ఆవేదన వ్యక్తం చేసింది. గోదావరిఖని పట్టణంలో అర్ధరాత్రి సమయంలో హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసే విధంగా గ్రామదేవతలు మైసమ్మ, వేలుపమ్మ,పోచమ్మ అమ్మవార్ల గుళ్లు సహా మొత్తం 46 గుళ్లు కూల్చివేయడం పట్ల హిందూ సమాజం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ ఘటన నేపథ్యంలో ఆదివారం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో గుళ్ల వద్ద శుద్ధి కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రామగుండం బీజేపీ ఇంచార్జి కందుల సంధ్యా రాణి పాల్గొని జీఎం కాలని, రామ్ నగర్, విద్యానగర్, గాంధీ నగర్, లెనిన్‌నగర్ ప్రాంతాల్లో కూల్చిన దేవాలయాల వద్ద శుద్ధికార్యక్రమం చేపట్టారు. అమ్మవార్లకు మొక్కులు చెల్లించి, ఈ ప్రాంత ప్రజలకు ఎటువంటి ఆపదలు కలగకుండా కాపాడమని భక్తి భావంతో ప్రార్థించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ హిందూ ఆరాధనా స్థలాలను కూల్చివేయడం అత్యంత ఘోరమైన చర్య అని, ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే చర్యలను ఇక సహించమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనగామ మండల అధ్యక్షులు గుండబోయిన భూమయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ముస్కుల భాస్కర్ రెడ్డి, పిడుగు కృష్ణ, మచ్చ విశ్వాస్, బండారి శ్యాం కుమార్, బియ్యాల మహేందర్, జక్కన బాలు, జక్కుల ప్రవీణ్, పద్మ, జనగామ శివ రామ్, శివ, అందే రాజ్ కుమార్ చారి, మీస వికాస్, బుంగ మహేష్ స్థానిక భక్తులు పాల్గొన్నారు.



నీట మునిగి వ్యక్తి మృతి

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 9:- నీట మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఏడుపాయల ఆలయ సమీపంలోని చెక్ డ్యాం వద్ద చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు మండల పరిధి నార్సింగి గ్రామానికి చెందిన వడ్ల మహేష్(33) గ్రామానికి చెందిన నర్సింలు అనే స్నేహితుడితో కలిసి బుధవారం కార్తిక పౌర్ణమి సందర్బంగా ఏడుపాయల ఆలయానికి వెళ్లారు. అక్కడి నుంచి మహేష్ హైదరాబాద్ లో బంధువుల ఇంటికి వెళ్తానని చెప్పడంతో నర్సింలు ఒక్కడే తిరిగి గ్రామానికి వెళ్లాడు. కాగా మరుసటి రోజు బంధువులకు వాకబు చేయగా మహేష్ తన వద్దకు రాలేదని చెప్పారు. దీంతో గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆచూకీ కోసం గాలించారు. శనివారం ఠాణాలో ఫిర్యాదు చేశారు.ఈ క్రమంలో శనివారం రాత్రి ఏడుపాయల చెక్ డ్యాం సమీపంలో నీటిలో తెలియాడుతున్న యువకుడి మృతదేహం స్థానికులకు కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆనవాళ్లను బట్టి మృతి చెందింది మహేష్‌గా నిర్ధారించారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీట మునిగి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి తల్లి వజ్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



కిటకిట లాడుతున్న శైవ క్షేత్రాలు

- భక్తిపారవశ్యంలో మునిగిపోయిన భక్తులు
- నేడు చివరి కార్తీక సోమవారం

-ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 9: కార్తీక మాసం చాలా పవిత్రమైంది. పూజలు, వ్రతాలు, ఉపవాసాలు, వనభోజనాలతో నెలంతా భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోతారు. నేడు చివరి కార్తీక సోమవారం. శైవ క్షేత్రలాన్ని భక్తులతో కిట కిట లాడుతున్నాయి. వేములవాడ, కాళేశ్వరం, కొమురవెల్లి, ఓదెల మల్లికార్జున స్వామి ఆలయాలు, కిక్కిరిసి పోతున్నాయి. ప్రతిరోజు తెల్లవారుజామునే కార్తీక స్నానమాచరించి.. కార్తీక దీపం వెలిగిస్తారు. అక్టోబర్ 22న మొదలైన కార్తీకమాసం నవంబర్ 20న అమావాస్యతో ముగుస్తుంది. ఇప్పటికే నవంబర్ 8 నాటికి రెండు సోమవారాలు ఏకాదశి పౌర్ణమి ముగిశాయి. ఇక నవంబర్ 10న మూడవ కార్తీక సోమవారం ముగియనుంది. ఇక మూడవ చివరి సోమవారం రోజు విష్ణుమూర్తి వైకుంఠం నుంచి కైలాసానికి వెళ్లాడని పురాణాలు చెబుతున్నాయి. ఆ రోజున పార్వతీ పరమేశ్వరులు విష్ణుమూర్తి దంపతులను సాధారంగా ఆహ్వానిస్తారట ఆరోజు చేసే వ్రతాలు పూజ లు దానాలతో విష్ణుమూర్తి సంతృప్తి చెందుతాడని పురాణాలు చెబుతున్నాయి. కార్తీక మాసం మూడో సోమవారం నవంబర్ 10న చేసే పూజల వలన శివకేశవుల అనుగ్రహం కలుగుతుందని పండితులు చెబుతున్నారు.



ఆటో బోల్తా.. నలుగురికి తీవ్ర గాయాలు

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 9: ఆటో అదుపు తప్పి నలుగురు తీవ్రంగా గాయపడ్డ సంఘటన చేగుంట మండలం పోలంపల్లి వద్ద జరిగింది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ వైపు నుండి చేగుంటకు వెళుతున్న ఆటో అదుపుతప్పి పోలంపల్లి వద్ద బోల్తా కొట్టింది . ఆటోలో ప్రయాణిస్తున్న మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం సంగాయిపల్లి గ్రామానికి చెందిన నర్సింలు (50) నరసమ్మ (40) లక్ష్మి (60) స్వామి (25) తీవ్రంగా గాయపడ్డారు. పొలంపల్లి గ్రామానికి చెందిన యువకులు స్పందించి 108 అంబులెన్స్ కు సమాచారం అందించారు. గాయపడ్డ నలుగురు వ్యక్తులను మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చేగుంట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



'సారే జహాసే అచ్చా హిందూస్తాన్ హమారా'

- ఇక్బాల్ రాసిన గీతం ఎంతోమందికి స్ఫూర్తి దాయకం
- సిద్దిపేట ముస్లిం పెద్దలు అన్వర్ శరీఫ్, అబ్దుల్ హమీద్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 9: 'సారే జహాసే అచ్చా హిందూస్తాన్ హమారా' గీతం140 కోట్ల భారతీయులకు స్ఫూర్తి దాయకం అని సిద్దిపేట ముస్లిం పెద్దలు అన్వర్ శరీఫ్, అబ్దుల్ హమీద్ అన్నారు. గీత రచయిత అల్లమా మహమ్మద్ ఇక్బాల్ 148 వ జయంతి సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రం లోని ఇక్బాల్ మినార్ వద్ద అయన చిత్ర పటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్బాల్ జయంతిని ప్రపంచ ఉర్దూదినంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అల్లమా ఇక్బాల్ ఒక అద్భుతమైన కవి, రచయిత, రాజకీయనాయకుడు అని అన్నారు. ఉర్దూ ఉనికిని కాపాడటానికి ఆయన కృషి అమోఘం అన్నారు. భారత దేశ స్వతంత్ర సంగ్రామంలో అయన పత్ర ఎనలేనిదన్నారు. చంద్రమండలం లో అడుగు పెట్టిన మొట్టమొదటి భారతీయుడు రాకేష్ శర్మ ను అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ పై నుండి భారత దేశం ఎలా కనిపిస్తుందని అడిగిన ప్రశ్నకు అయన జావాబు సారె జాహాసే అచ్చ హిందూస్తాన్ హమారా అన్న మాట్లాడు ఎంత స్ఫూర్తి ఇచ్చాయో అందరు తెలుసుకోవలన్నారు. అల్లమా ఇక్బాల్ ను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు వెళ్లాల్లని అన్నారు. కార్యక్రమంలో ఖుతుబ్,ఆరిఫ్ ముజఫ్ఫర్, పాషా, జానీ, సాజిద్, కలీం తదితరులు పాల్గొన్నారు.



పాస్టరేట్ ఎన్నికలు ప్రశాంతం

- గంట సంపత్ ప్యానల్ విజయం

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 9:- చర్చ్ అఫ్ సౌత్ ఇండియా మెదక్ పాస్టరేట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అర్ధరాత్రి తర్వాత వెలువడిన ఎన్నికల ఫలితాలలో గంట సంపత్ ప్యానల్ విజయం సాధించింది. 20 మంది సభ్యుల ఎన్నిక కోసం మొత్తం 60 మంది అభ్యర్థులు జీఎస్పీ, పాస్‌నేట్, ఆల్ఫా ఒమేగా ప్యానల్లు గా పోటీపడ్డారు. 1712 మంది సభ్యులుండగా 1451 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రిసిబిటరీ ఇంచార్జి, రిటర్నింగ్ ఆఫీసర్ రెవ. డాక్టర్ టీ. శాంతయ్య, ప్రిసైడింగ్ ఆఫీసర్ వి.జే.పద్మారావు ఆధ్వర్యంలో సండే స్కూల్ లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టారు. అర్ధరాత్రి దాటాక ఫలితాలు వెలువడ్డాయి. జీఎస్పీ ప్యానల్ నుండి 13 మంది, బానీ ప్యానెల్ నుండి ఏడుగురు అభ్యర్థులు విజయం సాధించారు. 60 మంది అభ్యర్థులలో అత్యధికంగా ఓట్లు లభించిన 20 మందిని విజేతలుగా ప్రకటించారు. అత్యధికంగా గంట సంపత్ కు 814 ఓట్లు రాగా, వరుసగా ఓట్లు సాధించి గెలుపొందిన వారిలో గోదల సువన్ డగ్లస్ (763), మెట్టు దేవ ప్రకాశం (734), బైరామ్ సుశీల్ (697), గొల్లబోయిన సునీల్ (686), మంగా సురేందర్ (686), ఆరే ప్రభు దాస్(671), బిట్ల ప్రభు దయానంద్ (649), ఆకుల మాణిక్య రావు (646), నీరుడి ఫ్రాంక్ జాన్సన్ (646) పీక్ మోసెస్ మనోహర్ (638) గండిబోయిన శాంసన్ సందీప్ (బానీ)(637), లిల్లీ గ్రేస్ (631), సోమ జాకబ్ ఫ్రాన్సిస్ (623), ముల్కి శ్రీకాంత్ కుమార్ (612), బచ్చోళ్ల అనంత రావు (586), మర్కిలి జోయెల్ సామ్ బెనెడిక్ట్ (584), జానపతి వరప్రసాద్ (లడ్డూ)(573), వేముల శ్రీనివాస్ (572), శాంతి సుమమాల (559) గెలుపొందారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు. కాగా ఆదివారం మెదక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గెలుపొందిన అభ్యర్థులను ఘనంగా సన్మానించారు.



నేడు ప్రాచీన యోగ శిక్షణ శిబిరం

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 9: సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం ఆదేశానుసారం సింగరేణి ఉద్యోగులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణ కొరకు "ప్రాచీన యోగా దినచర్య" కార్యక్రమంలో భాగంగా యోగా వలన కలుగు పలితాల గురించి 'శ్రీ షణ్ముక శివ చంద్ర' హైదరాబాద్ యోగా గురువుచే అవగాహన కార్యక్రమం స్థానిక ఆర్సీఓఏ క్లబ్ లో నేడు సోమవారం ఉదయం 10.00 గంటలకు నిర్వహించనున్నట్లు జీఎం లలిత్ కుమార్ తెలిపారు. ఆర్జీ 1లోని అన్ని గనులు, డిపార్ట్మెంట్ లలో పని చేయు ఉద్యోగులు మొదటి బదిలీ మినహాయించి 2వ,3వ బదిలీల లో ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు,గోదావరిఖనిపారిశ్రామిక ప్రాంత వాసులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.



బీడీ కార్మికులందరికీ కొత్త పెన్షన్లు మంజూరు చేయాలి

- సిద్దిపేటలో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలి
- తెలంగాణ బీడీ, సిగార్వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కాముని గోపాలస్వామి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 9: సిద్దిపేట జిల్లాలో 70వేల మంది బీడీ కార్మికులు ఉన్న ఈఎస్ఐ హాస్పిటల్ లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ బీడీ, సిగార్వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కాముని గోపాలస్వామి అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా 4వ మహాసభ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు గోపాలస్వామి మాట్లాడుతూ బీడీ కార్మికులకు ప్రభుత్వం ఇస్తున్న జీవనభృతి 2016 ను 2014 సంవత్సరం వరకు కట్ ఆఫ్ తేదీని ఉపసంహరించుకొని బీడీ కార్మికులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎలక్షన్ ప్రచారంలో ఇచ్చిన హామీని ₹4016 జీవనభృతిని బీడీ కార్మికుల అందరికి వెంటనే అమలు చేయాలని అన్నారు. వారి వేతనాల నుండి ఈఎస్ఐ కి డబ్బులు కట్ అయినా వారికీ ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు. బీడీ కార్మికులకు కనీస వేతనాలు అతి తక్కువ వస్తున్నాయని ఈ వేతనాలతో కుటుంబాలు గడపలేక ఎన్నో అవస్థలుపడుతున్నారు అని అన్నారు.ఈ సమస్య పరిష్కారం కొరకు భవిష్యత్తులో పెద్ద ఏత్తున్న పోరాటాలను తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులను ఏకం చేసి ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గొడ్డుబర్ల భాస్కర్, జిల్లా కోశాధికారి ఇప్పకాయల శోభ, కొంపల్లి భాస్కర్, ఇదారి క్రాంతి, బత్తుల రాజు, పడాల శ్రీనివాస్, ఉస్కె కవిత, వసంత, ఎం డి షఫీ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరలపై అగ్రవర్ణాల అహంకార దాడులు సహించం

- వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు పీట్ల శ్రీధర్ హెచ్చరిక
- భారీ ర్యాలీ.. అంబేద్కర్, జ్యోతిరావు పూలేకు వినతిపత్రం



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 9: పేద వడ్డెరలపై అగ్రవర్ణాల అహంకార దాడులు ఇక సహించేది లేదని వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు పీట్ల శ్రీధర్ అన్నారు. ఒక వడ్డెరను దూషించడం అంటే వడ్డెర సమాజాన్ని అవమానించడం అంటూ ఇలాంటి దాడులు పునరావృతమైతే రాష్ట్రవ్యాప్తంగా భారీ ఉద్యమం తప్పదు అని హెచ్చరించారు. సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామానికి చెందిన వడ్డెర యువకుడు వల్లెపు రవిపై ఒక రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు దాడి చేసి తీవ్ర పదజాలంతో దూషించిన ఘటన చోటుచేసుకుంది. దాడి సమయంలో అవమానకర పదజాలంతో దూషించి, దారుణంగా కొట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాష్ట్రవ్యాప్తంగా వడ్డెర సంఘాలు ఆగ్రహావేశంతో ఉప్పొంగాయి. సిద్దిపేట జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ కు జ్యోతిరావు పూలే కు వినతిపత్రం సమర్పించారు. నిందితులు ఎంతటివారైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని, బాధిత కుటుంబానికి భద్రత కల్పించి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో నలుమూలల నుంచి వడ్డెర సంఘాలు ఆదివారం సిద్దిపేటకు తరలి వచ్చాయి. వందలాదిమంది వడ్డెరులు జిల్లా కేంద్రంలో ఆందోళన నిర్వహించారు. వడ్డెరలపై చేస్తున్న దాడులను అరికట్టాలని నినాదాలు చేశారు. జాతీయ వడ్డెర సంఘం నాయకులు మాట్లాడుతూ ఇది కులపరమైన అహంకారం కాదని, నేటి సమాజంలో పేదలపై జరుగుతున్న దాడులు అని మండిపడ్డారు. ఇలాంటి దాడులు మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలంటే నిందితులు ఎంత ప్రభావవంతులైనా చట్టం ముందు నిలబడాల్సిందే అని ఘాటుగా హెచ్చరించారు. స్థానిక నాయకులు మాట్లాడుతూ ఇది సామాజికంగా సున్నితమైన అంశం అని న్యాయం జరిగేలా ప్రభుత్వం, పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. అవమానిస్తే ఊరుకునే ప్రసక్తేలేదని, తెలంగాణ వ్యాప్తంగా వడ్డెర సోదరులందరూ ఏకతాటిపైకి వచ్చి ఉద్యమిస్తామని పీట్ల శ్రీధర్ హెచ్చరించారు. మందపల్లి గ్రామ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరుగుతోందని, సోషల్ మీడియాలో వచ్చిన వీడియో ఆధారంగా నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్థానిక సీఐ వాసుదేవరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సిద్దిపేట పట్టణ అధ్యక్షులు ఇరుగదిండ్ల తిరుపతి, రేపాక స్వామి, కోమ్మరాజుల నర్సింలు, శివరాత్రి బాలయ్య, బోదాసు మల్లేశం,వల్లపు శ్రీనివాస్, గొడ్డన్ల యాదగిరి, వల్లెపు మల్లేశం,బోదాస్ నాగరాజు, వల్లెపు పవన్ కుమార్, దున్నపోతుల శీను, సూర కిష్ట, వివిధ మండలాల అధ్యక్షులు గ్రామ అధ్యక్షులు యూత్ నాయకులు పాల్గొన్నారు.



జోనల్ లెవెల్ పోటీలలో విద్యార్థుల ప్రతిభ

ప్రతిపక్షం, మిడిదొడ్డి, నవంబర్ 9: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన 11వ జోనల్ లెవెల్ పోటీలలో మిడిదొడ్డి మండలం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ రఘునందన్ రావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 6 నుంచి 8 వరకు మానకొండూరులో జరిగిన 11వ జోనల్ లెవెల్ పోటీలలో రామ్ సింగ్, నితిన్, అరవింద్ లు అథ్లెటిక్స్ లో బంగారు పథకాలు సాధించారన్నారు. పలు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీరామ్, మధు తదితరులు పాల్గొన్నారు.



భారత్ ఏ దేశంపైనా ముందుగా అణు దాడి చేయకూడదనే ఎన్ఎఫ్‌యూ సూత్రానికి కట్టుబడి ఉంది. భారత్‌పై దాడి చేస్తే మాత్రం ప్రతీకారం తీర్చుకుంటుంది. పొరుగు దేశాల కవ్వింపు చర్యలకు భయపడబోం. సంయమనం, సంసిద్ధత రెండింటిపై భారత్ ఆధారపడి ఉంటుందన్నారు.
- రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

ప్రాంతీయం



హమాలీలకు కూలి రేట్లు పెంచుకుంటే ఆందోళన

- ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం ఎ గౌస్

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 9: గోదావరిఖని కూరగాయల మార్కెట్లో పని చేస్తున్నహమాలీ కార్మికులకు కూలీ రేట్లు పెంచుకుంటే నవంబర్ 12 తర్వాత ఆందోళన కార్యక్రమాల తోపాటు అవసరమైతే సమ్మె కు పిలుపునిస్తామని ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం ఎ గౌస్ హెచ్చరించారు. ఆదివారం గోదావరిఖని కూరగాయల మార్కెట్ లో జరిగిన హమాలీ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశం లో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి వెజిటబుల్ వెండర్స్ అసోసియేషన్ కు హమాలీ వర్కర్స్ కు కూలీ రేట్లు పెంచాలని కోరినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. హమాలీ వర్కర్స్ కు కూలీ రేట్లు పెంచమంటే హమాలీలను దొంగలుగా చిత్రీకరిస్తూ అవమాన పరుస్తున్నారని ఆయన ఆరోపించారు. హమాలీ వర్కర్స్ కు కూలీ రేట్లు పెంచకుండా వెజిటబుల్ వెండర్స్ అసోసియేషన్ నాయకులు నిర్లక్ష్యం చేస్తూ శ్రమ దోపిడి, ఆర్థిక దోపిడీ చేస్తూ హమాలీ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. ఇట్టి విషయంలో లేబర్ కమిషనర్ కు ఫిర్యాదు చేయడం జరిగిందని, కమిషనర్ ఈ నెల12 న కరీంనగర్ లో వెజిటబుల్ వెండర్స్ అసోసియేషన్ నాయకులను, హమాలీ వర్కర్స్ యూనియన్ తో సమావేశం ఏర్పాటు చేశారని, ఈ సమావేశంలో వెజిటబుల్ వెండర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొని హమాలీ వర్కర్స్ కు కూలీ రేట్లు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని లేకుంటే నవంబర్ 12 తర్వాత హమాలీ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) పక్షాన వెజిటబుల్ వెండర్స్ అసోసియేషన్ కు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, అవసరమైతే సమ్మె కు పిలుపు నిచ్చి మార్కెట్ ను బంద్ చేయిస్తామని ఆయన హెచ్చరించారు.ఈ సమావేశంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, గాలిపెల్లి సతీష్, రాంచందర్, జానీమియ,బండారి రవి పాల్గొన్నారు.

జీడికే ఓసీపీ5 బేస్ వర్క్ షాప్ ప్రారంభించిన సీఎండీ

- ఉత్పత్తి ఉత్పాదకత ఓబి పనులను పరిశీలించిన సీఎండి



ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 9: జీడీకే ఓసీపీ 5 ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన బేస్ వర్క్ షాప్ ను ఆదివారం సింగరేణి సీఎండీ యన్ బలరామ్ ప్రారంభించారు. అనంతరం రామగుండం 1 ఏరియా లోని జీడీకే ఓసీపీ 5 ఉపరితల గనిని సందర్శించారు. ఈ సందర్భంగా జీయం ఆర్జీ 1 లలిత్ కుమార్ వారికి స్వాగతం పలికి శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మొదట ఓసి5 వ్యూ పాయింట్ వద్ద క్వారీ ఆపరేషన్లపై అధికారులతో ఓసి5 ప్రాజెక్ట్ ఆఫీసర్, మేనేజర్లతో ఉత్పత్తి, ఉత్పాదకత, ఓబి రిమూవల్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సింగరేణి యాజమాన్యం పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేపట్టిన మొక్కలను పరిశీలించి నూతనం గా మొక్కలు నాటారు. అదే విధంగా జీడీకే ఓసి 5 ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన బేస్ వర్క్ షాప్ ను ప్రారంభించారు. రామగుండం1 ఏరియాలోని కార్మిక కాలనీలు, క్వార్టర్ల స్థితిగతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అక్కడి ఉద్యోగులతో క్వార్టర్లలో మెరుగైనసౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని స్థానిక యాజమాన్యానికి, సివిల్ విభాగం ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోసింగరేణి సామాజిక బాధ్యత నిధులతో కొనసాగుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఈ అండ్ ఎం తిరుమల్ రావు,ఆర్జీ 1 జీఎం లలిత్ కుమార్, ఆర్జీ 2 జీఎం బండి వెంకటయ్య, శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, సివిల్ జీఎం వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ రాంమోహన్ రావు, యస్ఓటు జీఎం చంద్రశేఖర్, ఓసి5 ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, డీజీఎం పారెస్ట్ కర్ణ, డీజీఎం సివిల్ వరప్రసాద్, ఓసి 5 ప్రాజెక్ట్ ఇంజనీర్ పి.రమేష్, మేనేజర్ రమేష్, సీఎంఓఏఐ ప్రతినిధి పొనుగోటి శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లయ్య, ప్రభుదాస్, ఓసి 5 ఓబీ కాంట్రాక్టర్ నిఖిల్, యూనియన్ నాయకులు, అధికారులు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



బీఎస్పీ జన కళ్యాణ్ కారి దివస్ కి సహకరించండి

- జిల్లా అధ్యక్షులు ఉమేష్

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 9: నవంబర్ 1 వ తేదీ నుండి ప్రారంభం అయిన బీఎస్పీ విరాళాల సేకరణ కార్యక్రమం. జనకళ్యాణ్ కారి దివస్ కు హుస్నాబాద్ నియోజకవర్గం ప్రజలు, వ్యాపారస్థులు, ఉద్యోగులు సహకరించి విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు పుల్లూరు ఉమేష్ కోరారు. రాజ్యాంగం రక్షణ బీఎస్పీతోనే సాధ్యమని రాజ్యాంగం ఉంటేనే బహుజనుల హక్కులు రక్షణ ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జి దేగల వెంకటేష్, అసెంబ్లీ ఇంచార్జి బోయిని బాబు, నియోజక వర్గ అధ్యక్షులు వేల్పుల రాజు, మాజీ జిల్లా అధ్యక్షులు డబ్బేడా యాదయ్య, కలకోటి వెంకన్న, మహేందర్ జెరిపోతుల రాజు తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సభ

ప్రతిపక్షం ప్రతిపక్షం, రాజన్న సిరిసిల్ల, నవంబర్ 9: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సీపీఐ ఎంఎల్ పార్టీ అగ్రనేత గోదావరి లోయ ప్రతిఘటన పోరాట నిర్మాత కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41 వ వర్ధంతి సభను శాంతి నగర్ లోని వరలక్ష్మి ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సభను సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ముందుగా జెండాను ఆవిష్కరించిన అనంతరం ఏఐఎఫ్టియు న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోమిశెట్టి దశరథం మాట్లాడుతూ భారత సమాజాన్ని అర్ధవలస అర్ధ ఫ్యూడల్ బానిసత్వపు సంకెళ్ల నుండి విముక్తి చేయడానికి, భారత దేశపు సమాజ పురోగమనానికి తోడ్పాటు కలిగిన నూతన ప్రజాతంత్ర విప్లవ సాధన కర్తవ్యాన్ని నిర్వహించడానికి,అంకితమవుదాం అని విప్లవ కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కొంటున్న ఎదురుదెబ్బలను విభజనలను అధిగమించడానికి, పట్టుదలతో కూడిన అనుభవాలపై ఆధారపడిన సిద్ధాంత రాజకీయ కృషిని సాగిద్దాం అన్నారు. ప్రజలను వర్గ పోరాటంలోకి వ్యవసాయ విప్లవోద్యమ భూ పోరాటంలోకి సమీకరించే దీర్ఘకాలిక కర్తవ్యాలను చేపడతామని, అంకిత భావంతో కర్తవ్యాలను నిర్వహించుదామని అన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 9: హవేలి ఘనపూర్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పాఠశాలకు చెందిన 1997-98లో 7వ తరగతి బ్యాచ్కు చెందిన విద్యార్థిని విద్యార్థులు ఒక్కచోట చేరి సందడి చేశారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. గత స్మృతులను గుర్తు చేసుకొని, సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ తో పాటు ఉపాధ్యాయులు, నీలకంఠం, సురేఖ తదితరులు పాల్గొన్నారు.



తండా వాసికి డాక్టరేట్ పట్టా

- గిరిజన సమాజానికి గర్వకారణం

ప్రతిపక్షం, అక్కన్నపేట్, నవంబర్ 9: అక్కనపేట మండలం పంజాగుట్ట తండాకు చెందిన గుగులోతు తిరుపతి నాయక్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి " తెలంగాణ బంజారా అనుబంధ సాహిత్యం " పై పీహెచ్డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. మారుమూల గ్రామం నుండి పేద, మధ్యతరగతి, బడుగు బలహీన వర్గానికి చెందిన ఈ గిరిజన బిడ్డ సాధించిన ఈ విజయంతో బంజారా సమాజ గౌరవం మరింతగా పెరిగిందని, తిరుపతి నాయక్ గారి సాధన పట్ల తండా యువత హర్షం వ్యక్తం చేశారు. బంజారా సంస్కృతి, కట్టు, బొట్టు, భాష గౌరవాన్ని నిలబెట్టి, గిరిజన సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన ఆయనకు యువత సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో గుగులోతు రాకేష్ నాయక్, వెంకటేష్ నాయక్,పరశురామ్ నాయక్, కుమార్,అంజన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వీహెచ్పీ, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 9: చేగుంట మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కేజీఎస్ ఆసుపత్రిలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి నీల శ్యామ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం కొనసాగింది. వీహెచ్పీ, బజరంగ్దళ్ కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ చేగుంట ప్రఖండ అధ్యక్షులు సోమ సురేష్ ముదిరాజ్, బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ నాగరాజు, చింతల భూపాల్, కుమ్మరి నర్సింహులు, నాగేశ్వరరావు, దూడ రవీందర్, మల్లేష్, మహేష్, మోహన్, వేణు తదితరులు పాల్గొన్నారు.



'ఉజ్వల ఉచిత గ్యాస్' దరఖాస్తులు అందజేత

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 9: కాంగ్రెస్ పార్టీ 49 డివిజన్ బాజీ కార్పొరేటర్ సనా ఫక్రుద్దీన్ రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హెచ్ పి గ్యాస్ కనెక్షన్ల దరఖాస్తులు మహిళలకు అందజేశారు. సనా ఫక్రుద్దీన్ రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు మాజీ కార్పొరేటర్ స్వగృహంలో రవితేజ హెచ్పి ఏజెన్సీ ఆధ్వర్యంలో ఉజ్వల ఉచిత గ్యాస్ కలెక్షన్ల కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెల్లరేషన్ వార్డ్ కలిగిన వారికి గ్యాస్ కనెక్షన్ లేని వారందరు దరఖాస్తులు చేసుకున్నారు. త్వరలో నిరుపేదలందరికి ఉజ్వల గ్యాస్ కలెక్షన్ లో ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సనా ఫక్రుద్దీన్, హెచ్పీ గ్యాస్ ప్రోప్రైటర్స్ పింగిలి రవిందర్ రెడ్డి, కొండా వసంత, పింగిలి సరిత, శ్రీధర్ ఇరుగరాల, కాంగ్రెస్ పార్టీ నాయకులు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.



ఏడుపాయల్లో పోటెత్తిన భక్తులు


ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 9: రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గ మాత ఆలయం స్వయంభుగా వెలసిన అమ్మవారికి చారిత్రక నేపథ్యం కలిగిన చరిత్ర ఉంది. జనమేజయుని సర్ప యాగస్థలిగా పేరుగాంచింది. కోరికలు తీర్చే కలుపవల్లిగా ఏడుపాయల వనదుర్గామాత క్షేత్రం ఆదివారం భక్తులతో జనసంద్రమైంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఏడుపాయలకు భక్తులు పోటెత్తారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. వనదుర్గమ్మ ప్రధాన ఆలయం ముందున్న నదీ పాయ కొంతమేర ప్రవహించడంతో మూలవిరాట్ దర్శనానికి భక్తులకు ఇంకా అనుమతి ఇవ్వలేదు. దీంతో రాజగోపురంలో ప్రతిష్ఠించిన ఉత్సవ విగ్రహం వద్ద భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆలయ అర్చకులు వేకువజామునే అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించి భక్తులకు వనదుర్గమ్మ దర్శనం కల్పించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాలు, జంట నగరాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మ దర్శనానికి తరలివచ్చారు. మంజీరా నదీ పాయలో పుణ్యస్నానాలు ఆచరించి వన దుర్గాదేవి దర్శనానికి బారులు తీరారు. అమ్మ దర్శనంతో భక్తులు తన్మయత్వం చెందారు. పలువురు భక్తులు అమ్మవారికి డప్పు చప్పుల్ల మధ్య బోనాలు, ఓడి బియ్యం సమర్పించారు. మరికొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య ఏడుపాయల వనదుర్గాదేవి క్షేత్రం హోరెత్తింది. భక్తుల కనుగుణంగా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆలయం చంద్రశేఖర్ తెలిపారు. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పాపన్నపేట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బద్దబస్థుపాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు నిర్వహించారు.

'చలో ఢిల్లీ' విజయవంతం చేయండి

- జస్టిస్ గవాయిపై దాడికి నిరసనగా 17న చలో ఢిల్లీ
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ.



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 9: సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ పై దాడి జరిగి నెల రోజులు కావస్తున్న ఇప్పటికీ కేసులు నమోదు చేయకపోవడాన్ని నిరసిస్తూ నవంబర్ 17 న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఢిల్లీలో పెద్ద ఎత్తున దళితుల ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ , ఎంఎస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి మాదిగలు అన్నారు. ఆదివారం ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ అనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశం మాయ గార్డెన్ లో జిల్లా ఇంచార్జి బొజ్జ సైదులు మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ స్థానంలో ఉన్న దళితుడికే రక్షణ లేకపోతే దేశంలో సామాన్య దళితులకు రక్షణ ఎలా ఉంటుందని అన్నారు. ఈ దాడి జరిగి నెల రోజుల కావస్తున్నా ఇప్పటికీ కేసు నమోదు చేయకపోవడం దారుణమని అన్నారు. దళితులు ఎంత ఉన్నత స్థానానికి కష్టపడి ఎదిగినా కుల రక్కసి వెంటాడుతుందని వారు అన్నారు. న్యాయవ్యవస్థ, జాతీయ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు స్వీకరించుకుండా కుల వివక్షతను పక్షపాతాన్ని చూపాయని అన్నారు. తక్షణమే దాడి ఘటన మీద కేసు నమోదు చేయాలని, నిందితుడిని అరెస్టు చేసి జైలులో పెట్టాలని, అలాగే ఈ ఘటన మీద సుప్రీం కోర్టు రిటైర్డు జడ్జీ చేత విచారణ జరిపించాలని అన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు సంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంద కుమార్ మాదిగ, సంగారెడ్డి ఇంచార్జ్ రామారావు శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్పి ఉమ్మడి జిల్లా కోయిన్చార్జ్ మల్లిగారి యాదగిరి మాదిగ, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మైసగళ్ళ బుచ్చింద్ర, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ముక్కపల్లి రాజు, మెదక్ జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి యాదగిరి మాదిగ, అధికార ప్రతినిధి ఎన్నెల్లి సుధాకర్ మాదిగ, ప్రధాన కార్యదర్శి మలిశెట్టి రవి మాదిగ మెదక్ జిల్లా అధ్యక్షులు బాచుపల్లి పండు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దండు శంకర్, సిద్దిపేట జిల్లా దేవరపల్లి అశోక్ కుమార్, మహిళ నాయకురాలు మాధవి, సరూప, పుష్ప, మెదక్ మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్చార్జ్ ఉషన్నగారి మురళి తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఎస్ఎస్ సమాజం కోసం ఏర్పడింది. ఆర్ఎస్ఎస్ దేనికీ వ్యతిరేకం కాదు. అది అధికారాన్ని కోరుకోదు. సమాజంలో ప్రాధాన్యతను ఆశించదు. దేశ కీర్తి పెంచేందుకు సేవ చేయాలని కోరుకుంటుంది. మొదట్లో ఆర్ఎస్ఎస్ను ప్రజలు నమ్మలేదు. ఇప్పుడు పూర్తిగా నమ్ముతున్నారు.
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్



ప్రాంతీయం

మల్లన్న సన్నిధిలో భక్తుల కిటకిట

- మల్లన్న ఆలయంలో ఘనంగా కార్తీక దీపోత్సవం



ప్రతిపక్షం, కొమురవెల్లి, నవంబర్ 9: కొమురవెల్లి శ్రీ మల్లికార్జునస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. కార్తీకమాసం పురస్కరించుకుని శనివారం నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు దేవస్థానం సత్రాలు, ప్రయివేటు గదులలో రాత్రి బసచేశారు.శ్రీ మల్లికార్జునస్వామిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి భక్తులు పట్నం, అభిషేకం, దీపాలు వెలిగించుట, అర్చన, నిత్యాకల్యాణం, బోనం, తిరుగుడు కోడె, కేశకండన, గంగిరేగు చెట్టుకు ముడుపులు కట్టి భక్తులు తదితర మొక్కలను చెల్లించుకున్నారు. అనంతరం మల్లన్న గుట్టపైన కొలువైవున్న శ్రీ రేణుక ఎల్లమ్మ, నల్ల పోచమ్మ అమ్మవార్లను దర్శించుకొని బోనాలు సమర్పించారు.

మల్లన్న ఆలయంలో ఘనంగా కార్తీక దీపోత్సవం

కార్తీకమాసం పురస్కరించుకొని మల్లికార్జున స్వామి ఆలయ ముఖమండపంలో కార్తీక బహుళ పంచమి సందర్భముగా 20వ రోజున మహాగణపతి స్తోత్ర పఠనం గావించి లింగాకృతిలో దీపకలంకరణ గావించి దీపోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమములో గ్రామస్తులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు దీపోత్సవంలో పాల్గొని తరించినారు. ఆలయ సిబ్బంది భక్తులకు దీప ప్రమిదలు, పూజ సామాగ్రి సమకూర్చినారు. అనంతరం ఆలయ అర్చకులు దీపోత్సవంలో పాల్గొన్న సువాసినులకు ప్రసాద తాంబూలములను అందజేసి ఆశీర్వదించినారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ టీ. వెంకటేష్, ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు నీల శేఖర్, ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



ఆంజన్న గుడికి 18 గుంటల స్థలం విరాళం

ప్రతిపక్షం, చిగురుమామిడి, నవంబర్ 9 : మండలంలోని బొమ్మనపల్లి గడీల ఆంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మాణార్థం ఓరుగంటి కుటుంబం దాతృత్వాన్ని ప్రదర్శించింది. గ్రామానికి చెందిన ఓరుగంటి రాంరెడ్డి,లచ్చవ్వ దంపతులు, ఓరుగంటి వీరారెడ్డి, నరసవ్వ దంపతుల జ్ఞాపకార్థంగా వారి వారసులు ఓరుగంటి హనుమాన్తారెడ్డి,అరుణ దంపతులు, ఓరుగంటి రాజిరెడ్డి, గంగవ్వ దంపతులు తమ ఉమ్మడి ఆస్తి అయిన హౌస్ నంబర్ 4-17లోని 18 గుంటల స్థలాన్ని గడీల ఆంజనేయస్వామి దేవాలయానికి విరాళంగా అందించారు. గ్రామంలోని పురాతన దేవాలయం ఆంజనేయస్వామి, శివలింగాల గుడి పునర్నిర్మాణానికి ఈ స్థలాన్ని వినియోగించనున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఓరుగంటి కుటుంబానికి కృతజ్ఞతలు తెలియజేసి, దేవస్థాన అభివృద్ధి కోసం చేసిన ఈ సేవా కార్యక్రమం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని అభినందించారు. గ్రామ దేవతల ఆశీస్సులు, ఆంజనేయస్వామి కరుణ కటాక్షం ఎల్లప్పుడూ ఆ కుటుంబంపై ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రామక మల్లినాదశాస్త్రి, తాడి వాసుదేవరెడ్డి, తాటి పెల్లి లింగారెడ్డి, కాసర్ల మహేందర్, తోట వెంకన్న, చెట్ల వెంకటరాజం, పెండల సదానందం, గంప మదన్మోహన్, కంది శంకర్, మాజీ ఎంపిటిసి కత్తుల రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా అమ్మవారి బోనాల పండుగ

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 9 : నగరంలోని 19వ డివిజన్‌లో శ్రీ మహాలక్ష్మి కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి బోనాల పండుగ భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగింది. ఈ వేడుకలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త ముఖ్య అతిథిగా హాజరై భక్తిపూర్వకంగా బోనాలు ఎత్తుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాలక్ష్మి అమ్మవారి బోనాలు తెలంగాణ సాంప్రదాయ సంస్కృతికి అద్దం పడుతున్నాయని ప్రజల ఐకమత్యం, భక్తి, సాంస్కృతిక విలువలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగలను మనందరం భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు.ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు బోనాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రాంతమంతా భక్తి సందడితో నిండింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగోల్ల రవి, బీజేపీ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, కంటేశ్వర్ మండల ప్రధాన కార్యదర్శి మేకల సాయి ప్రవీణ్, ఎల్లమ్మ తల్లి మండల ప్రధాన కార్యదర్శి బెండ ప్రసాద్, బీజేపీ నాయకులు గుండు రవి, సాయిరాం, సాయిలు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నరు.



జిల్లా వ్యాప్తంగా 46 వాహనాలు సీజ్

- మైనర్ పిల్లలను,తల్లి తండ్రులను కలిపి 70 మందికి కౌన్సిలింగ్

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 9 : జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీ డా: జి. జానకి షర్మిల ఆదేశాల మేరకు ఆదివారం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించబడింది.ఈ డ్రైవ్‌లో మొత్తం 46 మైనర్ డ్రైవింగ్ వాహనాలు సీజ్ చేయబడినవి. మైనర్లు మరియు వారి తల్లిదండ్రులు కలిపి మొత్తం 70 మందికి స్థానికంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం మైనర్ల వాహన నిర్వహణకు వాహన యజమాని (తల్లిదండ్రుల)దే బాధ్యత అని ఎస్ హెచ్ వోలు హెచ్చరించారు. పిల్లలకు వాహనాలు ఇచ్చే ముందు తల్లిదండ్రులు పూర్తి బాధ్యతను తీసుకోవాలని వారు సూచించారు.ఈ తనిఖీల్లో జిల్లాలో ఉన్న అన్ని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



ఘనంగా స.హ. చట్టం సాధన కమిటీ వార్షికోత్సవం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 9: సమాచార హక్కు చట్టం ప్రజలకు అవగాహన కల్పించడం, పారదర్శకతను పెంపొందించడం లక్ష్యంగా కమిటీ నిరంతరం కృషి చేస్తుందని సిద్దిపేట జిల్లా వైస్ ప్రెసిడెంట్ జితేందర్ రెడ్డి తెలిపారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ స్థాపనకు సంవత్సరం పూర్తయిన సందర్భంగా బాల సదనంలో పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా వైస్ ప్రెసిడెంట్ జితేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెల్పుల మహేందర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఈ రోజు మనందరికీ గర్వకారణమైన రోజనీ సమాచార హక్కు చట్టం సాధన కమిటీ స్థాపనకు సరిగ్గా ఒక సంవత్సరం పూర్తయిందన్నారు. జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డా చంటి ముదిరాజ్ ,రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ,జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం ఆదేశాల మేరకు ఈ సంవత్సర కాలంలో కమిటీ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రజల హక్కుల పరిరక్షణ, పారదర్శక పాలన కోసం నిరంతరం కృషి చేసిందన్నారు.బాల సదనం పిల్లలు, సిబ్బందికి పండ్లు పంపిణీ చేస్తూ, సమాజానికి సేవ చేయడం ప్రతి సభ్యుని బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలపెట్టుకోవాలి

- పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున రెడ్డి

ప్రతిపక్షం, అక్కన్నపేట్, నవంబర్ 9: మొంథా తుపాన్ ప్రభావంతో భారీ వర్షం కురవడంతో హుస్నాబాద్ ప్రాంతంలో చేతికి వచ్చిన వరి, పత్తి, మొక్క జొన్న పంటలు రైతులకు పూర్తి నష్టపోయారని, రైతులను ఆదుకుంటామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలపెట్టుకోవాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుందని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి అన్నారు. అక్కన్న పేట్ మండలం పెద్ద తండాలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇచ్చిన మాటను నిలపెట్టుకోని నష్టపోయిన పంటలకు ఏకరాకు 40 వేల రూపాయల చొప్పున నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం పంట నష్టంపై వ్యవసాయ శాఖ అధికారులు సర్వే నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందని, కానీ అధికారులు అనేక నిబంధనలు పెట్టి సరిగి నష్ట సర్వే చేయడం లేదని మండి పడ్డారు. నిజంగా రైతులపై ప్రేమ ఉంటే, ఇచ్చిన మాటను నిలపెట్టుకోవాలని, లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుగోలోతు రాజు నాయక్, సక్ర నాయక్, బొడ్డు రాజు కుమార్, భీమా నాయక్, రాంచంద్రర్ నాయక్, దేవేందర్ నాయక్ పాల్గొన్నారు.



మక్తల్ వాసికి 3 లక్షల ఎల్‌వోసీ అందజేసిన మంత్రి వాకిటి శ్రీహరి

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయపేట్, నవంబర్ 9: మక్తల్ ప్రాంతానికి చెందిన చెందిన సత్తమ్మ అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్సకు వైద్య సహాయం కోసం మంత్రి వాకిటి శ్రీహరి ని సంప్రదించగా వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 3 లక్షల రూపాయల ఎల్ వోసీని మంజూరు చేయించారు. ఆదివారం మంత్రి అధికారిక నివాసంలో బాధితులకు అందచేశారు. ఆయన మాట్లాడుతు మంచి వైద్యం అంది, బాధితుడు త్వరగా కోలుకోవాలని, మీ కుటుంబానికి ప్రభుత్వము ద్వారా లబ్ధి చేకూర్చినందుకు సంతోషిస్తున్నాను. రాష్ట్రములోని నిరుపేద ప్రజలకి ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.



సంపత్‌లు సామాజిక సేవలో ముందుండాలి

- గ్రూపు వ్యవస్థాపకుడు ముక్కెర సంపత్ కుమార్

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 9: "సంపత్" లు సమాజ రుగ్మతల పట్ల పోరాడుతూ సామాజిక సేవలో ముందుండాలని "సంపతుల సేవాసమితి" గ్రూప్ అడ్మిన్ ముక్కెర సంపత్ కుమార్ పిలుపునిచ్చారు. సంపతుల సేవా సమితి హుస్నాబాద్ డివిజన్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం ఆదివారం నాడు స్థానిక భారత్ పబ్లిక్ స్కూల్ లో జరిగింది. సందర్భంగా గ్రూపు వ్యవస్థాపకుడు ముక్కెర సంపత్ కుమార్ మాట్లాడుతూ సోషల్ మీడియా విస్తృతంగా వ్యాప్తి చెందిన ఈ రోజులలో అనేక వాట్సాప్ గ్రూపులు ఏర్పడ్డాయని అన్నారు. సంపత్ అనే పేరు గల వాళ్లతో ఏర్పాటు చేసుకున్న ఈ గ్రూపు ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని చర్చించుకున్నట్లు తెలిపారు. తామంతా అతి త్వరలో భారీ స్థాయిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి రక్తహీనతతో బాధపడుతున్న వారికోసం రక్త నిధిని సమకూరుస్తామని అన్నారు. గంజాయి బారినపడి యువతరం పెడదోవ పడుతుందని, దాని నిర్మూలన కోసం అతి త్వరలో ఒక కార్యక్రమం చేపడతామని అన్నారు. రాబోయే మేడారం సమ్మక్క జాతరలో తాము వాలంటీర్లుగా పనిచేసి భక్తులకు సహకరిస్తామని అన్నారు. ఇలా అనేక సేవా కార్యక్రమాల ద్వారా సంపతులందరము సమాజానికి అందుబాటులో ఉందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీలం సంపత్ యాదవ్, రేపాక సంపత్ రెడ్డి, భూక్య సంపత్ నాయక్, ఎలగందుల సంపత్, బొంగోని సంపత్, బొడుమల్ల సంపత్ లు పాల్గొన్నారు.



“

ఈ ఎన్నికల్లో బీజేపీ డిపాజిట్ పోతుంది. రాసిపెట్టుకోండి. మీరు ఓడిపోతే హిందువులు మీతో లేరు అని భావించాలి. బీఆర్ఎస్ గెలుపు కోసం జూబ్లీహిల్స్‌లో బీజేపీ పనిచేస్తోంది. బీఆర్ఎస్ విలీనమైతే వచ్చే లాభంపై ఇక్కడ రెండు పార్టీలు లిట్మస్ టెస్ట్ చేసుకుంటున్నాయి.

- బండి సంజయ్ వ్యాఖ్యలపై సీఎం రేవంత్

కల్లుగీత కార్మికుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం

- తెలంగాణ కల్లుగీతా కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్



ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 9: కల్లుగీతా కార్మికుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందని తెలంగాణ కల్లుగీతా కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్ ఆరోపించారు. హుస్నాబాద్ మండలం పందిళ్ల గ్రామంలో గీత కార్మికుల సమస్యలపై జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాటి చెట్లపై పనిచేసే సమయంలో మరణించిన గీతా కార్మికుల కుటుంబాలకు, వికలాంగులైన వారికి ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి పరిహారం కూడా అందించలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన గీతా కార్మికులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయకపోవడంతో పాటు పాత పెన్షన్లను కూడా పెంచలేదని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా బెల్ట్ షాపులు తొలగిస్తామని, కల్లుగీతా కార్మిక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.100 కోట్లు నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గీత కార్మికుల సమస్యల పట్ల కనీస స్పందన చూపకపోవడం బాధాకరమని రవీందర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. గీతా కార్మికుల హక్కుల కోసం ఈ నెల 28వ తేదీన సూర్యాపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. హుస్నాబాద్ మండల గీతా కార్మికులు ఆ సభకు పెద్ద సంఖ్యలో హాజరై తమ గళాన్ని వినిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పూదరి రఘుపతి, బొమ్మగాని శ్రీనివాస్, బొమ్మగాని కుమారస్వామి, గాధగోని కనకయ్య, చెర్లవరపు సంపత్ తదితరులు పాల్గొన్నారు.



రహదారి నిర్మాణం చేపట్టాలని వినతి

ప్రతిపక్షం, నిర్మల్, నవంబర్ 9: నిర్మల్ రూరల్ మండలంలోని మేడిపల్లి గ్రామం నుండి ఎల్లారెడ్డిపేట గ్రామం వరకు రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఆయా గ్రామాల మాజీ సర్పంచులు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి నేతృత్వంలో డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడిపల్లి-ఎల్లారెడ్డిపేట గ్రామాల మధ్య రహదారి పరిస్థితి చాలా దయనీయంగా మారిందని విద్యార్థులు, రైతులు, రోగులు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి అభివృద్ధి జరిగితే రెండు గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సులభమవుతుందని పేర్కొన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే సంబంధిత అధికారులతో చర్చించి రహదారి పనులు ప్రారంభం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కుంట వేణు గోపాల్ పాల్గొన్నారు.



తుఫాన్ అంచనాలు రూపొందించండి

- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 9: మొంథా తుఫాన్ నష్టం అంచనాల వ్యవసాయ అధికారులు, క్షేత్ర స్థాయిల రైతుల పొలాలను సందర్శించి పక్కాగా నివేదిక తయారు చేయాలని, ఏ ఒక్క నష్టపోయిన రైతు మిగలకుండా ప్రతి ఒక్కరిని కవర్ చేయాలని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. నిర్ణీత నమూనా లో తుఫాన్ నష్టం అంచనా నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు . పంచాయతీ రాజ్, ఆర్అండ్బి రోడ్లు ఎంత మేరకు మరమ్మత్తులకు గురైందనే అంశాలను క్షేత్ర స్థాయి పరిశీలన చేసి పూర్తి ఆధారాలతో నివేదిక సిద్ధం చేయాలని, తాత్కాలిక మరమ్మత్తులు, శాశ్వత మరమ్మత్తులకు ఎంత వ్యయం అవుతుందో అంచనాలతో సహా వివరాలు సమర్పించాలని తెలిపారు.విద్యుత్ శాఖ సంబంధించి దెబ్బతిన్న పోల్స్, ట్రాన్స్ ఫార్మర్ వివరాలు అందించాలని అన్నారు. నీటి పారుదల శాఖ పరిధిలో దెబ్బతిన్న చెరువులు, కాల్వలు, నీటివనరుల వివరాలు సమర్పించాలన్నారు. ఇతర నిర్మాణాలు, దెబ్బతిన్న ఇండ్ల సంఖ్య, చనిపోయిన పశువులు, గొర్రెలు, పౌల్ట్రీ తదితర వివరాలను పక్కాగా తయారుచేసి నష్టపోయిన ప్రజలకు సహాయం చేరేలా చూడాలని మంత్రి ఆదేశించారు.



నిర్మల్‌లో ప్రపంచ ఉర్దూ భాషా దినోత్సవం

- పలువురు సాహితివేత్తలు పాత్రికేయులకు సన్మానం

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 9: ప్రపంచ ఉర్దూ భాషా దినోత్సవం, దివంగత జాతీయ ఉర్దూ కవి, మానవతావాది అల్లామా ఇక్బాల్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఉర్దూ భాషా పాత్రికేయుడు, సేవకులు సాహితీవేత్తలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హాజీ కమిటీ మాజీ గౌరవ సభ్యులు మొహమ్మద్ నజీరుద్దీన్ మాట్లాడుతూ ఉర్దూ భాషకు మెట్టినిల్లు పుట్టినిల్లు భారత దేశమైన విషయాన్ని గుర్తించాలన్నారు. స్వాతంత్ర పోరాటంలో ఈ భాష కీలక పాత్ర పోషించిందని చెప్పారు. ప్రతి ఏడు నవంబర్ 9న ఈ తరహా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. హజరత్ అల్లామా ఇక్బాల్ జాతీయత భావాలను ప్రపంచానికి చాటేలా తన రచనల, కవితల ద్వారా చాటి చెప్పారన్నారు. కలాం గుణం ఎడ్యుకేషనల్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 23 సంవత్సరాలుగా ఈ తరహా కార్యక్రమాలను నిర్వహిస్తూ ముందుకెళ్లడం ప్రశంసనీయమైనదన్నారు. బీఆర్ఎస్ మైనార్టీ విభాగం నాయకులు మహమ్మద్ బిన్ అలీ మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో అల్లమా ఇక్బాల్ రచనలు ఎంతగానో దోహదపడ్డాయని చెప్పారు. జాతీయ, ప్రపంచ ఉర్దూ భాష దినోత్సవాలను పెద్ద ఎత్తున అధికారికంగా నిర్వహించుకోవలసిన బాధ్యత మన అందరిపై ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు ఈ విషయంలో సవతి తల్లి ప్రేమను ప్రదర్శించడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు, వసీమ్ షకీల్, మొహమ్మద్ ఇస్తే కార్ ఓద్దిన్, మహమ్మద్ ఉస్మాన్, మోసిన్ చావుష్ ,ఫహీం ఖాన్, వసి ఉల్లా ఖాన్ ,మహమ్మద్ అజీం, సల్మాన్ షేక్, అమీన్ పటేల్, షేక్ షాదుల్లా హుస్సేన్, మొహమ్మద్ ఇఫ్థేఖార్ ఓద్దీన్ అన్సారి తదితరులు ఉన్నారు.



మత్తు పదార్థాల వినియోగం

జీవితాన్ని నాశనం చేస్తుంది

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 9: మత్తు పదార్థాల వినియోగం జీవితాన్ని నాశనం చేస్తుందని జిల్లా మేనేజర్ శ్రీనివాస్ అన్నారు.. అదివారం లక్ష్మంచంద మండల కేంద్రంలోని బీసీ హాస్టల్లో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన "మిషన్ పరివర్తన్ - నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, విద్యార్థుల భవిష్యత్తుపై వాటి ప్రభావాలను వివరించారు. మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని, సామాజిక సంబంధాలను తీవ్రంగా నాశనం చేస్తాయనీ, విద్యార్థులు ఆ మహమ్మారి నుంచి దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు మత్తు పదార్థాల వలన కలిగే సంఘర్షణలు, నివారణ కోసం పడాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ కార్యక్రమాలు, నిబంధనలను వివరించారు. "నషా ముక్త్ భారత్ అభియాన్" ద్వారా యువతను, పిల్లలను ఈ మత్తు పదార్థాల హానికర ప్రభావాల నుంచి రక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం అవగాహన, కార్యక్రమాలు చేపడుతోందని మత్తు పదార్థాల నుండి దూరంగా ఉంటూ, ఆరోగ్యంగా, భద్రంగా జీవించాలనే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సత్య నారాయణ రెడ్డి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ షేక్ ఇలియన్, సోషల్ వర్కర్ పుట్టి అశోక్ విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 9 : జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలనపై సోమవారం నుంచి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ప్రారంభించబోతున్నట్లు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసిడిఎస్ అధికారులు బృందాలుగా ఏర్పడి, జిల్లాలోని వివిధ ప్రాంతాలలో బాల్య వివాహాల అనర్థాలు, నిర్మూలన అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 14వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో మొక్కలు నాటనున్నట్లు చెప్పారు. అదేవిధంగా 18 వ తేదీన గ్రామాలలో ర్యాలీల ద్వారా అవగాహన కల్పిస్తారని వివరించారు. 20వ తేదీ నుంచి డివిజన్ల వారీగా, వివాహ ఆహ్వాన పత్రికల ప్రింటింగ్ ప్రెస్, డీజే యజమానులు, పూజారులు, పాస్టర్లు, ఖాజీలతో సమావేశాలు



నిర్వహిస్తామని అన్నారు. డిసెంబర్ ఒకటవ తేదీ వరకు వివిధ కార్యక్రమాల రూపేనా జిల్లా ప్రజల్లో బాల్యవివాహాల నిర్మూలలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, సంపూర్ణంగా బాల్యవివాహాలను అరికట్టేలా చర్యలు చేపట్టినట్లు అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ను వెంటనే సమావేశపరచాలి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 9 : ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ఐఎల్సి ని వెంటనే సమావేశపరచాలని, కార్మిక వర్గానికి వ్యతిరేకమైన శ్రమశక్తి నీతి 2025 నూతన లేబర్ పాలసీని వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పటాన్ చెరు పట్టణంలోని ఐలా భవన్ లో సిఐటియు ఆధ్వర్యంలో " కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన లేబర్ పాలసీ (శ్రమశక్తి నీతి 2025) కార్మిక వర్గం పై దాడి" అంశంపై జరిగిన సెమినార్ లో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు పాల్గొని ప్రసంగించారు.కేంద్ర బిజెపి ప్రభుత్వం దొడ్డిదారిన లేబర్ కోడ్స్ ను అమలు చేసేందుకే నూతన లేబర్ పాలసీ శ్రమశక్తి నీతి 2025 ను తెస్తుందని మండిపడ్డారు. ఇది పూర్తిగా కార్మిక వర్గానికి వ్యతిరేకమైందని, శ్రమశక్తి నీతి 2025 నూతన లేబర్ పాలసీని తేవడం అంటే కార్మిక వర్గం మీద దాడి చేయడమేనన్నారు. కార్మిక చట్టాలు ఉన్నప్పుడే అమలు కాకుండా ఉల్లంఘన జరుగుతున్నాయని అన్నారు. శ్రమ శక్తి నీతి 2025 పేరు గొప్పగా ఉంది తప్ప దాని పాలసీ మాత్రం కార్మికుల హక్కులను లేకుండా చేసి కట్టు బానిసలుగా మార్చేదిగా ఉందని ఆరోపించారు. 26 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చిందని చెప్పారు. లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా సిఐటియు దేశంలోని కార్మిక సంఘాలన్నిటిని ఏకం చేసి దేశవ్యాప్త సమ్మె చేయడంతో అమలు చేయకుండా వెనకడుగు వేసిందని గుర్తు చేశారు. దేశంలోని కేరళ వామపక్ష ప్రభుత్వం తప్ప అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వాలు 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతున్నాయని, కార్మికులకు వ్యతిరేకమైన లేబర్ కోడ్స్ ను కేరళ రాష్ట్రంలో అమలు చేయమని అక్కడి వామపక్ష ప్రభుత్వం ప్రకటించిందన్నారు. శ్రమ శక్తి నీతి లేబర్ పాలసీని మనుస్మృతి పద్ధతిలో అమలు చేయాలంటే డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అందించిన రాజ్యాంగం పక్కన పెట్టడమే అన్నారు. ఇది సామాజిక న్యాయానికి ప్రజాస్వామానికి దెబ్బతీస్తుందని తెలిపారు. వివక్ష అసమానతలను పెంచి పోషిస్తదని, ప్రమాదకరమైన, కార్మిక వ్యతిరేక నూతన లేబర్ పాలసీ శ్రమశక్తి నీతి 2025 ను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ను వెంటనే సమావేశ పర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని సిఐటియు డిమాండ్ చేస్తుందని అన్నారు. కార్మికులకు వ్యతిరేకమైన శ్రమశక్తి నీతి 2025 నూతన లేబర్ పాలసీని కార్మిక వర్గం ఐక్యంగా ప్రతిఘటించాలని ఈ సందర్భంగా కార్మిక వర్గాన్ని కి పిలుపునిచ్చారు. ఈ సెమినార్ లో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కే. రాజయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అతిమేల మానిక్, కిర్బియూనియన్ జనరల్ సెక్రెటరీ విఎస్ రాజు, యూనియన్ నాయకులు మల్లేష్, లఖన్ ,తలారి శ్రీనివాస్ శ్యాంబాబు రాజిరెడ్డి బిలాల్, జైపాల్, మహేశ్వర్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు నాంది పలికిన సీఐటీయూ

- రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్



ప్రతిపక్షం సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 9 : పటాన్చెరు శ్రామిక భవన్ లో సీనర్జీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ అధ్యక్షులు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లికార్జున గారు హాజరై ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ డిసెంబరు 7, 8, 9 తేదీలలో మెదక్ పట్టణంలో జరిగే సిఐటియు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు, నిత్యము కార్మికులకు అండగా సీఐటియూ నిలబడుతుందని ఆయన అన్నారు, కార్మికుల సమస్యలపై అనునిత్యం ఉద్యమాలు చేస్తుందని ఆయన అన్నారు, కార్మికుల సమస్యలపై ఐక్య ఉద్యమాలకు నాంది పోసింది సీఐటియూ అని అన్నారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలపై సిఐటియు పోరాడిందని అన్నారు. అలాగే కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా ఉద్యమించిందని అన్నారు, మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడు లకు వ్యతిరేకంగా అనునిత్యం కార్మికులను సంఘటితం చేసిందని ఆయన అన్నారు, లేబర్ కోడుల వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతరాని అని అన్నారు, ఈ మధ్య కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడు స్థానంలో శ్రమశక్తి నీతి 2025 ను తెచ్చింది అని ఆయన అన్నారు. ఈ సమావేశం లో యూనియన్ వర్కింగ్ రైటింగ్ కే. రాజయ్య మరియు జనరల్ సెక్రెటరీ శాంత కుమారు మాట్లాడారు, ఈ సమావేశంలో హరినాథ్, యాదగిరి ,సత్యనారాయణ, కృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భారతీయ రాజపుతాన సేవ సంఘటన్ మెదక్ జిల్లా

నూతన కమిటీ ఏర్పాటు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 9 : పటాన్చెరు లో రాజన్ సింగ్ నివాసంలో ఆదివారం రోజున భారతీయ రాజపుతాన సేవ సంఘటన్ కమిటీ తరపున ఆల్ ఇండియా ప్రెసిడెంట్ అనిల్ కుమార్ సింగ్ (ఆర్మీ రిటైర్డ్), సెంట్రల్ కమిటీ మెంబర్ రాజన్ సింగ్ అలాగే విశ్వజిత్ సింగ్ తో ముఖ్య అతిధులు గూడెం మధుసూదన్ రెడ్డి హాజరైనారు వీరి ఆధ్వర్యంలో భారతీయ రాజపుతాన సేవ సంఘటన్ ఉమ్మడి మెదక్ జిల్లా కమిటీ నుంచి ప్రెసిడెంట్ గా సంజయ్ కుమార్ సింగ్ ని వైస్ ప్రెసిడెంట్ గా నర్సింగ్(రిటైర్డ్ ఆర్మీ) అశ్విని కుమార్ సింగ్ గారిని అలాగే సెక్రటరీగా ధర్మేందర్ సింగ్ గారిని జనరల్ సెక్రటరీ, నీరజ్ కుమార్ సింగ్ ని ట్రెజరర్, యశ్వంత్ సింగ్ ని జాయింట్ సెక్రటరీగా సంజీవ్ కుమార్ పటేల్ ను అలాగే ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ప్రిన్స్ కుమార్ సింగ్, సంతోష్‌కుమార్ సింగ్ వినోద్ కుమార్ సింగ్, మైపాల్ సింగ్, గణేష్ సింగ్, కె. ఎన్ సింగ్ అనిల్ సింగ్ కుమార్ సింగ్ ను ఎన్నుకోవడం జరిగినది. మరి ఈ సందర్భంగా ఎన్నుకున్న వారిని అనిల్ కుమార్ సింగ్, గూడెం మధుసూదన్ రెడ్డి సన్మానించి మెమొంటోలు అందజేసి వారికి అభినందనలు తెలిపినారు. ఈ కార్యక్రమానికి స్థానిక సభ్యులందరూ హాజరైనారు.



శంభుని కుంట పరిరక్షణ కోసం సంతకాల సేకరణ

- కుంటను సుందరీ కరణ చేయాలని సీపీఎం డిమాండ్
- కుంటలో ఉన్న చెత్తను , పిచ్చిచెట్లను వెంటనే తొలగించాలి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 9 : అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శంభునికుంటను పరిరక్షించి ప్రజా అవసరాల కోసం సుందరీకరించాలని సిపిఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంతకాల సేకరణ చేపట్టడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు పాండురంగారెడ్డి నరసింహారెడ్డి సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు నాయిని లలిత మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు జి సునీత తదితరులు మాట్లాడుతూ జనవాసాల మధ్యన ఉన్న శంభునికుంటను ప్రజలందరికీ భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని, కుంటలో ఉన్న చెత్తాను,పిచ్చి మొక్కలను తొలగించి,పిల్లలకు,వృద్ధులకు ఉపయోగపడేలా కుంట చుట్టు వాకింగ్ ట్రాక్, పార్కులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కుంట చుట్టు పెన్షన్ వేసి, కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కుంటను కబ్జాదారు నుండి కాపాడాలని అన్నారు. చుట్టు పక్క కాలనీవాసులు మహిళలు యువకులు ఉద్యోగులు కార్మికులు పెద్ద ఎత్తున సంతకాలు చేశారని అన్నారు. ప్రజల అభిప్రాయాన్ని సంతకాలను రేపు సోమవారం రోజు జిల్లా కలెక్టర్ కు అందజేసి ప్రజల ఆకాంక్షను తెలియజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జార్జ్, శ్రీనివాస్, సత్తిబాబు,శ్రీనివాస్ రెడ్డి, మహిళా సంఘం నాయకులు సుజాత,మల్లేశ్వరి యువజన సంఘం నాయకులు సురేష్, హరినాథ్ సిఐటియు,టెన్షనర్స్ సంగం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి



ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 9: వృత్తి విద్యలో శిక్షణ పొందిన యువతీ, యువకులకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మర్కజీ వారు తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష వారి సౌజన్యంతో ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల హనుమకొండలో జాబ్ మేళాను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.వెంకట్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఇంజనీరింగ్ చదవడం ద్వారా మాత్రమే కాకుండా వృత్తి విద్యలను అభ్యసించడం ద్వారా కూడా యువత నైపుణ్యాలను పెంచుకొని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందవచ్చునని తెలిపారు. అదే విధంగా వివిధ ప్రైవేట్ కంపెనీలు ప్రభుత్వ పాఠశాలలో వృత్తి విద్యలను అభ్యసించే విద్యార్థుల కొరకు అవకాశాలను ఇచ్చి వారి నైపుణ్యాలను పెంపొందించుకునే విధంగా అవకాశాలను కల్పించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో 2015 సంవత్సరం నుండి ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశపెట్టిన ఈ వృత్తి విద్యా కోర్సులు 2030 నాటికల్లా అన్ని పాఠశాలకు విస్తరించనున్నట్లు అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ జాబ్ మేళా ప్రారంభోత్సవ కార్యక్రమం లో ప్రభుత్వ మర్కజీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి. రామారావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ 1200 మంది నిరుద్యోగ యువత ఉద్యోగం కొరకు ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతీ రాష్ట్రంలో సమగ్ర శిక్ష పరిధిలో వివిధ ప్రభుత్వ పాఠశాలలో వృత్తి విద్యను అభ్యసించిన యువతీ, యువకులకు ఈ జాబ్ మేళా ద్వారా ఉద్యోగాలు ఇవ్వడం కొరకు 24 ప్రైవేట్ కంపెనీలు ఇక్కడికి వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర వృత్తి విద్య కోఆర్డినేటర్ బి. నాగేశ్వరరావు మాట్లాడుతూ వృత్తి విద్యను అభ్యసించడం ద్వారా యువత తమ యొక్క నైపుణ్యాలను పెంచుకొని స్వయం ఉపాధిని పొందవచ్చునని, అదేవిధంగా ప్రభుత్వం కూడా వృత్తి విద్యలను ప్రభుత్వ పాఠశాలలో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం ఓ డాక్టర్ బి మన్మోహన్ , హనుమకొండ మండల విద్యాశాఖ అధికారి జి.నెహ్రూ నాయక్, ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు వి. జగన్నాథం, వివిధ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ఒకేషనల్ టీచర్స్, ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు,ఎన్సిసి క్యాడెట్లు అధిక సంఖ్యలో ఉద్యోగార్థులు పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణం అంతా ఉద్యోగాల పర్వదినంగా కోలాహలంగా కనిపించింది. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో వివిధ కంపెనీలకు ఎంపికైన 214 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగాలు పొందిన వారందరు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో ని వృత్తి విద్య ను అభ్యసించడమే ఈనాటి మా విజయానికి కారణమని పేర్కొన్నారు.



రాష్ట్రాన్ని మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నాం. ఐటీ రంగంలోనూ విశాఖ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఎంఎస్ఎంఈ విభాగంలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలుస్తోంది. సీఐఐ సదస్సులో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా. ఏపీపై పెట్టుబడిదారుల ఆసక్తి పెరుగుతోంది.

- ఏపీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఓట్ల చోరీని బీజేపీ సంస్థాగతం చేస్తోంది

- తీవ్రంగా మండిపడిన రాహుల్ గాంధీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, భోపాల్, నవంబర్ 9 : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్ అనేది ఓట్ల చోరీని కప్పిపుచ్చే ప్రయత్నమని విమర్శించారు. ఓట్ల చోరీని బీజేపీ సంస్థాగతం చేస్తోందని మండిపడ్డారు. హర్యానాలో లాగే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లో ఓట్ల చోరీ జరిగిందని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లోని పచ్‌మఢీలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమం అనంతరం రాహుల్ విలేకరులతో మాట్లాడారు. ఓట్ల దొంగతనం మన దేశంలో ఒక ప్రధాన సమస్య అని, ఎస్ఐఆర్ ప్రక్రియతో దానికి అధికారికంగా గుర్తింపు ఇవ్వాలనుకుంటున్నారని విమర్శించారు. కొద్ది రోజుల క్రితం తాను హర్యానా ఎన్నికలపై ఒక ప్రెజెంటేషన్ ఇచ్చానని, అక్కడ ఓటు చోరీ జరిగినట్లు స్పష్టంగా చూశానని అన్నారు. అక్కడ సుమారు 25 లక్షల ఓట్లు దొంగలించారంటే, ప్రతి ఎనిమిది ఓట్లలో ఒకరిది నకిలీ ఓటని అన్నారు. అదే విధంగా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కూడా ఓటు దోపిడీ జరిగిందన్నారు. 'ఇది బీజేపీ, ఈసీ కలిసి రూపొందించిన ఓ వ్యవస్థ. మా వద్ద ఇంకా చాలా వివరణాత్మక సమాచారం ఉంది. ఇప్పటివరకు కొంత మాత్రమే చూపించాం. తగిన సమయానికి మిగతా ఆధారాలను కూడా బయటపెడతాం' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.



విశ్వ వీక్షణం



గుజరాత్‌లో ఇద్దరు ఉగ్రవాదుల అరెస్టు

- రెండు పిస్టల్స్, బెరెట్టా పిస్టల్, 30 బుల్లెట్లు స్వాధీనం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, అహ్మదాబాద్, నవంబర్ 9 : దేశవ్యాప్తంగా ఉగ్రదాడులకు కుట్ర పన్నుతున్నారంటూ ముగ్గురు ఉగ్రవాదులను అహ్మదాబాద్‌లో గుజరాత్ యాంటీటెర్రరిజం స్క్వాడ్ ఆదివారం అరెస్టు చేసింది. యేడాది నుంచి వీరి మీద నిఘా పెట్టిన అధికారులు ఆయుధాలు సరఫరా చేస్తుండగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు గ్లోక్ పిస్టల్స్, ఒక బెరెట్టా పిస్టల్, 30 బుల్లెట్లు, 4 లీటర్ల ఆముదం నూనెను స్వాధీనం చేసుకున్నారు. నిందితులలో ఒకడైన అహ్మద్ మొహియుద్దీన్ హైదరాబాద్‌వాసి అని గుజరాత్ డీఐజీ సునిల్ జోషి తెలిపారు. మరో ఇద్దరు నిందితులు ఆజాద్ సులేమాన్ షేక్, మొహమ్మద్ సుహెల్ సలీంఖాన్ ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందినవారని పేర్కొన్నారు. అహ్మద్ మొహియుద్దీన్ ఇప్పటికే పలు ఉగ్ర కార్యకలాపాలలో పాల్గొన్నాడు. అతడు అహ్మదాబాద్‌కు వస్తున్నట్టు సమాచారం అందడంతో నిఘా పెట్టారు. అదాలజ్ టోల్ ప్లాజా సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. అహ్మద్ మొహియుద్దీన్ చైనాలో ఎంబీబీఎస్ చేసాడు. దేశంలో పెద్ద ఎత్తున నష్టం కలిగించే ఉగ్రదాడి చేయాలని కుట్ర పన్నాడని పోలీసులు చెప్పారు. పలువురు విదేశీయులతోనూ టచ్‌లో ఉన్నాడు. టెలిగ్రామ్ ద్వారా ఓ ఉగ్రసంస్థతో అతడు సంబంధాలు కొనసాగిస్తున్నాడు. ఆముదం గింజలను ప్రాసెస్ చేసిన తర్వాత మిగిలిపోయిన వ్యర్థ పదార్థాల నుంచి రైసిన్ అనే విషాన్ని తయారు చేస్తున్నాడని పోలీసులు గుర్తించారు. గుజరాత్‌లోని కాలోల్ నుంచి ఆయుధాలు తీసుకుని మరో ప్రాంతానికి వెళ్తుండగా అహ్మద్ మొహియుద్దీన్ పోలీసులకు చిక్కాడు.

ప్రతిపక్షం
Prathipaksham.in




ఎడారి వసంతం-26

గొలుసు కథ



పద్మావతి పాడిచేటి
పశ్చిమాఫ్రికా



జరిగిన కథ:

సంకేతును తమ ఇంటికి ఎందుకు తీసుకువచ్చావని ఇందిరను కోప్పడుతుంది ఝాన్సీ. కానీ అతను తమ పాఠశాలలో ఒక విద్యార్థిని కిడ్నాప్ చేయడం వల్ల ఇంటికి తీసుకురాక తప్పలేదని వివరిస్తుంది ఇందిర. తండ్రితో ఆనందంగా గడుపుతూ ఉంటుంది సిరిమువ్వ. ప్రణవ్ ను అక్కున చేర్చుకొని ఓదారుస్తాడు సూర్య. కానీ తన అమ్మ అంజలి ప్రవర్తన గుర్తుకు వచ్చి ప్రణవ్ మరింత ఆందోళన పడుతూ ఉంటాడు. హల్దీ ఫంక్షన్ జరుగుతుంటే సామ్రాట్ హఠాత్తుగా వచ్చి అందరినీ భయపెడుతుంటాడు. రాజీవ్ జ్వాలాకి ఫోన్ చేసి త్వరగా రమ్మంటాడు.
(ఇక చదవండి)

ఒక నిమిషం పాటు ఆలోచనలో పడ్డ జ్వాలాముఖి వెంటనే తేరుకుని రెండవ నిమిషంలో చేయాల్సిన పనుల ప్రణాళిక సిద్ధం చేసుకుంది. రాజీవ్ నెంబర్ కు కాల్ చేసింది. సామ్రాట్ లిఫ్ట్ చేసాడు. అతనితో "నువ్వు చెప్పినట్లే జరుగుతుంది. కానీ నీ వాళ్ళను అక్కడికే తీసుకువస్తున్నాను. ఫైల్స్, డాక్యుమెంట్స్ కూడా తీసుకుని వస్తున్నాను.. ఈలోపు అక్కడ ఎవరికి ఏ అపకారం జరిగినా అది నీకు చాలా నష్టం కలిగిస్తుందని మర్చిపోకు" అంది. సమాధానంగా "డన్..యూ కమ్ ఫాస్ట్" అని కట్ చేశాడు. ముసుగు మనుషుల్తో జీప్ లో బయల్దేరి గోల్డెన్ స్వాన్ హోటల్ కి చేరుకుంది. రిసెప్షనిస్ట్ వద్ద ఫంక్షన్ వివరాలు, ప్రొటెక్షన్ కోసం వచ్చానని చెప్పి హాల్ కి చేరుకుంది.

***

హాస్పిటల్లో "ఎవరది....." అంటూ అరుస్తున్న బలరాం కేకలు విని నర్స్ మరో ఇద్దరితో లోపలికి వచ్చింది. బలరాం కిటికీవైపు చూపిస్తూ ఆయాసపడుతుంటే మరో నర్స్ తో "అతనికి మంచినీళ్ళు పట్టించమని" చెప్పి.. బయటకు పరుగెత్తి చూసి అక్కడెవరూ లేరంటూ లోపలికి వచ్చింది. కానీ దూరంగా పిల్లర్ ని ఆనుకుని నిలుచున్న వ్యక్తి నవ్వుతూ అక్కడినుండి కదిలి వెళ్ళిపోయాడు.

*****

అంజలి విమానాశ్రయం నుండి పరిణయతో ప్రణవ్ కు ఫోన్ చేయించింది. ప్రణవ్ పంపిన లొకేషన్ మ్యాప్ చూస్తూ తల్లీ, కూతుళ్ళు హాల్ కి వచ్చేశారు.

****

జ్వాలాముఖి లోపలికి వెళ్ళగానే తలుపులు మూసేసారు. వెంటనే పేపర్లు ఇవ్వమంటూ చేయి చాచాడు సామ్రాట్. అదే సమయంలో తలుపు టకటకా శబ్దం అవడంతో అందరి దృష్టి అటువైపు మళ్ళింది. ఆ ఒక్కక్షణం అవకాశాన్ని వృథా పోనీయలేదు జ్వాల. రాజీవ్ కి సైగ చేస్తూనే హఠాత్తుగా సామ్రాట్ చేయి అందుకుని మెలిపెట్టింది. రాజీవ్ గన్ లాక్కుని అతని తలకే గురి పెట్టాడు.చక్రవర్తి, ఝాన్సీ వసుమతిని కదలకుండా పట్టేశారు. కొడుకును కాపాడే ప్రయత్నంగా సిరిని పట్టుకోవడానికి ముందుకు పరుగెత్తిన నాగరత్నంకి ఇందిర కాలు అడ్డుపెట్టడంతో కిందపడిపోయింది. క్షణంలో కథంతా మారిపోయింది. 'ఎలాగూ తనవాళ్ళు జ్వాలాముఖి చేతినుండి తప్పించుకున్నారు. ఇంక పత్రాలు తీసుకుని సుగుణమ్మను, సిరిని, ప్రణవ్ ని చంపి.. తల్లి కక్ష తీర్చి వెళ్ళి హాయిగా ఎంజాయ్ చేస్తాను' అనుకున్నాడు సామ్రాట్. అక్కడే జ్వాలను తక్కువ అంచనా వేసి దొరికిపోయాడు. తలుపులు తెరవగానే అంజలి, పరిణయ ఏం జరిగిందో అర్థంకాక భయంభయంగా లోపలికి వచ్చారు. వాళ్ళ వెనకే వచ్చిన మఫ్టీ పోలీసులు సామ్రాట్ ని వసుమతిని, నాగరత్నంను పట్టుకోగా జ్వాలాముఖి వాతావరణాన్ని కూల్ చేస్తూ "టెన్షన్ నుండి బయటపడి హెల్దీ గా హల్దీ మొదలుపెట్టండి. కాబోయే కొత్త జంటకు ఆల్ ది బెస్ట్. నేను వీళ్ళ పనిపట్టి మళ్ళీ వస్తాను." అంటూ వెళ్ళిపోయింది.

*****

సూర్యను చూడగానే అంజలి తలవంచుకుని కన్నీళ్ళతో "నేను నీ అంజలిగా వచ్చాను. నన్ను క్షమించగలవా సూర్యా" అంది. ప్రణవ్, పరిణయ చూపులతోనే తండ్రిని అర్థిస్తుంటే సూర్య మనస్ఫూర్తిగా భార్య భుజంచుట్టూ చేయి వేశాడు. అప్పటివరకూ ఉన్న ఉత్కంఠ స్థానంలో అందరికీ ఉత్సాహం వచ్చేసింది. అంజలి అత్తగారి వద్దకు వెళ్ళి కాళ్ళు మొక్కడంతో హాలంతా చప్పట్లతో మార్మోగిపోయింది. పసుపు నీళ్ళలో తడవటంవల్ల, సామ్రాట్ చేసిన హల్చల్ వల్ల భయంతో వణికిపోయిన హరి, సుందరిలకు వెచ్చగా పాలు తాగించి మళ్ళీ మామూలుగా అయ్యాక నృత్యం, గానా బజానాల్లో మునిగిపోయారు అందరూ.

*****

జ్వాలాముఖి స్టేషన్ లో ముసుగు వ్యక్తులున్న సెల్ లోకి వెళ్ళి వాళ్ళ ముసుగులు తొలగించింది. ముగ్గుర్లో ప్రధానమైన వ్యక్తి ముఖం చూసి ఆశ్చర్యంతో "నువ్వా!???.." అంది.

*****

సంకేత్ కూతురితో సంతోషంగా ఉండటం చూసాక.. ఇందిర చక్రవర్తి అతణ్ణి పిలిచి "స్కూల్ విద్యార్థి నీవద్ద ఉన్నాడన్నావు. మరో తల్లి బిడ్డని ఏడిపిస్తూ నీ కూతురుతో నువ్వు ఇలా ఎలా ఉండగలుగుతున్నావు. ఏ శాపమో సిరిమువ్వ ఇన్నేళ్ళు అనాథ అనిపించుకుంది. ఇప్పుడు మరో పాపం చేయవద్దు ప్లీజ్ "అంది. సంకేత్ తడబడుతూ "నిజానికి నేనెవ్వరినీ కిడ్నాప్ చేయలేదు. నా కూతురిని ఈ కళ్ళతో పోల్చుకోలేక మిమ్మల్ని అలా బెదిరించి నిజం చెప్పించుకున్నాను. ఆ పాత సంకేత్ దీక్షతోనే చనిపోయాడు. ఇప్పుడు కేవలం నేను సిరిమువ్వ తండ్రిని మాత్రమే.. నన్ను నమ్మండి" అని ప్రాధేయపడ్డాడు. అతడి మాటల్లో నిజాయితీ కనిపించి ఇద్దరూ ఊపిరి పీల్చుకున్నారు.

****

సూర్య లాప్టాప్ లో ఏదో పనిలో ఉన్నాడు. ఇంతలో అతని ఫోన్ రింగ్ అయింది. జ్వాలాముఖి కాలింగ్... అతను ఫోన్ లిఫ్ట్ చెయ్యగానే ఆమె కంగారుగా "సిరికి ఆపద ఇంకా తప్పలేదు. కొత్తవారెవరినీ నమ్మకండి. సిరిని ఒంటరిగానే కాదు సంకేత్ తో కూడా బయటకు పంపవద్దు. అతడికి కూడా ప్రమాదం పొంచుంది. చక్రవర్తి, ఇందిర, ఝాన్సీ లతో కూడా ఈవిషయం చెప్పు.. జాగ్రత్త" అంటూ కట్ చేసింది. సూర్య ఆశ్చర్యపడ్డాడు. 'పాపం..సిరితల్లి! ఇంత చిన్నవయసులో ఎన్ని చిక్కులు ఎదుర్కుంటోంది.. మళ్ళీ వచ్చిన ఈ కొత్త సమస్యకు కారణం ఎవరయ్యుంటారు' అని ఆలోచిస్తూ 'ముందు అందర్నీ అలర్ట్ చేస్తే తరువాత ఆలోచించవచ్చు' అనుకుంటూ చక్రవర్తి వద్దకు బయల్దేరాడు.

(సశేషం)

చొరబాటుదారులకు విపక్షాల మద్దతు

- మరోసారి విరుచుకుపడిన కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పాట్నా, నవంబర్ 9 : కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా విపక్ష పార్టీలపై మరోసారి విరుచుకుపడ్డారు. ప్రధాని నరేంద్ర మోడీ బిహార్‌లో పారిశ్రామిక కారిడార్‌నిర్మించాలని అనుకుంటున్నారని, మహాఘట్‌బంధన్ కూటమి మాత్రం ఇందుకు వ్యతిరేకిస్తున్నదని ఆరోపించారు. చొరబాటుదారుల కోసం కారిడార్ నిర్మించేందుకు యత్నిస్తోందని విమర్శించారు. చొరబాటుదారులను రక్షించేందుకే రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్ బిహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర' చేపట్టారని ఎద్దేవా చేశారు. బిహార్‌లో నివసిస్తున్న పేదలు, దళితులు, ఈబీసీల జీవితాలలో మార్పు తీసుకురావడమే పేరుతో ప్రతిపక్షాలు ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. బిహార్‌ససారాం, అర్వాల్ పట్టణాలలో అమిత్‌షా ఆదివారం ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. భవిష్యత్‌లో పాకిస్తాన్‌పై వేసే ప్రతి మోర్టార్ షెల్‌ను బిహార్‌లోని ఆయుధ కర్మాగారంలో తయారు చేస్తారని పేర్కొన్నారు. ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ భావిస్తే ఎన్నికల కమిషన్‌కు అధికారికంగా ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ, లాలూ నేతృత్వంలోని ప్రభుత్వం ఉన్నప్పుడు, ఉగ్రవాదులు మన దేశంలో ఇష్టానుసారంగా దాడి చేశారన్నారు. ఇప్పుడు పరిస్థితి మారిందిని, తాము ఉగ్రవాదులను వారి ఇండ్లలోనే చొరబడి కొడుతున్నామన్నారు.





ఆధ్యాత్మిక రాజధానిగా ఉత్తరాఖండ్

- ప్రధాని నరేంద్ర మోడీ వెల్లడి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, డెహ్రాడూన్, నవంబర్ 9 : పెద్ద ఎత్తున తీర్థయాత్ర స్థలాలున్న ఉత్తరాఖండ్ రానున్న కాలంలో ప్రపంచ ఆధ్యాత్మిక రాజధానిగా మారుతుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఇక్కడి ఆలయాలు, ఆశ్రమాలు, ధ్యాన, యోగ కేంద్రాలను ప్రపంచ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయడానికి అవకాశం ఉందన్నారు. ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో ఆదివారం జరిగిన రజతోత్సవంలో ప్రధాని మోడీ పాల్గొన్నారు, 8,260 కోట్ల వ్యయంతో కూడిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ రెండు లక్షల కోట్ల వ్యయంతో కూడిన మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు జరుగుతున్నాయని తెలిపారు. 25 యేండ్ల క్రితం నాలుగు వేల కోట్లు ఉన్న ఉత్తరాఖండ్ బడ్జెట్ ఇప్పుడు లక్ష కోట్లు దాటిందన్నారు. దేశ విదేశాల నుంచి ప్రజలు ఆరోగ్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. ఔషధ మూలికలు, ఆయుర్వేద ఔషధాలకు డిమాండ్ వేగంగా పెరుగుతోందని ప్రధాని చెప్పారు. ఆరోమెటిక్ మొక్కలు, ఆయుర్వేద మూలికలు పెంచడంలో, యోగం, ఆరోగ్య పర్యాటకంలో ఉత్తరాఖండ్ అద్భుతమైన ప్రగతి సాధించిందన్నారు. ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి ఉత్తరాఖండ్‌లో ప్రవేశపెట్టిన ఉమ్మడి పౌరస్మృతి ఇతర రాష్ట్రాలకు నమూనాగా నిలిచిందన్నారు.


పాకిస్తాన్‌కు అర్థమయ్యే రీతిలో జవాబు చెప్పాలి

- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, బెంగళూరు, నవంబర్ 9 : దాయాది దేశం పాకిస్తాన్ కు అర్థమయ్యే భాషలోనే సమాధానం చెప్పాల్సి ఉంటుందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. భారత్‌కు సహకరిస్తేనే వారికి మేలు జరుతుందన్నారు. సంఘ్ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా బెంగళూరులో ఆదివారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మోహన్ భాగవత్ మాట్లాడారు. భారత్ ప్రతి దాడిలోనూ పాకిస్తాన్‌కు నష్టం జరిగేలా ఓడించాలన్నారు. అప్పుడే పాకిస్తాన్ పశ్చాతాపం చెందుతుందని పేర్కొన్నారు. పాకిస్తాన్‌తో ఎల్లప్పుడూ భారత్ శాంతినే కోరుకుంటుందని, కానీ, పాకిస్తాన్ అలా కోరుకోవటం లేదన్నారు. భారత్‌కు హాని చేసి సంతృప్తి చెందినంత కాలం పాకిస్తాన్ అలాగే చేస్తూనే ఉంటుందన్నారు. '1971 పాకిస్తాన్ మన మీద దండయాత్ర చేసింది. భారత్‌కు 90 వేల మంది సైనికులను కోల్పోయింది. అలా వరుసగా జరిగితే పాకిస్తాన్ ఒక రోజు పాఠం నేర్చుకుంటుంది. యుద్ధం చేయటానికి పోటీపడే కంటే మనకు సహకరించమే మేలని అర్థమవుతుంది. వారికి మరో భాష అర్థమవుతుందని అనుకోవటం లేదు. భారత్‌ను ఏమి చేయలేమనే విషయం అర్థంకావాలి. సన్నిహితంగా, స్నేహంగా, నిజాయితీగా సహకరించటమే మార్గమని అర్థం చేసుకోవాలి. పదే పదే చేసే కుట్రలను ఎదుర్కొనేందుకు మనం సిద్ధంగా ఉండాలి' అని మోహన్ భాగవత్ వివరించారు.







సెర్బియా దిగ్గజం జకోవిచ్ అద్భుత రికార్డు

తన కెరీర్‌లో 101వ ఏటీపీ టైటిల్

సెర్బియా దిగ్గజం నొవాద్ జకోవిచ్ తనదైన ఓ అద్భుత రికార్డు నెలకొల్పాడు. ఏథెన్స్‌లో జరిగిన హెల్లెనిక్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో లొరెంజో ముసెట్టిని ఓడించి తన కెరీర్‌లో 101వ ఏటీపీ టైటిల్ సాధించాడు. ఈ టైటిల్ జకోవిచ్‌కు ఒక ట్రోఫీ మాత్రమే కాదు, టెన్నిస్ ప్రపంచంలో ఓ మైలురాయిగా నిలిచింది. టైటిల్ అంతకుముందు స్విట్జర్లాండ్‌కు చెందిన లెజెండ్ రోజర్ ఫెదరర్ పేరిట ఉండేది. జొకోవిచ్ ఆ రికార్డును బద్దలు కొట్టి ప్రపంచంలోనే 72 హార్డ్ కోర్ట్ టైటిల్స్ సాధించిన మొట్టమొదటి ఆటగాడిగా నిలిచాడు. ఇప్పటి వరకు అత్యధిక హార్డ్ కోర్ట్ టైటిల్స సాధించినవారు. నొవాక్ జకోవిచ్ 72, రోజర్ ఫెదరర్ 71, ఆండ్రీ అగస్సీ 46. అయితే, లొరెంజో ముసెట్టితో జరిగిన ఫైనల్ మ్యాచ్ జకోవిచ్‌కు అంత తేలికగా దక్కలేదు. మూడు సెట్లపాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో జకోవిచ్ తన అనుభవాన్ని, పట్టుదలను ప్రదర్శించాడు. తొలి సెట్‌ను 4-6 తేడాతో కోల్పోయిన జకోవిచ్, రెండో సెట్‌లో 6-3తో పుంజుకున్నాడు. చివరి సెట్‌లో ఇద్దరి మధ్య హోరాహోరీ నడిచింది. జకోవిచ్ చివరికి 7-5 తేడాతో సెట్‌ను, మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. 38 యేండ్ల 5 నెలల వయసులో ఏటీపీ టైటిల్ గెలిచిన అత్యంత పెద్ద వయస్కుడైన ఆటగాడిగా కూడా జకోవిచ్ నిలిచాడు. 1977లో కెన్ రోస్‌వాల్ తర్వాత ఈ ఘనత సాధించాడు.



'హాంగ్‌కాంగ్ సిక్సెస్' లో పాక్ గెలుపు

ఫైనల్ మ్యాచులో కువైట్ ఓటమి

ఎట్టకేలకు పాకిస్తాన్ హాంగ్‌కాంగ్ సిక్సెస్ టోర్నమెంట్‌లో చరిత్మాతక విజయాన్ని నమోదు చేసింది. ఫైనల్ మ్యాచులో కువైట్ ను ఓడించి ఆరోసారి టైటిల్‌ను గెలుచుకుంది. దాంతోపాటు అత్యధిక టైటిళ్లు సాధించిన జట్టుగా అగ్రస్థానంలో నిలిచింది. భారత్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో ఓడిపోయినప్పటికీ, పాకిస్తాన్ పుంజుకుని తన ఆధిపత్యాన్ని నిరూపించుకోవడం విశేషం. కెప్టెన్ అబ్బాస్ అఫ్రిది మెరుపు ఇన్నింగ్స్ ఆడి పాకిస్తాన్ ను విజయపథాన నడిపించాడు. టోర్నమెంట్ అంతటా అఫ్రిది జట్టుకు అత్యంత వేగంగా పరుగులు సాధించి పెట్టాడు. కువైట్ పై జరిగిన ఫైనల్‌లో అఫ్రిది 11 బంతులలో 52 పరుగులు చేశాడు. భారత్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ అఫ్రిది 12 బంతులలోనే అర్ధ సెంచరీ నమోదు చేశాడు. ఈ మెరుపు ఇన్నింగ్స్‌లు అతను హాంగ్‌కాంగ్ సిక్సెస్ ఫార్మాట్‌కు ఎంత సరిగ్గా సరిపోతాడో నిరూపించాయి. కాగా, అబ్దుల్ సమద్ 42 కూడా రాణించడంతో పాకిస్తాన్ మంచి బ్యాటింగును ప్రదర్శించగలిగింది. ఈ టోర్నమెంట్‌లో కువైట్ జట్టు గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. బలమైన జట్లతో పోటీ పడి మరీ ఫైనల్‌కు చేరుకుంది. అద్నాన్ ఇద్రిస్ మొదటి ఓవర్‌లోనే ఐదు సిక్సులు బాది 30 పరుగులు సాధించడం గమనార్హం. పాకిస్తాన్ అనుభవ బౌలింగ్ కారణంగా కువైట్ 92/6 చేయగలిగింది. ఈ టోర్నమెంట్ లో భారత జట్టు ప్రయాణం ఉత్కంఠగా సాగినా టైటిల్ గెలవకుండానే ముగిసింది.



స్వదేశంలోనే ఐపీఎల్–2026 వేలం

27 నుంచి మహిళా జట్ల మెగా వేలం


ఐపీఎల్ 2026 వేలం ఈసారి స్వదేశంలోనే జరుగనుంది. గత రెండేండ్ల పాటు వేలం పాటలను దుబాయి, సౌదీ అరేబియాలో జరిగాయి. ఇక ఇప్పుడు భారత్ లోనే వేలం పాటలు జరిగేలా బీసీసీఐ తేదీలను నిర్ణయించింది. డిసెంబర్ 15న భారత్‌లో వేలం నిర్వహించనున్నారు. ఐపీఎల్‌లోని పది ఫ్రాంచైజీలు తమ రిటైన్ చేసుకునే ఆటగాళ్ల తుది జాబితాను 15 నవంబర్ లోగా బీసీసీఐకి సమర్పించాలి. అధికారికంగా రిటెన్షన్ నియమాలు ప్రకటించనప్పటికీ, ఇది 'మినీ వేలం' తరహాలో ఉంటుంది కాబట్టి, గరిష్టంగా 15 మందిని రిటైన్ చేసుకునే అవకాశం ఉంది. 'ట్రేడ్' విండో ద్వారా మరికొందరిని మార్పిడి చేసుకునే అవకాశం ఉంటుంది. సాధారణంగా ప్రతి సంవత్సరం పర్స్ విలువ పెరుగుతుంది. ఈసారి కూడా ఫ్రాంచైజీలకు అధిక మొత్తం అందుబాటులో ఉండే అవకాశం ఉంది. దీంతో ఫ్రాంచైజీలు మరింత మం మైలైన క్రీడాకారులను కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. మహిళల ప్రీమియర్ లీగ్ వేలం ఈ నెల 27 న ఢిల్లీలో జరగనుంది. ఇది 'మెగా వేలం' కావడంతో జట్లు తమ జట్టును దాదాపు పూర్తిగా కొత్తగా ఏర్పాటు చేసుకోవలసి ఉంటుంది. ముంబై ఇండియన్స్, రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ వంటి జట్లు ఐదుగురు చొప్పున ఆటగాళ్లను మాత్రమే రిటైన్ చేసుకున్నాయి. మిగిలినవారంతా వేలం లోకి వస్తారు. దక్షిణాఫ్రికా బ్యాటర్ లారా వోల్వార్ట్ పూల్‌లోకి వస్తుండటంతో తీవ్ర పోటీ ఉండే అవకాశాలు ఉన్నాయి.



చెన్నై సూపర్ కింగ్స్ లో భారీ మార్పులు

రాజస్థాన్ కు జడేజా, చెన్నైకి సంజూ శాంసన్

ఐపీఎల్ లో కీలక జట్టు అయిన సీఎస్కేలో భారీ మార్పులు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. రవీంద్ర జడేజాను రాజస్థాన్ రాయల్స్ కు వదిలేసి, అతనికి బదులుగా సంజు శాంసన్‌ను తీసుకోవడానికి చెన్నై సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, రవీంద్ర జడేజాతో పాటు యువ బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్‌ను కూడా తమకు ఇవ్వాలని రాజస్థాన్ రాయల్స్ కోరినట్లు సమాచారం. కానీ, ఇందుకు సీఎస్కే తిరస్కరించింది. దీంతో మార్పిడి కోసం జరుగుతున్న ప్రయత్నాలు కొలిక్కి రావట్లేదని తెలుస్తోంది. గత ఐపీఎల్ లో చెన్నై పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. అందుకే జట్టును తిరిగి పటిష్టంగా నిర్మించాలనుకుంటోంది. సంజు శాంసన్ వంటి కీలక డైనమిక్ వికెట్ కీపర్ బ్యాటర్‌ను చేర్చుకుంటే, అంతర్జాతీయ మ్యాచులు ఆడిన అనుభవం ఉన్న ప్లేయర్ ను తీసుకున్నట్టవుతుంది. ధోనీ కూడా ఎక్కువ రోజులు కొనసాగే అవకాశం లేకపోవడం వల్ల అతని వారసుడిగా సంజు శాంసన్ సరిగ్గా సరిపోతాడని భావిస్తున్నారు. ఈ ఇద్దరికీ ఆయా జట్లు 18 కోట్ల రూపాయలు చెల్లిస్తున్నాయి. ఈ క్రమంలో ఆల్ రౌండర్ రవీంద్ర జడేజాను వదులుకోవడానికి కూడా చెన్నై సిద్ధపడిందంటే, జట్టు పునర్నిర్మాణంలో మేనేజ్మెంట్ ఎంత కఠినంగా వ్యవహరిస్తోందో అర్థం చేసుకోవచ్చు. అదే సమయంలో డెవాల్డ్ బ్రెవిస్‌ను కూడా జట్టులో ఇంకొన్ని సీజన్ల పాటు కొనసాగించడం ఖాయంగా కనిపిస్తోంది. అతన్ని కూడా వదులుకోవడానికి సిద్ధంగా లేదు.




మహేశ్ కంటే ముందే ప్రియాంక లుక్

మహేశ్ బాబు గ్లోబల్ స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి కాంబోలో రాబోతున్న గ్లోబ్ ట్రోటర్ ప్రాజెక్ట్ ఎస్ఎస్ఎంబీ 29 . ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో ఆఫ్రికన్ అడ్వెంచరస్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్విరాజ్ సుకుమారన్ మరో కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే రిలీజ్ చేసిన పృథ్విరాజ్ సుకుమారన్ కుంభ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. జక్కన్న టీం రామోజీఫిలింసిటీలో ఎస్ఎస్ఎంబీ 29 టైటిల్ లాంచ్ ఈవెంట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ శివారులోని రామోజీ ఫిలింసిటీలో నవంబర్ 15న సాయంత్రం 6 గంటల నుంచి గ్రాండ్ ఈవెంట్ షురూ కానుంది. ఈ నేపథ్యంలో టైటిల్ ఏమై ఉంటుంది.. మహేశ్ బాబు లుక్ ఎలా ఉండబోతుంది.. ఇంతకీ హీరో పాత్ర పేరేంటి..? అంటూ తెగ చర్చించుకుంటున్నారు. తాజా సమాచారం ప్రకారం టైటిల్ లాంచ్ ఈవెంట్‌లో టైటిల్‌తోపాటే మహేశ్ బాబు పోస్టర్ కూడా బయటకు రాబోతుందట.

నవంబర్ 11న ప్రియాంకా చోప్రా పోస్టర్..!

అయితే ఈ రెండింటి కంటే ముందే హీరోయిన్ ప్రియాంకా చోప్రా లుక్ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని జోరుగా టాక్ నడుస్తోంది. తాజా కథనాల ప్రకారం నవంబర్ 11న ప్రియాంకా చోప్రా పోస్టర్, పాత్ర పేరు లాంచ్ చేయబోతుందట జక్కన్న టీం. ఈ క్రేజీ వార్తపై అధికారిక ప్రకటన ఏం రాకున్నా రాజమౌళి సరికొత్త స్ట్రాటజీతో ముందుకెళ్తున్నాడా..? అంటూ చర్చ నడుస్తోంది. ఇప్పటిదాకా ఏ సినిమా ఈవెంట్‌కు లేని విధంగా ఎస్ఎస్ఎంబీ 29 టైటిల్ లాంచ్ ఈవెంట్ ప్లాట్‌ఫాంను 130 అడుగుల వెడల్పు, 100 అడుగుల ఎత్తులో ఉండే విధంగా నిర్మిస్తున్నారట. ఈ మూవీని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ తెరకెక్కిస్తున్నారు. రెండు పార్టులుగా రాబోతున్న ఈ చిత్రాన్ని 2027, 2029లలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్టు వార్తలు వస్తుండగా జక్కన్న టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. ఇప్పటిదాకా ఏ సినిమా ఈవెంట్‌కు లేని విధంగా ఎస్ఎస్ఎంబీ 29 టైటిల్ లాంచ్ ఈవెంట్ ప్లాట్‌ఫాంను 130 అడుగుల వెడల్పు, 100 అడుగుల ఎత్తులో ఉండే విధంగా నిర్మిస్తున్నారట. ఈ మూవీని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ తెరకెక్కిస్తున్నారు. రెండు పార్టులుగా రాబోతున్న ఈ చిత్రాన్ని 2027, 2029లలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్టు వార్తలు వస్తుండగా జక్కన్న టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.




ఆంధ్రా కింగ్ తాలూకా 12న ఫస్ట్ అప్‌డేట్

మన టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోస్ లో ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కూడా ఒకరు. మరి రామ్ హీరోగా భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా దర్శకుడు మహేష్ బాబు తెరకెక్కిస్తున్న చిత్రం ఆంధ్ర కింగ్ తాలూకా కోసం అందరికీ తెలిసిందే. ఈ సినిమా నుంచి వచ్చిన ప్రతీ సాంగ్ సూపర్ హిట్ టాక్ ని సొంతం చేసుకున్నాయి. అయితే ఇక ఈ సినిమా ఫస్ట్ డే ఫస్ట్ షోకి సిద్ధం అయ్యింది. ఇది ఆ ఫస్ట్ డే ఫస్ట్ షో కాదు. ఇది కూడా ఒక సాంగ్. దీనికి మేకర్స్ డేట్ ఇచ్చేసారు. ఈ సాంగ్ ని ఈ నవంబర్ 12న విడుదల చేస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. సంగీత దర్శకులు వివేక్ - మెర్విన్ ల వర్క్ కి ఆల్రెడీ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇక ఈ సాంగ్ కి ఎలాంటి రెస్పాన్స్ వస్తుందో చూడాలి. ఇక ఈ సినిమాని మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తుండగా ఈ నవంబర్ 28న థియేటర్స్ లో గ్రాండ్ గా రిలీజ్ కి రాబోతుంది.



తిరువీర్ కొత్త సినిమా ప్రారంభం

జార్జిరెడ్డి, టక్ జగదీశ్, పరేషాన్ సినిమాలతో తెలుగులో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకున్నాడు తిరువీర్. ఇటీవలే ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు తిరువీర్. కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మిక్స్ డ్ టాక్ తెచ్చుకుంది. ఈ మూవీ సక్సెస్‌తో ఫుల్ జోష్ మీదున్న టాలెంటెడ్ యాక్టర్ తిరువీర్ అప్పుడే కొత్త ప్రాజెక్ట్ కూడా మొదలుపెట్టేశాడు. తిరువీర్ కొత్త సినిమా ఇవాళ హైదరాబాద్‌లో జరిగిన పూజా కార్యక్రమంతో గ్రాండ్‌గా మొదలైంది. భరత్ భూషణ్ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్న ఈ మూవీలో ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. ఫన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం నవంబర్ 19 నుంచి సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ చిత్రానికి భరత్ మాచిరాజు సంగీతం అందిస్తున్నాడు. సీహెచ్ కుశేందర్ సినిమాటోగ్రఫర్‌గా పనిచేస్తున్న ఈ మూవీ అన్ని దక్షిణాది భాషల్లో విడుదల కానుంది. ఇప్పటి దాకా తెలుగు రాష్ట్రాలకే పరిమితమైన తిరువీర్ ఈ సినిమాతో ఇక సౌతిండియాలో మంచి పాపులారిటీ తెచ్చుకోవడం గ్యారంటీ అని తెగ చర్చించుకుంటున్నారు మూవీ లవర్స్. ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకుంది ఐశ్వర్యా రాజేశ్. మరి తిరువీర్‌ఐశ్వర్యారాజేశ్ కాంబో సిల్వర్ స్క్రీన్‌పై ఎలాంటి మ్యాజిక్ చేయబోతుందో చూడాలి.



ఓటీటీలో మిత్రమండలి

ప్రియదర్శి, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా, విష్ణు ఓయ్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం మిత్రమండలి. ఈ మూవీతో సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ నిహారిక ఎన్ఎం హీరోయిన్‌గా టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. దీపావళి కానుకగా విడుదలైన ఈ చిత్రానికి విజయేందర్ ఎస్ దర్శకత్వం వహించాడు. కామెడీ డ్రామా నేపథ్యంలో వచ్చిన మిత్రమండలి థియేటర్లలో ఆశించిన స్థాయిలో ఇంప్రెస్ చేయలేకపోయింది. ఇక డిజిటల్ ప్లాట్‌ఫాంలో తన లక్‌ను పరీక్షించుకునేందుకు ఇటీవలే పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైం వీడియోలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైం వీడియోలో నవంబర్ 6 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ప్రస్తుతం తెలుగు, హిందీ, తమిళ భాషల్లో అందుబాటులో ఉంది. అయితే ప్రియదర్శి టీంలో జోష్ నింపే వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. మిత్రమండలిపై థియేటర్లలో విపరీతమైన ట్రోల్స్ రాగా.. అమెజాన్ ప్రైమ్‌లో మాత్రం ట్రెండింగ్‌లో నిలుస్తోంది. ప్రైమ్ వీడియో ఇండియా చార్ట్స్‌లో మిత్రమండలి ఐదవ స్థానంలో ట్రెండింగ్ అవుతోంది. మేకర్స్ కొన్ని పోర్షన్లు తొలగించి రీఎడిటెడ్ వెర్షన్‌ను డిజిటల్‌లో విడుదల చేశారు. మిత్రమండలి మూవీని బన్నీ వాస్ సమర్పణలో బీవీ వర్క్స్ బ్యానర్‌పై కల్యాణ్ మంథిన, భాను ప్రతాప, డాక్టర్ విజేందర్ రెడ్డి తీగల సంయుక్తంగా నిర్మించారు. ఆర్‌ఆర్ ధృవన్ సంగీతం అందించారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200